57419
Entered

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

స్నేహ

ఏప్రిల్ 25, 2010

కథా నిలయం
శ్రీకాకుళం



ఎన్నో చోట్లు... అవే పాట్లు...

హ్యాపీ బర్త్‌డే

(2010 ఏప్రిల్ 25 నుంచి 2010 మే 1 వరకు)



సి. విఖ్యాత్‌రాయల్
1సం॥, ఏప్రిల్-28
శ్రీదేవి-శ్రీధర్
ధర్మవరం-అనంతపురం

గ్రీష్మ
ఏప్రిల్
శోభారాణి-నాగేశ్వరరావు
యాచారం-రంగారెడ్డి

మాలిక్
7సం॥, ఏప్రిల్-27 -
నసీమాబేగం-అబ్దుల్ హక్కిం
ఇబ్రహీంపట్నం-రంగారెడ్డి

అఫ్రియా
ఏప్రిల్

ఎం.డి. నుమన్
ఏప్రిల్
నజియాబేగం-ఎం.డి.నయూమ్
మహబూబ్‌నగర్

సుశిరశ్రీ-సుశ్రితచంద్ర
2సం॥, ఏప్రిల్-2008
భవాని-నర్సింలు
రుద్రూర్-నిజామాబాద్

సిహెచ్. సాయికొండలు
10సం॥,ఏప్రిల్-2000
నాగమణి-సత్యనారాయణ
ఖమ్మం

కె. కోవిదకుమార్
1సం॥, ఏప్రిల్-30
సబిత-సురేష్‌కుమార్
లైన్‌వాడ-నల్లగొండ

జి. విశాల్
3సం॥,ఏప్రిల్-2007
పద్మ-జి.వి.బి.కుమార్
కందుకూరు-ప్రకాశం

ఎన్. సాయి
1సం॥, ఏప్రిల్-2009
రమ-ముత్యాలు
యాచారం-రంగారెడ్డి



తనిష్‌కుమార్-సాయిమధుమిత
2సం॥, ఏప్రిల్-2008
పావని-పాండురంగ
కర్నూలు

ఎస్. హరిశ్రేష్ఠ
4సం॥, మే-1
ప్రమీల-శాస్త్రులప్రాణేశ్
మహబూబ్‌నగర్

షోహెబ్ అయాన్
ఏప్రిల్-27
రబియా-బాషా
కర్నూలు

అప్సర
ఏప్రిల్-25
కరిమూన్-నాగూర్
అద్దంకి-ప్రకాశం

ఎస్‌కె. సాకిబ్‌హమ్మద్
1సం॥,ఏప్రిల్-2009
తస్లీమ్-గౌస్‌బాషా
బుచ్చిరెడ్డిపాలెం-నెల్లూరు

ENTERED

మనలో మాట

బంగారు 'పథకం'

బకాయిలు బాగా పేరుకుపోయినప్పుడు, బకాయిలు వసూలు మహా గగనమైపోయినప్పుడు, వచ్చిందే మహాప్రసాదమనుకున్నప్పుడు-వన్‌టైమ్ సెటిల్‌మెంట్ లాంటి డిస్కౌంటు పథకాలు రూపొందుతాయి. ఆదాయపు పన్నుశాఖ, అప్పులిచ్చిన బ్యాంకులు అప్పుడప్పుడు ఇలాంటి పథకాలు ప్రకటిస్తాయి. డబ్బున్న బాబులకే ఇవి బాగా ఉపయోగపడతాయి. ఇలాంటి సెటిల్‌మెంట్లకు కూడా లొంగని బడాబాబులుంటారు. వారు సాధారణంగా పెద్దపెద్ద పారిశ్రామికవేత్తలు, సినీతారలు అయి ఉంటారు... ఇలాంటి రుణ విమోచన పథకాలు బ్యాంకులు, ఇన్‌కమ్‌ట్యాక్సులకు పరిమితం కావు. దేవుళ్ల దగ్గర కూడా ఉంటాయి. ఉదాహరణకు తిరుమల వెంకటేశ్వరుణ్ణి చాలామంది కలియుగ దైవంగా భావిస్తారు. వెంకటరమణా పాపహరణా అని ప్రార్థిస్తారు. అన్యాయం చేసో, అబద్ధాలు చెప్పో, అక్రమాలకు పాల్పడో కోట్లకు కోట్లు గడించుకోవచ్చు. బతికే క్రమంలో ఇవన్నీ మామూలేనని సరిపెట్టుకోవచ్చు. చివరాఖరిలో వెంకటేశ్వరుణ్ణి దర్శించి, పాపం హరించమని ప్రార్థిస్తే సరిపోతుంది. సంపాదించిన దానిలో కొంత స్వామికి అజ్ఞాతంగానో, బహిరంగంగానో అర్పించి, పాపం శమించుగాక! అంటే అయిపోతుంది. ఈ విమోచన పథకంలో భాగంగా తిరుపతి వెంకన్నకు కేజీల కొద్దీ బంగారం జమవుతుంది. బంగారం బహుప్రియమైపోయిందని సామాన్య జనం ఆందోళన చెందుతుంటే- స్వామికి కుప్పతెప్పలుగా వచ్చి చేరుతుంది. ఇట్లాంటి భూరి విరాళాలను చూసి జనం ఆశ్చర్యపోతారు. ఎంత మహాదానమని సంభ్రమం వ్యక్తం చేస్తారు. ఇలాంటి కానుకలు సమర్పించేవాళ్లు సామాన్యులై ఉండరు. సాధారణంగా బడా పారిశ్రామికవేత్తలు, సినీతారలు అయి ఉంటారు. అక్కడ చెల్లించనివారు ఇక్కడ చెల్లిస్తారు. అక్కడ భయపడని వారు ఇక్కడ భక్తిని ప్రదర్శిస్తారు. సెటిల్‌మెంట్లకు లొంగని వాళ్లు సెంటిమెంటుకు లొంగుతారు. భక్తులందరూ ఇంతేనని కాదు. భక్తుల్లో మహాభోక్తలైన భక్తుల తీరే వేరు!

★

ఈ సంచికలో....

టపా	...	2
రుచి	...	3
కవిత్వమ్	...	6
తెలుసుకుందామా	...	7
సీరియల్	...	8
వింత గ్రంథాలయాలు	...	12
అట్టమీది కథ	...	18
బాలనేస్తాలు	...	22
కథ	....	24
చూద్దామా	...	26
కొత్త పుస్తకాలు	...	28

ఇంకా...

స్ఫూర్తి ... 4

ప్రకృతి నేత్రం చైతన్య సూత్రం



సినిమా కబుర్లు ... 10

తెలుగు సినిమాల్లో శ్రామిక చైతన్య గీతి!

చల్లచల్లగా ... 17

ఫలూదా చల్లచల్లగా



అట్టమీది కథ ఆసక్తికరం

ఏప్రిల్ 11 నాటి స్నేహ ఆదివారం అనుబంధం అట్టమీది కథగా 'వేసవి వేళల అడవిబిడ్డల ఆహారం' ఆసక్తికరంగా వుంది. డా॥విజయ్ గారి ద్వారా కమ్మటి కర్బూజా విశేషాలు తెలిశాయి. 'వృద్ధాశ్రమం' కథ ఆసాంతం చదివింపచేసింది. దొంగకళ్లు స్కెచ్... నిఘా పరిజ్ఞానం ద్వారా కర్తవ్యం అందరికీ గుర్తుచేస్తున్నట్టనిపించింది. హంపి విశేషాలు కుతూహలం కలిగించాయి. 31వేళ్ల చిన్నారి వైనం అబ్బురపరిచింది. కొత్తపుస్తకాల ద్వారా నూతన పుస్తక పరిచయ భాగ్యం కలుగుతోంది. 'బాలనేస్తాలు'లో చిత్రవిచిత్రం అంటే మాకెంతో ఇష్టం. శ్రీశ్రీ అనంతం నుండి కొన్ని మచ్చుకు అందించడం స్ఫూర్తిదాయకంగా ఉంది. 'సినిమా కబుర్లు' ద్వారా ఓంపురిని కలుసుకోగలిగాం. వియత్నాం గెరిల్లా మిస్ అవకుండా ఫాలో అవుతున్నాం. 'దొంగల్లో దొర' కథనందించిన కృష్ణమూర్తి గారికి ధన్యవాదాలు. 'మనలోమాట' పుత్రరత్నం అయినా పుత్రికా వజ్రం అయినా కన్నవాళ్ల రుణం కాస్తయినా తీర్చుకున్ననాడే, సార్థకత అనిపించుకుంటుంది.

-నేమాన సుభాష్‌చంద్రబోస్, ఇలిసిపురం, శ్రీకాకుళం.

రియల్లీ సూపర్బ్

ఈ ఆదివారం అనుబంధం స్నేహ సర్వత్రా ఆసక్తికరం, అభినందనీయం. ఎచ్చోటకన్నా, ఏదివిన్నా అంతా సాహితీ ప్రవల్లికలతో కూడిన సమాహారమే. ఈవారం స్ఫూర్తి శీర్షికన ప్రచురించిన శ్రీశ్రీ విరచిత కవితా ప్రస్థానంలో కావ్యముద్రలు మహాకవి కలంలోనుండి పెల్లుబికాయి. సినిమా కబుర్లులో ఓంపురి జీవిత విశేషాలు నచ్చాయి. 'కవిత్వమ్'లోని 'బ్రతుకు తెరు, మహాశ్రీశ్రీ, రెక్కల విన్యాసం' కవితలు అక్షరచిత్రాలు. టేస్ట్ టేస్ట్‌లో చాక్‌లెట్, కొబ్బరి పాలు, బిస్కెట్ పుడ్డింగ్‌లు నోరూరించాయి. 'చూద్దామా'లో 'రాయల రాజధాని హంపి'లోని విరూపాక్ష దేవాలయం, ఏకశిలారథం, మహానవమి దిబ్బ, ఏకశిల వినాయకుడు, ఏనుగుశాల, లోటస్‌మహల్, విఠల ఆలయం చిత్రాలతో కూడిన విశేషాలు రియల్లీ సూపర్బ్.

టి.వి.డి.ఎన్.సీతారామారావు, విజయవాడ.

గుర్తుంచుకోవాల్సిన విషయాలు

ఈవారం వచ్చిన కథ చాలా బాగుంది. కొత్తగా వచ్చిన కొందరు కోడళ్లు లేనిపోని భయాలతో, అనవసరపు అనుమానాలు పెట్టుకుంటారు. అత్తామామల గురించి అతిగా ఊహించుకుని బాధపడి ఇంట్లోవారిని ఇబ్బంది పెడుతుంటారు. ఈ వృద్ధాశ్రమం కథలో ఉమ పాత్ర ద్వారా అటువంటి వారిగురించి చక్కగా వివరించారు. 'చల్లచల్లగా' ద్వారా డా॥విజయ్‌గారు కర్బూజా గురించి మాకు తెలియని విషయాలు తెలియజేశారు. 'మనలోమాట'లో చెప్పినట్లు 'కొడుకే పున్నామనరకం నుండి తప్పిస్తాడు, కూతురైతే ఆస్తి ఎగరేసుకుపోతుంది' అని ఆలోచించే వారు తమ ఇంట్లో ఉండే తల్లి, చెల్లెలు, భార్య కూడా ఆడవాళ్లేనని గుర్తుంచుకుంటే బాగుంటుంది.

విజయలక్ష్మి, వరంగల్.

చాలా బాగుంది

ఓంపురి వంటి విలక్షణ నటుడి గురించి సినిమా కబుర్ల ద్వారా తెలుసుకున్నాం. అడవి ప్రాంతాల్లో నివసించే గిరిజనులు ఆహారం ఎలా సేకరిస్తారు? సేకరించిన వాటిని ఎలా భద్రపరుచుకుంటారు? అనే వివిధ అంశాలు... ఇంకా కొండరెడ్ల జీవన శైలి గురించి అనేక అంశాలు ఈవారం అట్టమీది కథ ద్వారా వివరించారు. చాలా బాగుంది. దొంగకళ్లు శీర్షికలో చెప్పినట్లు పనిచేసే ప్రదేశంలో అలాంటి పరిస్థితులే ఎదురైతే జీవితం వారికి తాకట్టు పెట్టినట్టుగానో, బానిస బతుకుగానో అనిపిస్తుంది కానీ జీతానికి పనిచేసినట్టు కాదేమో! చూద్దామా శీర్షికలో చక్కని చిత్రాలతో హంపి నగరం గురించి వివరణ ఇవ్వడం బాగుంది.

సత్యనారాయణ, ఏలూరు.

చక్కటి వివరణ

చివరిపేజీ పిల్లల కథ 'దొంగల్లో దొర' బాగుంది. వున్నది ఒక్కరైనా, ఇద్దరైనా ఒక్కటే. వారిని పెంచే విధానంలోనే వారి భవిష్యత్తు ఆధారపడి వుంది అని చక్కగా వివరించారు. వియత్నాం గెరిల్లా సీరియల్ చాలా బాగుంది. ఆసక్తికరంగా సాగుతోంది. కవిత్వమ్‌లో మహా శ్రీశ్రీ, బ్రతుకు తెరు కవిత్వాలు నచ్చాయి. శ్రీశ్రీ గురించి స్ఫూర్తిలో చాలా విషయాలు తెలిపారు. శ్రీశ్రీకి వున్న కవితాసక్తిని గురించి ఆయనకి నచ్చిన పుస్తకాల గురించి తెలుసుకున్నాం.

ఈవారం కార్టూన్లు బాగున్నాయి. ఇంకా అన్ని ప్రాంతాల్లో దొరకని కర్బూజా పండు గురించి కూడా తెలుసుకున్నాం. అట్టమీది కథ 'వేసవి వేళల.. అడవి బిడ్డల ఆహారం...', కథ 'వృద్ధాశ్రమం' ఇలా.. అన్నీ బాగున్నాయి.

సుజాత, విజయవాడ.

అనేక విషయాలు...

స్ఫూర్తి ద్వారా శ్రీశ్రీ అనంతం నుండి కవితా ప్రస్థానంలో కావ్యముద్రలు వ్యాసం ద్వారా అనేక విషయాలు తెలియజేసినందుకు ధన్యవాదాలు. భావ కవిత్వానికి గుడ్‌బై చెప్పి మహాప్రస్థానం ద్వారా మరో ప్రపంచానికి మార్గదర్శకుడైన శ్రీశ్రీ నెత్తుటి సూర్యుడివలె నిప్పులు కక్కుతూ వుండే శ్రీశ్రీ కవిత్వం వుద్వేగభరితం, ఉత్తేజ కెరటం. సముద్రమంత ఆవేశం, ఎగరేసిన ఎర్ర బావుటం, విప్లవ శంఖం పూరించాడు శ్రీశ్రీ. శ్రీశ్రీ మరణం భౌతికం. కవిత్వం అజరామరం. 'వేసవిలో అడవి బిడ్డల ఆహారం' వ్యాసం బాగుంది. నేటి ఖనిజాల తవ్వకాల ప్రస్థానంలో గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకం.

టి. శ్రీరామ్మూర్తి, గాజువాక, విశాఖ.

★



బియ్యపు నూక వడియాలు

కావలసిన పదార్థాలు

బియ్యం నూక - 1 కిలో
అల్లం - చిన్న ముక్క
జీలకర్ర - 2 స్పూన్లు
పచ్చిమిర్చి - 20

తయారుచేసే విధానం

ఒక గ్లాసు నూకకి మూడు గ్లాసుల నీళ్లు చొప్పున ఎసరు పెట్టుకోవాలి. పచ్చిమిర్చి, అల్లం, జీలకర్ర మిక్సీలో వేసి ముద్దగా చేసుకుని మరుగుతున్న నీళ్లలో వేయాలి. ఎసరు మరిగాక బియ్యంనూక పోయాలి. ఉండ కట్టకుండా నూకను బాగా కలపాలి. గట్టిపడిన తర్వాత దింపి వడియాలు పెట్టుకోవాలి. బాగా ఎండనిచ్చి భద్రపరుచుకోవాలి.



సగ్గుబియ్యం - అల్లం వడియాలు

కావలసిన పదార్థాలు

సగ్గుబియ్యం - 1 కిలో
జీలకర్ర - 2 స్పూన్లు
అల్లం - అంగుళం ముక్క
పచ్చిమిర్చి - 20
ఉప్పు - తగినంత

తయారుచేసే విధానం

ఒక గ్లాసు సగ్గుబియ్యానికి ఐదు గ్లాసుల నీళ్లు పోసి ఒక రాత్రంతా నానబెట్టాలి. ఉదయాన్నే వాటిని ఉడకబెట్టాలి. అల్లం, జీలకర్ర, వాము, పచ్చిమిర్చిలను మిక్సీలో వేసి మెత్తగా నలగనివ్వాలి. ఈ ముద్దను వుడుకుతున్న సగ్గుబియ్యంలో వేయాలి. బాగా ఉడికిన తర్వాత దించాలి. ఒక పలుచని బట్టపై దాన్ని వడియాలుగా పెట్టుకోవాలి. రెండు రోజులు ఎండలో ఎండనిచ్చి తీసి భద్రపరచాలి.



క్యాబేజి వడియాలు

కావలసిన పదార్థాలు

క్యాబేజి - అరకేజీ
మినపప్పు - కేజీ
పచ్చిమిర్చి - 100గ్రా
జీలకర్ర - 2 స్పూన్లు
అల్లం - 2 అంగుళాల ముక్క
ఉప్పు - తగినంత

తయారుచేసే పద్ధతి

రాత్రి నానబెట్టి వుంచిన మినపప్పును ఉదయాన్నే పొట్టుపోయేట్టు కడగాలి. నీళ్లు లేకుండా వడగట్టాలి. గ్రైండర్‌లో వేసి వడగట్టిన పప్పును తగినంత ఉప్పు, కొద్దిగా నీరు పోసి మెత్తగా, గట్టిగా రుబ్బుకోవాలి. అల్లం, జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలను మెత్తగా నూరుకోవాలి. క్యాబేజీని సన్నగా తరగాలి. అల్లం ముద్దని, క్యాబేజి ముక్కల్ని మినప్పిండిలో బాగా కలపాలి. ఇప్పుడు పలుచటి బట్టమీద ఆ పిండితో వడియాలు పెట్టుకోవాలి. రెండురోజులు వాటిని బాగా ఎండబెట్టి భద్రపరుచుకోవాలి.



బూడిద గుమ్మడికాయ వడియాలు

కావలసిన పదార్థాలు

బూడిద గుమ్మడికాయ - 1
మినపప్పు - అరకిలో
పచ్చిమిర్చి - పావుకిలో
జీలకర్ర - కొంచెం
ఉప్పు - తగినంత

తయారుచేసే పద్ధతి

రాత్రి బూడిద గుమ్మడికాయను సన్నని ముక్కలుగా తురుముకోవాలి. వాటిని గుడ్డలో వేసి గట్టిగా మూటకట్టాలి. దానిమీద ఏదైనా ఎక్కువ బరువు పెట్టి వుంచుకోవాలి. ఉదయానికి నీరంతా పోతుంది. మినపప్పును కడిగి ఉప్పు వేసి మెత్తగా రుబ్బుకోవాలి. ఈ పిండిలో పచ్చిమిర్చి, నూరిన జీలకర్ర ముద్ద, గుమ్మడి ముక్కలువేసి బాగా కలపాలి. తర్వాత పలుచటి బట్టమీద దానితో వడియాలు పెట్టుకోవాలి. పచ్చిపోయేవరకు ఎండనిచ్చి తీసి భద్రపరుచుకోవాలి.



చిట్కా

ఐరన్ మాత్రలు వాడుతున్నట్టయితే వాటిని ఎప్పుడూ కాఫీతో పాటు గానీ, కాఫీ తీసుకునే ముందు, వెనుక గానీ వేసుకోకండి. కెఫిన్ వల్ల ఐరన్ శరీరంలో సరిగా ఇంకకుండా వృధా అవుతుంది.



స్ఫూర్తి



ఆయన తన రచనలన్నీ నాకు పంపారు. అవన్నీ చదివాక నాకు ఆయన మీద మరింత గౌరవం పెరిగింది. మన్నెం కథలు, అసలు సంతకం, నగరానికొచ్చిన నాగళ్లు, అన్నింట్లోనూ విషయం అదే. ఎందుకంటే అ సమస్యలు ఈ పదేళ్లలో పెరిగాయే కానీ తగ్గలేదు. వ్యక్తిగా, ప్రభుత్వోగిగా కూడా విద్యాసాగర్ తను చెప్పింది చూపారని తెలిసి ఆయన పట్ల గౌరవం, అభిమానం ఇనుమడించాయి.

ఈయన రచనల్లోని కొన్నింటిని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలుగా పెడితే చాలా ఉపయోగంగా వుంటుందనీ, పిల్లల లేత మనసుల మీద ఇవి సానుకూలమైన ప్రభావాన్ని చూపిస్తాయనీ అనుకుంటున్నాను. ఏదో ఒక రోజు 'మనిషాకడే విడిగా మనలేడు' పుస్తకాన్ని హిందీలోకి తీసుకురావాలనీ, తీసుకురాగలననీ ఆశిస్తున్నాను.

-ఆర్.శాంతసుందరి,
ప్రముఖ అనువాదకురాలు.

ప్రకృతి నేత్రం చైతన్య సూత్రం

దాదాపు ఐదు దశాబ్దాలుగా పుస్తకాలు చదువుతున్నాను. ఏ 20,30 పుస్తకాలో నన్ను ఏదో విధంగా ప్రభావితం చేసే వుంటాయి. అందుకే వాటిలో ఒక పుస్తకాన్ని ఎంచుకుని చెప్పడం కష్టమే. అయినా ప్రయత్నిస్తాను...

అసలు పుస్తకాలు మన ఆలోచనలని ప్రభావితం చేస్తాయే తప్ప జీవితంలో ఒక దిశగా స్ఫూర్తిని పూర్తిగా అందజేస్తాయని అనుకోను. మనం పుట్టిపెరిగిన వాతావరణం, మరీ చిన్నప్పుడు చదువుకున్న పాఠశాల వాతావరణం ముందుగా మన వ్యక్తిత్వాలని మలుస్తాయి. పిల్లల పెంపకం గురించి తను రాసిన పుస్తకంలో గొప్ప చైల్డ్ స్పెషలిస్ట్ డా॥బెంజమన్ స్పాక్ ఐదు సంవత్సరాలు నిండేసరికే పిల్లల వ్యక్తిత్వం 90శాతం ఏర్పడిపోతుందని అంటాడు. మిగతా 10 శాతం మాత్రమే వాళ్లు బయటి ప్రభావాల నుండి గ్రహిస్తారు. మొదటిసారి తల్లైనప్పుడు ఆ పుస్తకం చదివి ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. వీలైనంత వరకు అమలు చేశాను.

నాకు పిల్లలపట్ల వుండే ప్రేమ వల్ల అధ్యాపకవృత్తిని ఎంచుకుని దాదాపు 7ఏళ్లు అందులో పనిచేశాను. బి.ఇడి చేస్తున్నప్పుడు లైబ్రరీలో చదివిన ఎన్నో పుస్తకాలలో నన్ను ఎక్కువగా ఆకట్టుకున్నది బెర్ట్రాండ్ రసెల్స్ రాసిన 'చైల్డ్ సైకాలజీ' అనే పుస్తకం. ఆ పుస్తకం వల్ల స్ఫూర్తి పొంది 'మంచి టీచర్' అనే బిరుదుని నా విద్యార్థుల నుండి పొందాను.

ఒక్కో పుస్తకం ఒక్కో తలుపు తెరుస్తుంది. మనని ఒక కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. తెలుగు, ఇంగ్లీషు పుస్తకాలు బోలెడన్ని ఇంట్లో వుండేవి. కాలేజీలో చదువుకున్నది హిందీ కాబట్టి ఆ సాహిత్యంతో కూడా పరిచయం అయింది. తమిళం, ఉర్దూ (ఉర్దూ భాష మాత్రమే, లిపి కాదు) నా అంతట నేను ఆసక్తికొద్దీ నేర్చుకున్నాను. చదువుకుంటున్నంత కాలం, లైబ్రరీలే నా దేవాలయాలు!

కొత్త విషయాలు నేర్చుకోవాలన్న ఆసక్తి మా ఇంటి వాతావరణం వల్లే నాకు ఏర్పడింది. పెళ్లయ్యాక కూడా ఇంట్లో సాహిత్య వాతావరణమే. ఇప్పటికీ మా ఇంట్లో వున్న గొప్ప నిధి పుస్తకాలే!

ఇంట్లో ఎవరికీ లేని, ఆసక్తి కవిత్వం పట్ల నాకు మాత్రమే ఉంది. నా పదోఏట మహాదేవివర్మ అనే హిందీ కవయిత్రి రాసిన ఒక చిన్న కవిత రగిల్చిన ఆసక్తి అది. మహాదేవి వర్మ కవితలు నిరంతరం చదివితే ఎవరైనా కవిత్వం రాయగలుగుతారు అనేది హిందీ సాహిత్యవేత్తలూ, ప్రొఫెసర్లూ నమ్ముతారు. నేను కూడా చదువుకునే రోజుల్లో ఎన్నో కవితలు (హిందీలో) రాశాను. కానీ అవి నాకే నచ్చలేదు. అప్పుడే అర్థమైంది స్ఫూర్తి మాత్రమే చాలదు, సామర్థ్యం కూడా ఉండాలని!

ఇక ఒకే ఒక పుస్తకాన్ని గురించి ప్రస్తావించే ప్రయత్నం చేస్తానని అన్నాను కాబట్టి ప్రయత్నిస్తాను. ఎ.విద్యాసాగర్ రాసిన 'మనిషాకడే విడిగా మనలేడు' అనే పుస్తకం నాకు పదేళ్లక్రితం కవి స్వయంగా పంపారు. అప్పుడు మేము ఢిల్లీలో వుండేవాళ్లం.

కొత్త పుస్తకం వచ్చిందంటే వెంటనే పైపైన చూడడం అలవాటు నాకు. అందులోనూ కొత్త కవి, కవిత్వం (ఢిల్లీలో దాదాపు నాలుగు దశాబ్దాల కాలం వుండిపోవడం వల్ల కొత్త, యువ రచయితల గురించి అంతగా తెలిసేది కాదు). వెంటనే పుస్తకంలోని కవితలని అక్కడక్కడా చదివాను. ఆసక్తి పెరిగింది. పూర్తిగా చదివాను. అసలు ముందు పుస్తకం శీర్షికే ఆకట్టుకుంది. విద్యాసాగర్ రాసిన కవిత్వమంతా ఒక ఎత్తైతే, ఈ పుస్తకంలోని 'మానవత్వం-పర్యావరణం' అనే ముందుమాట, తొమ్మిది భాగాలుగా విభజించిన ఈ కవితా సంపుటిలో ఒక్కొక్క భాగానికీ కవి రాసిన పరిచయ వాక్యాలు ఒకెత్తు. నాకు ఎంతో ఇష్టమైన ప్రకృతి, దాని పరిరక్షణ, దానికీ జీవరాసులకీ వుండే అవినాభావ సంబంధంలాంటి విషయాలన్నీ ఇందులో వున్నాయి. వాటి గురించి నేను చాలా భావుకతతో ఆలోచిస్తాను. అసలు మనని ఆకట్టుకునే పుస్తకాలలోని విషయాలు, అంతకుముందే మన మనసుల్లో చూచాయగా ఉంటాయని నా వుద్దేశం. దాన్నే అభిరుచి అంటారేమో. జీవన గతిలో పెద్దలూ, పుస్తకాలూ, సినిమాలూ, బయటి ప్రపంచంలోని కొందరి మనుషులూ మన మనసుల్లో కొన్ని అభిప్రాయాలని నాటుతారు. తమాషాగా అప్పుడు కూడా మనకి నచ్చిన వాటినే మనం స్వీకరిస్తాం. అందుకే 'లోకోభిన్నరుచి' అనే మాట వచ్చింది.

కవిత్వానికి ఒక నిర్వచనమంటూ ఉంటుందని అనుకోను... ముఖ్యంగా ఈనాటి సాహిత్యంలో. "మంచి రచనలూ, చెడ్డ రచనలూ అంటూ వుండవు. బాగా రాసిన రచనలూ, బాగా రాయని రచనలూ అనేవి మాత్రమే వుంటాయి" అంటాడు ఆస్కార్ వైల్డ్. ఒకే సమయంలో

మనసుని కదిలించి, మెదడుని ఆలోచింపజేసేదే ఉత్తమ రచన. అది కవిత్వం కావచ్చు, కథ కావచ్చు, ఇంకేదైనా సాహిత్య ప్రక్రియ కావచ్చు. కవిత్వం పరిధి తక్కువ కాబట్టి అందులో ఈ రెంటినీ ఒకేసారి చూపించడం కష్టమని నా వుద్దేశం.

ఈ పుస్తకం శైలి గురించి ప్రస్తావిస్తూ విద్యాసాగర్ స్వయంగా ఏమంటారో చూడండి. 'కవిత్వమంటే పదాల అందమైన కూర్పు కాదు. కవిత్వం నడకలో లేదు. భావంలో వుంది'.

మొదటిసారి ఈ పుస్తకాన్ని చదివినప్పుడు నాలోని అనువాదకురాలు దీన్ని హిందీ పాఠకులకి అందించాలని చాలా ఉబలాటపడింది. కొన్ని కవితల్ని అనువదించి పంపాను. వాటిని పత్రికలు ప్రచురించాయి. కానీ అంతటితో నేను తృప్తి పడలేదు. విద్యాసాగర్ ఈ పుస్తకంలో పెట్టిన ఒక శీర్షిక 'పరిసర వేదం'. ఆ శీర్షికతో ఆయన 2001లో విశాఖ పట్నంలో జరిగిన తెలుగు ప్రపంచ మహాసభల్లో ఒక పత్రం చదివారు. అదే ఆయన్ని నేను మొదటిసారి కలుసుకోవడం. ఢిల్లీ వచ్చాక ఆ శీర్షికతో 'మనిషొకడే...' పుస్తకంలోని కవితలనీ, ముందుమాటలో రాసిన కొంత భాగాన్నీ పరిచయ వ్యాసంగా రాసి ఢిల్లీలోని నేషనల్ బుక్‌ట్రస్ట్ (అనువాదాలని ప్రోత్సహించే సంస్థ)కి పంపాను. ఈ పుస్తకాన్ని హిందీలోకీ, ఆ తరువాత ఇతర భారతీయ భాషల్లోకీ తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా వుందని ఉత్తరం రాసి, దాన్ని కూడా జత చేశాను. కానీ 'కవిత్వం మేము ప్రచురించడం లేదు' అంటూ వాళ్లందర్నించి నాకు జవాబు వచ్చింది (కానీ ఆ తర్వాత వాళ్లే ఒక తెలుగు కవితా సంకలనం పుస్తకంగా ప్రచురించారు. అది వేరే కథ).

ఒక కవి తన రచనలన్నింటినీ పర్యావరణం గురించి రాయడం, దానికీ మనుషుల మనుగడకీ ఉండే అవినాభావ సంబంధం గురించి "నైతిక బాధ్యత గానూ, నరజాతి భద్రతగానూ భావిస్తూ' దానికే అంకితం చేస్తూ రాయడం అనేది నేను ఇంతకుముందు ఎక్కడా ఎప్పుడూ చదవక పోవడం వల్ల ఈ పుస్తకం మొదటిసారి చదివినప్పుడు ఎంతగా ఆకట్టుకుందో, చదివిన ప్రతిసారీ అంతే ఆకట్టుకుంటోంది. దీన్ని హిందీలోకి అనువదించడం అనే ప్రణాళిక నా మనసులో ఇంకా అలాగే వుంది.

విద్యాసాగర్ ఎన్నో వుత్తరాలు రాశారు. నేను హైదరాబాద్‌కి వచ్చిన ఒకటి రెండేళ్లకి ఆయనకి కూడా హైదరాబాద్ బదిలీ అవడం వల్ల మరింత దగ్గరయ్యాం. ఆయన తన రచనలన్నీ నాకు పంపారు. అవన్నీ చదివాక నాకు ఆయన మీద మరింత గౌరవం పెరిగింది. మన్నెం కథలు, అసలు సంతకం, నగరానికొచ్చిన నాగళ్లు, అన్నింట్లోనూ విషయం అదే. ఎందుకంటే అ సమస్యలు ఈ పదేళ్లలో పెరిగాయే కానీ తగ్గలేదు. వ్యక్తిగా, ప్రభుత్వోగిగా కూడా విద్యాసాగర్ తను చెప్పింది చూపారని తెలిసి ఆయన పట్ల గౌరవం, అభిమానం ఇనుమడించాయి.

ఈయన రచనల్లోని కొన్నింటిని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలుగా పెడితే చాలా ఉపయోగంగా వుంటుందనీ, పిల్లల లేత మనసుల మీద ఇవి సానుకూలమైన ప్రభావాన్ని చూపిస్తాయనీ అనుకుంటున్నాను. ఏదో ఒక రోజు 'మనిషొకడే విడిగా మనలేడు' పుస్తకాన్ని హిందీలోకి తీసుకురావాలనీ, తీసుకురాగలననీ ఆశిస్తున్నాను.

నన్నింతగా ఆకట్టుకున్న ఈ పుస్తకంలోని కొన్ని కవితా పంక్తులని పాఠకులతో పంచుకోకపోతే ఈ వ్యాసం అసంపూర్తిగానే ఉండిపోతుంది.

-ఇక్కడో కొమ్ముండేదే నిన్నటి దాకా
ఒంటరై బెట్టిప్పుడు బోసిగా వుందేం?!
-అదా?
అదే నా చేతి గొడ్డలి!
-నిరుడిక్కడ ఓ అడివుండేదే?
ఏమైందబ్బా ఇంత తొందరగా?!
-నీముందే విచ్చుకుంటోంది
కనపడలేదా కొత్త కాలనీ? (నాగరికత)

పైన పొగల విషం/కింద నీళ్ల విషం/నలుమూలలా గాలి విషం/మధ్యన ఊపిరి పీల్చే/ఏ ఎదనిండా విషం విషం/గరళ కంఠుడినైపోయాను/గంగావతరణం మాత్రం/కనుచూపుమేరలో/కనిపించడం లేదు! (బందీ)

నా మదిలో తలపు వెల్లి/ఒక తీరాన పయనించి/ఒక తరాన పయనించి/ఆందోళన ఊపిరిగా/యువతరాన్ని తనదారిన/విచలిస్తే విరళిస్తే/పోనీ ఈ గుండెలవిసి!/పోనీ!/అనంత విశ్వం ఆకాంక్ష నేను

/ నింగినేలల పరంజ్యోతిని/ ఎప్పటికీ నే చిరంజీవిని (మృత్యుంజయ)

పిచ్చిమొక్కా/గొప్ప మనసూ/రెండూ మహానేస్తాలు/ఎవరిచేయీ పడని/ఆ మొక్క పిచ్చిది./ఎవరికీ అందని/ఆ మనసు గొప్పది.

......

అడివాముదంలా!/సర్కారు తుమ్మలా!/అకస్మాత్తుగా అనుకోకుండా/ఆపద్బాంధువులవుతాయవి./మీ ఊరెళ్లని దారి పక్కనా

దేశంకాని దేశంలోనూ/పిచ్చిదే అయినా/ఒక మొక్కైనా నాటండి./మీ మునిమనుమలు/ఆ దారిన వెళతారేమో (పిచ్చిమొక్కా, మంచిమనసూ గొప్ప నేస్తాలు)

ఈ పుస్తకంలో ఆఖరి భాగం 'ఆశాద్వీపం'. దీనికి పరిచయవాక్యాలు రాస్తూ విద్యాసాగర్ అన్న కొన్ని వాక్యాలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను.

'మనుషులు మహాత్ములవడానికి వేచి వుండక్కర్లేదు. విశ్వం మనిషిని మహాత్ముడిగానే చేసింది. ప్రతి జీవజాతి లక్షణాలను మనిషిలో నింపి తెలివిగా ఆలోచించడానికి మేధస్సు, తనను తానే నడిపించుకోవడానికి అంతరాత్మ, అనంతమైన జీవనానికి మనసునూ, మణులూ, ముత్యాలూ, బంగారాల ముప్పేటల హారంలా ఇచ్చింది'.

★

వెంటనే పుస్తకంలోని కవితలని అక్కడక్కడా చదివాను. ఆసక్తి పెరిగింది. పూర్తిగా చదివాను. అసలు ముందు పుస్తకం శీర్షికే ఆకట్టుకుంది. విద్యాసాగర్ రాసిన కవిత్వమంతా ఒక ఎత్తైతే, ఈ పుస్తకంలోని 'మానవత్వం-పర్యావరణం' అనే ముందుమాట, తొమ్మిది భాగాలుగా విభజించిన ఈ కవితా సంపుటిలో ఒక్కొక్క భాగానికే కవి రాసిన పరిచయ వాక్యాలు ఒకెత్తు. నాకు ఎంతో ఇష్టమైన ప్రకృతి, దాని పరిరక్షణ, దానికీ జీవరాసులకీ వుండే అవినాభావ సంబంధంలాంటి విషయాలన్నీ ఇందులో వున్నాయి. వాటి గురించి నేను చాలా భావుకతతో ఆలోచిస్తాను. అసలు మనని ఆకట్టుకునే పుస్తకాలలోని విషయాలు, అంతకుముందే మన మనసుల్లో చూచాయగా ఉంటాయని నా వుద్దేశం. దాన్నే అభిరుచి అంటారేమో. జీవన గతిలో పెద్దలూ, పుస్తకాలూ, సినిమాలూ, బయటి ప్రపంచంలోని కొందరి మనుషులూ మన మనసుల్లో కొన్ని అభిప్రాయాలని నాటుతారు. తమాషాగా అప్పుడు కూడా మనకి నచ్చిన వాటినే మనం స్వీకరిస్తాం. అందుకే 'లోకోభిన్నరుచి' అనే మాట వచ్చింది.



ఎర్రజెండా ఎగిరింది నేడే

[illegible]
ఎర్రజెండా ఎగిరింది నేడే
అదే మే డే

శ్రామికులంతా ఐక్యమై కదిలిందీ
పెట్టుబడిదారుల కార్ఖానాల్లో
వెట్టిచాకిరీని ప్రశ్నించిందీ నేడే
ఎర్రజెండా ఎగిరింది నేడే
అదే మే డే

ప్రపంచ కార్మికులారా ఏకం కండని
కార్మికవర్గం నినదించిందీ
శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా
చికాగో నగర వీధులు మారు మ్రోగిందీ నేడే
ఎర్రజెండా ఎగిరింది నేడే
అదే మే డే

సంపద సృష్టించేది కష్టజీవులైతే
సంపాదన మాత్రం పెట్టుబడిదారులదెలా
అవుతుందన్న మార్క్సిస్టు దృక్పథం పరిఢవిల్లిందీ
ఉత్పత్తిలో కీలకం శ్రామికులైతే
దానిపై వచ్చే లాభాలు మాత్రం
యజమానులకెలా చెందుతాయన్న
వర్గ చైతన్యం ప్రజ్వరిల్లిందీ నేడే
ఎర్రజెండా ఎగిరింది నేడే
అదే మే డే

శ్రమకు తగ్గ ప్రతిఫలం దక్కాలన్న
సోషలిస్టు భావజాలం బలపడిందీ
శ్రమైక్య జీవన సౌందర్యం వెల్లివిరిసే
సామ్యవాదపు సమాజంవైపు దృష్టి మరల్చిందీ
వీరుల త్యాగాల సాక్షిగా
ఆశయానికి ఊపిరులూదిందీ నేడే
ఎర్రజెండా ఎగిరింది నేడే
అదే మే డే

- జావెద్

మాయమౌతున్న మనిషి

ఇది పాపిష్టి లోకమే నా చిట్టి తల్లీ!
ముదనష్ట పాలన్లో రక్షణేది చెల్లీ!!

పాలుగారు నీ పసిబుగ్గలా చూసి
జాలువారు నీ ముసిగనవుల బోసి (2)
కలకండలిచ్చి 'జో' అంటారనుకున్న....
కండలూడొచ్చేలా కాల్చబోరనుకున్న ॥ఇది॥

పసికూనవన్న కనికరమేలేదాయె
కసిపూనుకున్న కరకు కరములాయె (2)
కాలు కొలిమిలో నుసి కాయమాయె.....
కలికాలాన మనిషి మాయమైపాయె ॥ఇది॥

ప్రత్యూష శ్రీలక్ష్మి మనీష సుజాత
ఆయేషా ప్రణీత ఎవతో తరువాత (2)
వంతుల వారీగా బలియైపోతున్నా....
తంతుల మాదిరి ప్రభుతుండదగునా ॥ఇది॥

పేగుబంధం తెలియని పాపాత్ములారా???
పురిటినొప్పుల నోర్చి మిము కన్నది తల్లేరా (2)
పిదప బుద్దులతోన ఆ స్పర్శ మర్చేరా.....
మాతృత్వ మమకారాల కాలరాచేరా

ముద్దులొలుకు చిన్నారుల గొంతునులిమేసే
కనపడ్డ ఆడోళ్ల చెరపట్టి బలిచేసి (2)
మదాంధ మూకల మెడలిరిచి వేయాలి
మహిళ ఆక్రందనలు తుడిచివేయాలి

- సంపటం దుర్గాప్రసాదరావు

తెలుసుకుందామా...

110 ఏళ్ల మేడే చరిత్ర...

లెనిన్ ప్రత్యేక పాత్ర

"మే 1న ప్రపంచ కార్మికులంతా సోషలిస్టు వ్యవస్థను నిర్మిచేందుకై ఏకోదరులవలె ఐక్యంగా పోరాడతామని దృఢదీక్షను ప్రకటిస్తారు" అన్న లెనిన్ మహాశయుని మాటలు ఆవిధంగా అక్షరాలా వాస్తవ రూపం దాల్చాయి. ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవులు జరిపిన వీరోచిత పోరాటాల ఫలితంగా 1918 తర్వాత క్రమంగా వివిధ దేశాల్లో 8 గంటల పనిదినం చట్టరీత్యా ప్రవేశపెట్టడం జరిగింది. అప్పటికి ఇప్పటికి మే దినోత్సవ స్ఫూర్తి నిరతారుణంగా ప్రకాశిస్తూనే వుంది. ప్రపంచీకరణ పరిస్థితుల్లో అదృశ్య పనివిధానంపై పోరాడ్డానికి అదే ఆనాటి చికాగో చైతన్యం వెలుగుదివ్వె అవుతుంది.

చికాగో కార్మిక యోధులపై జరిపిన తుపాకీ కాల్పులు ప్రపంచమంతటా ప్రతిధ్వనించాయి. 1889 జులై 14న పారిస్‌లో జరిగిన 2వ ఇంటర్నేషనల్ ప్రథమ మహాసభ అమెరికా ప్రతినిధి వర్గం చేసిన ప్రతిపాదనను స్వీకరించి మే మొదటి తేదీని అంతర్జాతీయ కార్మికవర్గ సంఘీభావదినంగా ప్రకటించాలని నిర్ణయించింది. ఆ రోజున ప్రపంచమంతటా అన్ని దేశాల్లోనూ, అన్ని పట్టణాల్లోనూ శ్రామిక ప్రజలు ఏకకాలంలో తమ డిమాండ్లను ప్రకటించాలని కోరింది.



1900 సంవత్సరంలో పారిస్‌లో జరిగిన అంతర్జాతీయ మహాసభ సమావేశంలో మే దినానికి సంబంధించిన తీర్మానం తిరిగి ఆమోదించారు. మే దినం మరింత శక్తివంతంగా ఉండేందుకు గాను ఆ రోజున సమ్మెలు జరపడం కూడా అవసరం అని అందులో పేర్కొన్నారు. ఆ ఏడాది నుండి మే 1వ తేదీ అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా రూపొందింది.

రష్యన్ విప్లవోద్యమ రథసారథి లెనిన్ విప్లవ కార్యక్రమాల్లో మే దినోత్సవానికి అధిక ప్రాముఖ్యత ఇస్తూ వుండేవారు. రష్యాలో మేడేను బ్రహ్మాండంగా జరపాలని విజ్ఞప్తి చేస్తూ 1896లో జైలునుంచే కరపత్రాన్ని రాశారు.

రష్యాలో విప్లవానికి పూర్వం మే దినోత్సవాలను విలక్షణమైన రూపంలో నిర్వహించారు. ఆ దేశంలో అన్ని రంగాలకు చెందిన శ్రమజీవులు బూర్జువా, భూస్వామ్య శక్తులకు మాత్రమే వ్యతిరేకంగా కాక, నిరంకుశ రాజరిక పాలనకు కూడా మే దినోత్సవాలను విప్లవ పోరాట దినోత్సవాలుగా ఎక్కుపెట్టారు.

రష్యాలో తొలి విప్లవం 1905 (1905–1906)లో జరిగింది. ఆనాడు దేశవ్యాపితంగా 177 నగరాల్లో మే దినోత్సవాలు ఉత్తేజకరంగా జరిగాయి. ఆ ప్రదర్శనల్లో పారిశ్రామిక కార్మికులే కాక రైతులు, సైనికులు, నావికులు కూడా పాల్గొన్నారు. 1912లో 'లెనా' బంగారు గనుల (తూర్పు సైబీరియా) వద్ద కార్మికుల ప్రదర్శనపై కాల్పులు జరిగాయి. ఆ మేడే రోజున 200 పట్టణాల్లో ప్రదర్శనలు, సమ్మెలు జరిగాయి. 4 లక్షలమంది కార్మికులు పాల్గొన్నారు. '8 గంటల పని దినం అమలు పరచాలి. నిరంకుశ ప్రభుత్వం నశించాలి. భూస్వాముల ఎస్టేట్లు జాతీయం చేయాలి' అన్నవే వారి ప్రధాన కోర్కెలు. 1913 మే దినోత్సవం నాడు సమ్మెలో 4,20,000 మంది కార్మికులు పాల్గొనగా 1914లో 5 లక్షల మంది పాల్గొన్నారు. అంత బ్రహ్మాండమైన మేదినోత్సవ కార్యక్రమాలు ఆ ఏడాది మరే దేశంలోనూ జరగలేదు. రష్యన్ కార్మికులు రాజకీయంగా జాగృతులైనారని ఆనాటి ప్రదర్శనలు వెల్లడించాయి. కార్మికవర్గ పోరాటాలు గ్రామాలకు కూడా వ్యాపించి పదికోట్ల మంది రష్యన్ రైతుల్లో విప్లవ జ్వాలలను రగుల్కొల్పాయి.

చివరకు 1917 అక్టోబర్‌లో లెనిన్ నాయకత్వాన రష్యన్ శ్రామికవర్గం విప్లవం నడిపి, అధికారాన్ని హస్తగతం చేసుకుంది. ఆ విధంగా పెట్రోగ్రాడ్ కార్మికులూ, యావత్ రష్యన్ ప్రజలూ అమెరికన్ (చికాగో) సోదరుల ఆశయాలను పరిపూర్ణం చేశారు. "ప్రపంచ కార్మికులారా ఏకం కండి" అని మార్క్స్, ఏంగెల్స్ ఇచ్చిన పిలుపును కార్యరూపంలో పెట్టారు.

1917 అక్టోబర్ సోషలిస్టు మహావిప్లవ విజయం మే దినోత్సవాలను ఒక నూతన రూపాన్ని సంతరించి పెట్టింది. మనిషిని మనిషి దోచుకోవడం అంతమైంది. శ్రామికుల విముక్తికి చిహ్నంగా మేడేను సెలవు దినంగా ప్రకటించారు. మే 1వ తేదీన సోవియట్ కర్మాగారాలు, కార్యాలయాల శ్రామికులు, సమిష్టిక్షేత్రాల రైతులు పెట్టుబడిదారీ ప్రపంచంలోని శ్రామిక ప్రజల విప్లవ పోరాటాలతోనూ, జాతీయ విముక్తి ఉద్యమాలతోనూ తమ సంఘీభావాన్ని ప్రకటించేవారు. ప్రపంచశాంతి కోసం కృషి సల్పడానికి, కమ్యూనిజాన్ని నిర్మించడానికి సైతం వారు తమ కృతనిశ్చయాన్ని ప్రకటించేవారు. సోవియట్ యూనియన్‌లో మే 1, 2 తేదీలు సెలవు దినాలుగా వుండేవి. ఇప్పుడు ఆ గొప్ప దేశం విచ్ఛిన్నమైనా ఆ ఉత్తేజం చెరిగిపోదు.

"మే 1న ప్రపంచ కార్మికులంతా సోషలిస్టు వ్యవస్థను నిర్మిచేందుకై ఏకోదరులవలె ఐక్యంగా పోరాడతామని దృఢదీక్షను ప్రకటిస్తారు" అన్న లెనిన్ మహాశయుని మాటలు ఆవిధంగా అక్షరాలా వాస్తవ రూపం దాల్చాయి. ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవులు జరిపిన వీరోచిత పోరాటాల ఫలితంగా 1918 తర్వాత క్రమంగా వివిధ దేశాల్లో 8 గంటల పనిదినం చట్టరీత్యా ప్రవేశపెట్టడం జరిగింది. అప్పటికీ ఇప్పటికీ మే దినోత్సవ స్ఫూర్తి నిరతారుణంగా ప్రకాశిస్తూనే వుంది. ప్రపంచీకరణ పరిస్థితుల్లో అదృశ్య పనివిధానంపై పోరాడ్డానికి అదే ఆనాటి చికాగో చైతన్యం వెలుగుదివ్వె అవుతుంది. ★

సీరియల్

వియత్నాం గెరిల్లా

<u>జరిగినకథ:</u>

తన ఇద్దరు పిల్లలను టువాట్‌కు అప్పగిస్తుంది హావ్. అంతేకాదు! తన దగ్గర మిగిలిన వంద రూపాయలను ఆమె చేతిలో పెట్టి అప్పగింతలు పెడుతుంది. అందుకు టువాట్ నొచ్చుకొంటుంది. హావ్ చేసే పని తను చేయలేదు కనుక పిల్లలను పెంచడం తన బాధ్యతని చెప్తుంది. చిన్నారులను అతికష్టమ్మీద వదిలివెళుతుంది హావ్. జంగ్, ట్రువాంగ్‌లను అనుసరించి ముందుకు నడుస్తుంటుంది. జంగ్ కూతురి గురించి అడుగుతుంది హావ్. దానికతను వెంటనే స్పందించడు. తర్వాత అదొక పెద్ద కథ అంటూ మొదలెట్టి చెప్తుంటాడు...

మూలం: బుయ్‌డక్ ఆయ్

తెలుగు: కొల్లి సత్యనారాయణ

14వ భాగం

'జంగ్' ఒక్క నిట్టూర్పు విడిచి, నెమ్మదిగా చెప్పాసాగాడు.

"ఆ కథ చాలా పెద్దది. శత్రువు వెనుక తట్టున వున్న 'విన్‌చావ్' వద్ద 1949లో నన్ను ఖైదీగా పట్టుకున్నారు. అప్పుడు కూడా యిప్పుడు చేస్తున్న పనే చేస్తుండేవాడిని. నన్ను గురించి వేగులవాళ్ళు శత్రువుకు సమాచారం అందించారు. నన్ను గురించిన సమాచారంబట్టి నేను రహస్యంగా వుంటున్న యింటిపైనే శత్రువులు దాడి చేశారు. ఆ ఇంటిలో అప్పుడు ముగ్గురం వున్నాం. ఆ ఇంటిపై మరింత గడ్డి పడవేసి నిప్పు పెట్టారు. పొగ లోపలికి రావటంతో మాకు ఊపిరాడటం కష్టమైంది. 'విన్‌చావ్' ప్రాంతంలోని అన్ని రహస్య గృహాలకు అత్యవసర పరిస్థితులలో తప్పించుకోవటానికి పొలాలలోకి వెళ్ళే సొరంగాలు వున్నాయి. మాకోసం శత్రువు అక్కడ కూడా కాపలా వేశాడు. ఆ సమయంలో రహస్య గృహంలో వుండటమంటే చచ్చిపోవటమే. సాహసించి బయటపడాలని నిర్ణయించుకున్నాం. చేతి బాంబులను బయటకు విసురుతూ, పిస్తోలు పట్టుకుని బయటకు వచ్చాను. నాతోపాటు మిగిలిన యిద్దరూ బయటకు వచ్చారు. ఆరుగురు ఫ్రెంచి సైనికులు మా మీదకు వచ్చారు. వెంటనే అందులో ఇద్దరిని పిస్తోలుతో కాల్చి చంపగా, మాలో ఒకడిని శత్రువు చంపివేశాడు. నాకు మెడ వెనుకభాగంలో నొప్పి పెడుతుందన్న విషయం గురించి ఆలోచించే అవకాశం లేకుండా పోయింది. ఏదో ఎర్రగా కనిపించింది. కాళ్ళు సాధ్వీనం తప్పాయి....."

కాసేపు అగి రెండు చేతులు వెనక్కు పెట్టుకుని 'జంగ్' తన కథ చెప్పాసాగాడు. నాకు స్పృహ తప్పింది. స్పృహలోకి వచ్చేసరికి ఒక జీప్‌లో పండుకునివున్నా. నేను ఇంకా బతికే వున్నానని, నన్ను తాళ్ళతో బంధిచారని గుర్తించా. జైలులో వాళ్ళు పెట్టే చిత్రహింసలకు, జైలు జీవితానికి నెమ్మదిగా అలవాటు పడ్డాను. నెమ్మదిగా తప్పించుకుపోవాలన్న ఆలోచన నాలో కలిగింది. చివరకు తప్పించుకుపోయాను. ఖైదీగా ఒక సంవత్సరం మాత్రం వున్నాను. కానీ యుగాలు గడిచినట్లయ్యింది. పశువులు తినేదానికన్నా హీనమైన తిండి పెట్టేవాళ్ళు. నానా చిత్రహింసలు పెట్టే వాళ్ళు. తప్పించుకుపోవాలన్న కోర్కెతో వాటినన్నిటినీ భరించాను. చివరకు తప్పించుకున్నాను"

'జంగ్' మౌనంగా నడుస్తున్నాడు. ఒక చోట ఆగి పైపు ముట్టించుకుని రెండు దమ్ములు లాగాడు. మళ్ళీ నడక సాగించాం. రాత్రి గడచిన కొలదీ, పక్కనే సముద్రపు అలలు ఘోషపెడుతున్నాయి. దూరం నుండి అలలు ఒక దానిని ఒకటి తరుముకుంటూ ఒడ్డువరకు వచ్చి విరిగిపోతున్నాయి. దమ్ములాగి నడక తిరిగి ప్రారంభించకుండా అక్కడే నిలబడ్డ అతని వంక చూస్తూ నిలబడ్డాను. ప్రేమ, ఆశ్చర్యం నన్ను చుట్టుముట్టాయి. ఏదో సుఖం అనుభవిస్తున్నట్లుగా వుంది. ఆ ఆలోచన నా బుర్రలోకి రాగానే చెదరగొట్టాలని ప్రయత్నించాను, సాధ్యం కాలేదు. అలా ఆలోచిస్తూ అతని కంటే ముందు వెళ్ళాలని వేగంగా నడక సాగించాను. వెన్నెలలో 'తిమింగలం దీవి' స్పష్టంగా కనిపిస్తోంది. నేను తొందరగా నడవటం 'జంగ్'కు ఆశ్చర్యం కలిగించింది. కాని వెనుకనే నడుస్తున్నాడు. వేగంగా నడుస్తున్నా. యిసుక మీద పడుతున్న 'జంగ్' నీడను దాటి వెళ్ళలేకపోతున్నాను. 'టువాట్' అత్తయ్య యింటికి చేరేవరకు నాకు మనశ్శాంతి లేదు.

'జంగ్' పండుకోవటానికి పక్క ఏర్పాటుచేసి, 'టువాట్' అత్తయ్య పండుకోవటానికి వెళ్ళింది. గాఢ నిద్రలోవున్న పిల్లల మంచంపై కూర్చున్నా. ఇద్దరూ దుప్పటి కప్పుకున్నారు. ముఖాలు మాత్రం బయటకు కన్పిస్తున్నాయి. ప్రశాంతంగా నిద్రపోతున్నారు. వారిపై వంగి ముద్దు పెట్టుకున్నా. చేతుల మీదకి తీసుకుని రొమ్ములకు హత్తుకున్నాను. అమాయకంగా యిద్దరూ నా చేతుల్లోనే నిద్రపోతున్నారు. కొద్దిసేపటికి చిట్టి 'థై' పెదాలు చప్పరించసాగింది. నాకు నవ్వు ఆగలేదు. పెద్దగా నవ్వేశాను. పాపకు నిద్రలో ఈ అలవాటు వుంది. పిల్లల్ని విడిచిపెట్టి కొద్ది రోజులే అయ్యింది. కానీ నాకు మాత్రం నెలలు గడిచినట్లుగా వుంది. ఇప్పుడే ఒక అగ్నిపరీక్ష నుండి బయట పడ్డాను. నా పవిత్రతను రక్షిచుకోవటంలో సహాయం చేస్తారన్న నమ్మకంతో, ప్రేమతో వారిని

కౌగలించుకున్నా . గోడకు తగిలించివున్న దీపం చమురు లేక 'గుప్ గుప్' మని ఆరిపోయింది. బయట వెన్నెల వుండటంతో లోపల కొంచెం వెలుగుగా వుంది. పక్కగదిలో పండుకున్న 'జంగ్' దొర్లినట్లున్నాడు. మంచం కిర్రుమంది. అతను ఇంకా మేల్కొనే వున్నట్లు తోచింది. నిద్రపట్టేవరకూ తిరిగి వచ్చేటప్పుడు జరిగిన దానిని గురించి ఆలోచిస్తూ పండుకున్నాను.

◆◆◆

నేను ఆస్పత్రిలో చేరి నెల గడిచిపోయింది. మంచి ఆహారం, విశ్రాంతి, వైద్యం మూలంగా యితర రోగుల మాదిరిగానే నా ఆరోగ్యంకూడా నెమ్మది నెమ్మదిగా బాగుపడుతుంది. జన్మ స్థలం నుండి వచ్చిన ఆమె కథను ప్రతి సాయంత్రం జాగ్రత్తగా వింటున్నాను. ఆ కథతోనే చలికాలమంతా గడిచిపోయింది. కొంతకాలంగా మేము ప్రశాంత జీవితం గడుపుతుండటంతో అటువంటి కథలు మరుగున పడిపోతున్నాయి. ఒక్కొక్కప్పుడు మరచిపోతున్నాం కూడా. పాత సంఘటనలు, జన్మస్థలాలు, సామాన్యులే అయినా వీరులుగా నిలబడ్డప్పుడు, వారి జీవిత చరిత్రలు నెమరు వేసుకున్నప్పుడు, స్వప్నంలో నుండి వస్తున్నామా!? అన్నంత దిగ్భ్రమ నాకు కలిగేది.

మధ్యాహ్నం నుండి చీకటిపడే వరకూ చల్లని వాతావరణంలో మార్పు వుండేది కాదు. ఎల్లప్పుడూ తుంపర పడుతున్నట్లుగా కనపడేది. తెల్లగా వెల్లవేసిన ఆ ఆస్పత్రి భవనం, తెల్లని దుస్తులు ధరించి అందులో తిరగాడే నర్సులు, మందుల వాసన, పండిన పండ్ల కమ్మని వాసన, బిగుతుగా ధరించిన బట్టలతో గ్రావెల్ వేసిన దారులలో హడావుడిగా తిరగాడే డాక్టర్లు, నర్సులు. యిదీ ఆస్పత్రి వాతావరణం, కిటికీగుండా బయటకు చూస్తూ కుర్చున్నాను. మంచువలె తుంపర అందంగా నేలను కప్పివేసింది. మరుగుపడిన విషయాలపై సాగుతోన్న ఆలోచనలను చటుక్కున ఆపేశాను.

వాకిలి గుండా వస్తున్న గుంపును చుశాను. ముగ్గురు నలుగురు యువతులు వస్తున్నారు. ఒకామె చేతిలో బుట్టవుంది. డ్యూటీలో వున్న నర్సు వారిని నా గది దాటి 'హేవ్' వున్న గది వైపు తీసుకెళ్ళింది. లేచి నిలబడి కిటికీ గుండా తొంగి చుశాను. కొంతసేపటికి 'హేవ్' తన గదిలో నుండి బయటకు వెళ్తోంది. యువతులు ఆమెను చూడగానే సంతోషంతో ఆమెను చుట్టుముట్టి ప్రశ్నల వర్షం కురిపించారు.

"ఎట్లా వున్నావ్? నిన్ను చుడటానికి వచ్చాం. ఇంకా ఎంత కాలం వుండాలి? నిన్ను ఫ్యాక్టరీకి తీసుకుపోతాం"

'హేవ్' వాళ్ళ చేతులు పట్టుకున్నది. సంతోషం, ఉద్రేకం పెనవేసుకుని ఆమె కళ్ళు మిలమిల మెరిశాయి.

"నేను విశ్రాంతి తీసుకుంటున్నా. ఆపరేషన్ చేయించుకోవాలి. ఎప్పుడు బయలుదేరారు?"

"ఇప్పుడే వచ్చాం. గేటు దగ్గర నీ పేరు చెప్పగానే వెంటనే నీదగ్గరకు తీసుకొచ్చారు. నారింజ కాయలు, గుడ్లు తెచ్చాం"

"మెనీ థ్యాంక్సు!"

బెంచిమీద 'హేవ్' కిరుపక్కల వారు కుర్చున్నారు.

"రెండవ క్వార్టర్‌లో మన ఫ్యాక్టరీ కోటా పూర్తి చేసిందా?" అడిగింది 'హేవ్'

"అయిపోయింది. పని వత్తిడివల్ల యింతకు ముందే రాలేకపోయాం"

"ఇంకా కొన్ని నెలలు యిక్కడే వుండాల్సి వస్తుందనుకుంటున్నా"

"ఎందుకు?"

"డాక్టరు చెప్పారు"

మౌనంగా ఆ మాటలు వింటూ కూర్చున్నాను. ఆ రకంగా 'హేవ్' సంతోషంగా మాట్లాడుతుంటే నేను చూడటం మొదటిసారి. 'హేవ్' చేతులు పట్టుకునే వారు ఆమె మాటలు వింటున్నారు. ఆమెతో పాటు చాలా కాలం పని చేసిన వాళ్ళయివుంటారని, ఆమెను చుడటానికి వచ్చారని ఊహించాను. చాలాసేపు మాట్లాడుకున్న తరువాత, వాళ్ళను గేటు వరకు సాగనంపి వచ్చింది 'హేవ్'.

ఆ సాయంత్రం నా చేతిలో రెండు నారింజ పండ్లు పెట్టి, "మధ్యాహ్నం వచ్చిన స్నేహితులు వీటిని తెచ్చారు. చాలాకాలం తర్వాత వాళ్లను కలుసుకున్నందుకు సంతోషంగా వుంది. "కాయలు తినండి" అంది. హేవ్ జేబులో నుంచి చాకు తీసి కాయలు వలిచింది.

"నీ స్నేహితులు ఫ్యాక్టరీ నుండి వచ్చారా?" అని అడిగాను.

"అవును. పార్టీశాఖ తరపున ఒకరు, మిగిలిన వాళ్లు వర్కర్లు' అని చెప్పింది.

ఆమెకు దగ్గు తెర వచ్చింది. దగ్గుతున్నప్పుడు సన్నగా వుండే ఆమె శరీరం మెలికలు తిరిగేది. గొంతు ఎండిపోయి పుండు అయిందా అని భావించేవాణ్ణి.

"ఈ రోజు చాలా చలిగా వుంది. బాగా కప్పుకోండి. ఈ రోజు వేడి తొమ్మిది డిగ్రీలకు పడిపోవచ్చు. బాగా అలసిపోయినట్లు వున్నారు. పోయి విశ్రాంతి తీసుకోండి"

"బాగానే వున్నాను. దగ్గుతెర కూడా తగ్గిపోయింది" అని ఆమె చెప్పిన మాటపై నాకు నమ్మకంలేదు. జాలిగా ఆమె వంక చూశాను. దగ్గు తగ్గినట్టుగా వుంది. నారింజకాయ తినటం వల్ల తగ్గి వుంటుంది. మరొక తొన ఇచ్చాను.

అభ్యంతరం చెప్పకుండా తీసుకుంది. మౌనంగా కూర్చుని చేతి వేళ్లను లంకెవేసుకుంది. నెమ్మదిగా వీస్తున్న గాలికి చెట్ల ఆకులు కదలాడుతున్నాయి. చలి భరించలేమన్నట్లుగా పండిన ఆకులు రాలిపోతున్నాయి. చెట్ల వరుసల మధ్య వున్న గ్రావెల్ రోడ్లు మంచుపడి కడిగినట్లుగా వున్నాయి.

"గత సాయంత్రం నా కథ ఎంతవరకు వచ్చింది?" హఠాత్తుగా హేవ్ అడిగింది.

"పిల్లల్ని చూడడానికి మల్బరీ పొలాల గుండా ఎలా వెళ్లింది చెప్పావు".

తలూపి, మెడ రుమాలు సరిజేసుకుని తన కథ చెప్పసాగింది.

◆◆◆

శత్రువు తన చక్రబంధాన్ని మరింతగా బిగిస్తున్నప్పటికీ స్థావరాలను మరింత పటిష్టం చేస్తున్న సమయంలో నన్ను పార్టీలో చేర్చుకున్నారు. నాకు పార్టీ సభ్యత్వం ఇవ్వవచ్చని మొదట ట్రువాంగ్ సిఫారసు చేశాడు.

ఆ సమయంలో నా మనస్సు ఎలా వుందో వర్ణించడం చాలా కష్టం. నేనొక మహత్కార్యానికి అంకితం చేయబడ్డాననే సంతోషం, ఉత్సాహం నన్ను పెనవేసుకున్నాయి. నన్ను పార్టీ సభ్యురాలిగా తీసుకునే కార్యక్రమం ప్రత్యేక పద్ధతిలో జరిగింది. తీర ప్రాంతంలోనూ, దాని చుట్టుపక్కల గ్రామాల్లోనూ శత్రువు పెద్ద ఎత్తున బలగాలను సమీకరించి తెల్లవారు జామునే దాడి ప్రారంభించాడు. పక్క గ్రామాల్లో ఏమేమి జరిగిందో పూర్తి సమాచారం మాకు చేరింది. "హాయ్ మియ" మద్ద సావో బీచ్ గెరిల్లా దళం మొదటగా వారిని ఎదుర్కొంది. గెరిల్లాలను సురక్షితంగా దాటవేయడానికి ఇతర కామ్రేడ్స్‌తో కలిసి చేపలు పట్టే పడవపై వున్నాను. బీచ్‌కి వచ్చే దారిలో గ్రెనేడ్‌లతో ఎదుర్కోవడం పూర్తికాగానే, గెరిల్లాలను తీసుకెళ్లడానికి నావను ఒడ్డుకు తీసుకురమ్మని సైగ చేసే వాళ్లు. బీచ్‌కి రెండవ చివరలో మరొక యుద్ధరంగం ప్రారంభించడానికి వాళ్లందరినీ నావలో ఎక్కించుకొని సముద్రంలోని కొండల సందుల గుండా తీసుకెళ్లేవాళ్లం. ఈ కార్యక్రమంలో డజను నావలు పాల్గొన్నాయి. శత్రువు ఎడతెగకుండా కాల్పులు జరుపుతున్నాడు. అయినా మధ్యలో వున్న కొండలు మాకు రక్షణ కవచాలుగా పనిచేశాయి. సాయంకాలం వరకు శత్రువు కాల్పులు జరుపుతూనే వున్నాడు. చీకటి పడిన తర్వాత నేనున్న నావ తాత్కాలికంగా ఒక కొండ గుట్ట పక్కన రక్షణ తీసుకుంది. అటువంటి సమయంలో అంతకు ముందు వేసుకున్న ప్లాను ప్రకారం నన్ను పార్టీలోకి తీసుకునే కార్యక్రమం ప్రారంభమైంది.

(ఇంకా వుంది)



తెలుగు సినిమాల్లో శ్రామిక చైతన్య గీతి!

'నేడే మేడే..' అంటూ మురళీ మోహన్ పాడుతూ వస్తుంటే మాదాల రంగారావు డప్పు మోత మోగిస్తాడు. అది 'ఎర్ర మల్లెలు' సినిమా. 'యువతరం కదిలింది'తో సంచలనం సృష్టించిన మాదాల బృందం మలి ప్రయత్నం అత్యంత విజయవంతమైంది. 'ఎర్ర మల్లెలు' ప్రారంభమే మేడే ఉత్సవాలతో మొదలవుతుంది. ఆ వూపూ వుత్సాహం చూసి కన్ను కుట్టిన యజమాని కార్మికులపై పని భారం పెంచేందుకు పన్నాగాలు వేస్తాడు. వాళ్లు ఎదురు తిరుగుతారు. తర్వాత చాలా మలుపులు... ఇది 1981 నాటి సంగతి.

మన రాష్ట్రంలో పరిశ్రమలు పెద్దగా అభివృద్ధి చెందకపోవడంతో తెలుగు సినిమాలు చాలా కాలం పాటు పల్లెటూరి నేపథ్యంలోనే రూపొందుతుండేవి. కుటుంబ సమస్యలు, సెంటిమెంట్లు వీటిచుట్టూనే తిరగడం వాటి లక్షణంగా వుండేది. ఈ సమస్య మొత్తం భారతీయ చిత్రాలన్నిటికీ వుంటుందేమో! అయితే వీటి మధ్యనే కార్మికులు, ఉద్యోగుల సమస్యలనూ సంఘర్షణలనూ చిత్రించే సినిమాలు అనేకం రాకపోలేదు. యాభయ్యవ దశకంలోనే ఇలాటి కథలు వెండి తెరకెక్కించడం మన దర్శకులు, రచయితల ప్రగతిశీల దృక్పథానికి దర్పణం పడుతుంది.

ఎన్టీఆర్ సొంతంగా తీసిన చిత్రాలలో 'పిచ్చిపుల్లయ్య' మొదటిదైతే 'తోడు దొంగలు' రెండవది. ఈ చిత్రంలో ఒక మిల్లు యజమానులైన గుమ్మడి, ఎన్టీఆర్‌లు తాము చెప్పిన పని చేస్తూ కరెంటు షాకు తగిలి చనిపోయిన కార్మికుడికి నష్టపరిహారం ఎగరగొడతారు. గుమ్మడి ఘరానాగా వుంటాడు గాని ఎన్టీఆర్ ఆ అపరాధ భావనకు తట్టుకోలేక చలించి పోతాడు. దేశాటనం చేసి వచ్చి చనిపోయిన కార్మికుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చేస్తాడు. ఈ చిత్రంలో ఆయన పాత్రలో ఎంతో బాగా నటించారు. జగ్గయ్య స్వయంగా తీసిన 'ముందడుగు' కూడా కార్మికుల చిత్రమే. అయితే ఈ చిత్రంలో యజమాని విదేశాలలో వుంటే మేనేజర్ మోసం చేస్తుంటాడు. విదేశాల నుంచి వచ్చిన హీరో కార్మికుల తరపున నిలబడి మేనేజర్ ఆట కట్టిస్తాడు. కార్మికుల కోసం యజమాని నిలబడినట్టు చూపించే ఈ చిత్రంలో వున్నది వింత అభ్యుదయమని అప్పట్లో కొడవటిగంటి కుటుంబరావు అపహాస్యం చేశారు. అయితే ఆ చిత్రానికి అనేక అవార్డులు, విదేశీయాత్రలు ప్రాప్తించాయి. చాలా ఏళ్ల తర్వాత 'అమాయకురాలు' అనే చిత్రంలోనూ కార్మిక నాయకుడు 'ఓ దేవా ఆనందరావా...' అంటూ యజమానిని కీర్తించి మేనేజర్లదే తప్పయినట్లు పాట పాడతాడు. ఇదొక సాధారణ ధోరణి.

మామూలుగా మన చిత్రాల్లో హీరో కష్టాల పాలయ్యాడని చూపించడానికి లేదా కష్టజీవి అని చెప్పడానికి కాకీ నిక్కరు తొడిగి బరువులు ఎత్తుతున్నట్టు, మిషన్ తిప్పుతున్నట్టు చూపిస్తుంటారు. సాధారణంగా హీరోలే కార్మిక నాయకులుగానూ వుంటారు. వారు నిరాహారదీక్షలు చేయడం, ఉపన్యాసాలివ్వడం, యజమాని లోబర్చుకోవాలని చూడటం లేదా దెబ్బ తీయడం ఇలాటివన్నీ జరుగుతాయి. కొన్నిసార్లు హీరోలు చొరవ తీసుకుని ఫ్యాక్టరీని కాపాడటం, తామే యజమానులు కావడం వంటివి జరుగుతుంటాయి. కృష్ణంరాజుతో తీసిన 'ధర్మాత్ముడు' నుంచి వెంకటేష్ 'లక్ష్మి' వరకూ యజమానులే కార్మిక సేవకులన్నట్టు చూపించిన చిత్రాలు చాలా వున్నాయి. కృష్ణంరాజుతోనే(జయప్రద నాయిక) దాసరి నారాయణ రావు తీసిన 'సీతారాములు' చిత్రంలో కార్మిక నాయకుణ్ని కథానాయిక పెళ్లి చేసుకుంటుంది. వారిద్దరూ ఇంట్లో కలసి వుంటూ

మామూలుగా మన చిత్రాల్లో హీరో కష్టాల పాలయ్యాడని చూపించడానికి లేదా కష్టజీవి అని చెప్పడానికి కాకీ నిక్కరు తొడిగి బరువులు ఎత్తుతున్నట్టు, మిషన్ తిప్పుతున్నట్టు చూపిస్తుంటారు. సాధారణంగా హీరోలే కార్మిక నాయకులుగానూ వుంటారు. వారు నిరాహారదీక్షలు చేయడం, ఉపన్యాసాలివ్వడం, యజమాని లోబర్చుకోవాలని చూడటం లేదా దెబ్బ తీయడం ఇలాటివన్నీ జరుగుతాయి. కొన్నిసార్లు హీరోలు చొరవ తీసుకుని ఫ్యాక్టరీని కాపాడటం, తామే యజమానులు కావడం వంటివి జరుగుతుంటాయి. కృష్ణంరాజుతో తీసిన 'ధర్మాత్ముడు' నుంచి వెంకటేష్ 'లక్ష్మి' వరకూ యజమానులే కార్మిక సేవకులన్నట్టు చూపించిన చిత్రాలు చాలా వున్నాయి. కృష్ణంరాజుతోనే(జయప్రద నాయిక) దాసరి నారాయణ రావు తీసిన 'సీతారాములు' చిత్రంలో కార్మిక నాయకుణ్ని కథానాయిక పెళ్లి చేసుకుంటుంది. వారిద్దరూ ఇంట్లో కలసి వుంటూ బయట పోరాడతారు. ఈ సంబంధం భార్యాభర్తల సంబంధం వంటిదేనని దర్శకుడు హాస్యాస్పదమైన సందేశం ఇస్తాడు. అన్నాచెల్లెళ్ల సెంటిమెంటుకు అసమాన సంకేతంగా నిలిచిపోయిన 'రక్తసంబంధం'లో హీరో ఎన్టీఆర్ ఫ్యాక్టరీలో కాంతారావు కార్మిక నాయకుడు. అతను పోరాటం మొదలెడితే మొదట ఎదుర్కొన్న ఎన్టీఆర్ తర్వాత తన చెల్లెలే అతన్ని ప్రేమించిందని తెలుసుకుని పెళ్లి జరిపిస్తాడు. ఇవన్నీ వాస్తవంలో కార్మికుల పోరాటాల కారణాలను పక్కదోవ పట్టిస్తుంటాయి.

'ఓ లమ్మి అమ్మి అమ్మి
పండగొచ్చిందే
ఈ పండగొచ్చి పేదోళ్లకు తిండి పెట్టిందే' అంటూ ఆ పాట సాగుతుంది. కృష్ణ హీరోగా నటించిన సత్యానికి సంకెళ్లు చిత్రంలోనూ కార్మికుల పోరాటాలు, నిరసనలు బాగా చూపిస్తారు

రాచకొండ విశ్వనాథశాస్త్రి రచన చేసిన ఒకే ఒక్క చిత్రం 'స్త్రీ' లోనూ కృష్ణంరాజు కార్మిక నాయకుడు. యజమాని కూతురు చంద్రకళ (ద్విపాత్రాభినయం)ను పెళ్లి చేసుకుంటాడు. చిత్రం సెంటిమెంట్లు లేకుండా గంభీరంగానే సాగుతుంది. ఉదాత్తంగా ముగుస్తుంది. 'కదిలిందీ కదిలిందీ యువతరం, ఎదురు లేని బెదురు లేని నవతరం' అన్న పాట ఈ చిత్రంలోదే. 'మా భూమి' చిత్రం ప్రధానంగా వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి సంబంధించిందే అయినా అందులో హీరో మొదట హైదరాబాదు వచ్చి రిక్షా కార్మికుడుగా పని చేస్తూ చైతన్యం పెంచుకుని తిరిగిపోతాడు. ఆ చిత్రం కూడా 'ఎత్తిన జండా దించకోయ్ అరుణ పతాకకు జై' అంటూనే ముగుస్తుంది.

బయట పోరాడతారు. ఈ సంబంధం భార్యాభర్తల సంబంధం వంటిదేనని దర్శకుడు హాస్యాస్పదమైన సందేశం ఇస్తాడు. అన్నాచెల్లెళ్ల సెంటిమెంటుకు అసమాన సంకేతంగా నిలిచిపోయిన 'రక్తసంబంధం'లో హీరో ఎన్టీఆర్ ఫ్యాక్టరీలో కాంతారావు కార్మిక నాయకుడు. అతను పోరాటం మొదలెడితే మొదట ఎదుర్కొన్న ఎన్టీఆర్ తర్వాత తన చెల్లెలే అతన్ని ప్రేమించిందని తెలుసుకుని పెళ్లి జరిపిస్తాడు. ఇవన్నీ వాస్తవంలో కార్మికుల పోరాటాల కారణాలను పక్కదోవ పట్టిస్తుంటాయి. సామాన్యంగా మన చిత్రాల్లో హీరో యజమానిగా వున్నా కార్మికుడుగా వున్నా ఆ పక్షం విజయం సాధించినట్టు చూపించడం కద్దు. 'కథానాయకురాలు' అన్న చిత్రంలో వాణిశ్రీ కార్మిక నాయకురాలుగా పోరాటాలు నడిపి ఆ ఇంటికే కోడలవుతుంది. 'వెలుగు నీడలు' చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు మామ ఎస్వీఆర్ నడిపించే పత్రిక నిర్వహణ చేపట్టి తర్వాత సమ్మె చేసే కార్మికుల పక్షం తీసుకుని ఎదురుతిరుగుతాడు. ఎన్టీఆర్ 'మగాడు', హిందీలో అమితాబ్‌ను ఆకాశానికెత్తిన 'దీవార్' ఆధారంగా పునర్నిర్మించిన చిత్రం. హీరో చిన్నతనంలో తండ్రి కార్మికుల సమ్మెకు ద్రోహం చేసి హతుడవుతాడు. ఆ భయాందోళన వాతావరణంలో పెరిగిన అతడు నేరస్తుడవుతాడు. భర్త కార్మికుల కోసం పోరాటాలలో మునిగితేలడం భరించలేక భార్య విడిపోయే సినిమా సావిత్రి జగ్గయ్యలతో తీసిన తల్లిదండ్రులు (ఆ చిత్రంలో హీరో శోభన్‌బాబు కాగా వై.విజయ నాయికగా పరిచయమైంది).

శోభన్‌బాబు నటించిన రెండు చిత్రాలు కార్మిక పోరాటాలను చాలా బాగా చూపించాయి. ఒకటి ప్రసిద్ధమైన 'మనుషులు మారాలి'. 'అరుణ పతాకం ఎగిరింది, శ్రామిక లోకం గెలిచింది, మానవులంతా ఒకటని చాటే మరో ప్రపంచం పిలిచింది' అనే పాట ఇందులోదే. చివరకు ఈ చిత్రంలో హీరో సమ్మె పోరాటానికి నాయకత్వం వహిస్తూ హత్యకు గురవుతాడు. అతని భార్య శారద (ఈమె కూడా యజమాని కూతురే గాని మేనేజర్ మోసానికి గురై వీధుల పాలైంది) పిల్లలను పోషించలేక విషం ఇచ్చి చంపిన నేరానికి బోనెక్కుతుంది. అప్పట్లో ఈ చిత్రం పెద్ద సంచలనం. ఈ వుత్సాహంతోనే శోభన్‌నే హీరోగా పెట్టి 'దేశమంటే మనుషులోయ్' అన్న చిత్రం తీశారు. 'పదులు వందల కుటుంబాలలో సంపద గుట్టలు వేసిన దేశం, వేలూ లక్షల కూలి జనానికి కడుపుకు తిండి లేని దేశం' అన్న పాట ఇందులోదే.

హీరో కృష్ణ రిక్షా కార్మిక నాయకుడుగా నాగభూషణం ప్రధాన పాత్రధారిగా తీసిన ప్రజా నాయకుడు చిత్రంలోనూ మేడేపై మంచి పాట వుంటుంది.

'ఓ లమ్మి అమ్మి అమ్మి
పండగొచ్చిందె
ఈ పండగొచ్చి పేదోళ్లకు తిండి పెట్టిందే' అంటూ ఆ పాట సాగుతుంది. కృష్ణ హీరోగా నటించిన 'సత్యానికి సంకెళ్లు' చిత్రంలోనూ కార్మికుల పోరాటాలు, నిరసనలు బాగా చూపిస్తారు

రాచకొండ విశ్వనాథశాస్త్రి రచన చేసిన ఒకే ఒక్క చిత్రం 'స్త్రీ' లోనూ కృష్ణంరాజు కార్మిక నాయకుడు. యజమాని కూతురు చంద్రకళ (ద్విపాత్రాభినయం)ను పెళ్లి చేసుకుంటాడు. చిత్రం సెంటిమెంట్లు లేకుండా గంభీరంగానే సాగుతుంది. ఉదాత్తంగా ముగుస్తుంది. 'కదిలిందీ కదిలిందీ యువతరం, ఎదురు లేని బెదురు లేని నవతరం' అన్న పాట ఈ చిత్రంలోదే. 'మా భూమి' చిత్రం ప్రధానంగా వీర తెలంగాణా రైతాంగ సాయుధ పోరాటానికి సంబంధించిందే అయినా అందులో హీరో మొదట హైదరాబాదు వచ్చి రిక్షా కార్మికుడుగా పని చేస్తూ చైతన్యం పెంచుకుని తిరిగిపోతాడు. ఆ చిత్రం కూడా 'ఎత్తిన జండా దించకోయ్ అరుణ పతాకకు జై' అంటూనే ముగుస్తుంది.

గతంలో చాలా చిత్రాల్లో ఏదో రూపంలో కార్మికులనూ వారి పోరాటాలనూ చూపిస్తుండేవారు. హాలులోనూ దానికి మంచి స్పందన వచ్చేది. కాని కాలం గడిచిన కొద్దీ ఈ ధోరణి పెరగవలసింది పోయి తగ్గుముఖం పట్టడం తెలుగు సినిమా రంగ ప్రస్తుత స్వభావానికి ఒక నిదర్శనం. ఇప్పటికీ నారాయణమూర్తి సినిమాల్లో మేడేపైన, ఎర్రజండా పైన చాలా ఉత్తేజకరమైన గీతాలు వుంటూనే వుంటాయి. వాటిల్లో బాగా ప్రసిద్ధమైంది.

'ఎర్రజెండెర్రజెండెన్నియలో.. ఎర్రెర్రనిదీ జెండ ఎన్నీయలో...' భవిష్యత్తులో మన చిత్రాల్లో అరుణారుణ కాంతులు మరింతగా తేజరిల్లుతాయని ఆశిద్దాం.

-తెర









వింత గ్రంథాలయాలు



గ్రంథాలయముల వలన ఉపయోగముల గురించి వ్రాయుము? అన్న ప్రశ్న పరీక్షలలో వస్తుందని మా టీచర్ మా హైస్కూల్లో చెప్పినపుడు ఏం చేయాలో తెలియలా. వెంటనే టీచర్ గోల్డెన్ గైడ్ కొనుక్కుంటే దానిలో అన్నీ ఉంటాయని చెప్పారు. మేం వాటిని బట్టీపట్టి ఉపన్యాస పోటీల్లో కూడా చెప్పేవారం. అందరికీ వనరు ఒకటే గనుక జడ్జీలను ఆకర్షించేందుకు పిల్లలు తమ స్వంత వాక్యాలలో నమస్కార బాణాలు వేసేందుకు నానా తంటాలు పడేవారు. తీరా పెరిగి పెద్దవారై గ్రంథాలయాలను ఉపయోగించుకుందామని చూస్తే పేరుకు గ్రంథాలయం ఉంటుంది గాని వాటిలో పుస్తకాలు ఉండని స్థితి. ఎందుకంటే పుస్తకాలను కొనటం దండగమారి పని అని మన రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడో గ్రహించింది.

ఇంతకూ సందర్భం ఏమిటమ్మా అంటారా? అదే ఇపుడు ఎలక్ట్రానిక్ లైబ్రరీలు అందుబాటులోకి వచ్చిన సమయంలో సంప్రదాయ గ్రంథాలయాల గురించి చెప్పేవారిని బిసి లేదా ఇక్ష్వాకుల కాలం నాటి వారని అనుకుంటారని తెలుసు. కాలం ఏదైనా బేసిక్ ఇన్‌స్టింక్ట్ అదే మౌలిక ప్రవత్తి ఎప్పుడూ పనిచేస్తూనే ఉంటుంది. పుస్తకాలను కంప్యూటర్‌లో చదువుకోవచ్చు. అంతోపిక లేకపోతే ఉష్‌శ్రీ రేడియో భారతం మాదిరి కంప్యూటర్‌లో వినవచ్చు. ఇవన్నీ బాగా డబ్బున్నవారికి మరి లేనివారి సంగతి ఏమిటి? అది ఆఫ్రికా ఎడారైనా అమెరికా అధునాతన ప్రాంతమైనా పుస్తకాలు చదవాలనుకొనేవారికి సంచార గ్రంథాలయాలు ఇప్పటికీ పనిచేస్తున్నాయి. ధనికదేశాల్లో ఎయిర్ కండిషన్ బస్సుల్లో పుస్తకాలను అందచేస్తారు. బయటికి ఇవ్వటానికి వీల్లేని పుస్తకాలను డిజిటల్ రూపంలో ప్రపంచంలో ఎక్కడి నుంచైనా ఎక్కడికైనా తీసుకొనేందుకు ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది.

మరి పేద దేశాల్లో........? అసాధారణమైన విధానాల్లో పుస్తక జ్ఞానం కలిగించేందుకు అనేకమంది ఎంతో శ్రమ తీసుకుంటున్నారు. ఆఫ్రికాలోని కెన్యా ఈశాన్య ప్రాంతంలో ఒంటెల గ్రంథాలయాలు మనకు కనిపిస్తాయి. దేశంలో నిరక్షరాస్యత 31శాతం ఉంటే ఆ ప్రాంతంలోని సంచార జాతుల్లో 85 శాతం ఉంది. అలాంటి వారికి పుస్తకాలు అందించేందుకు మూడు ఒంటెలు రోజూ ఉదయాన్నే బయలుదేరతాయి. ఒకటి రెండు పెట్టెల పుస్తకాలను మోస్తే ఒకటి టెంట్ సామాగ్రిని, మరొకటి సిబ్బందికి అవసరమైన ఆహారం, నీళ్ల ఇతర అవసరాలను మోసుకుపోతుంది. ప్రతి ఏటా ఏడువేల పుస్తకాలను ఈ గ్రంథాలయాల్లో సరఫరా చేస్తున్నారు. ఇలాంటివి రెండు గ్రంథాలయాలున్నాయి.

స్పెయిన్‌తో ప్రారంభించి ఐరోపా ధనికదేశాలవారు లాటిన్ అమెరికాను తమ వలసగా చేసుకొని అక్కడి ఆదిమ జాతులను అదే రెడ్ ఇండియన్‌లను అణగదొక్కిన మేరకు అణగదొక్కి మిగిలినవారిని అత్యంత పేదరికం, వెనుకబాటుతనంలోనే ఉంచారు. వెనిజులాలో వామపక్షవాది ఛావెజ్ అధికారంలోకి వచ్చిన తరువాత పుస్తకాలతో పాటు కంచరగాడిదలపై లాప్‌టాప్‌లు, కంప్యూటర్లను పంపి మారుమూల ఆదిమజాతులకు నూతన పరిజ్ఞానాన్ని అందిస్తున్నారు. ఒక అంతర్జాతీయ సంస్థ సహకారంతో కొలంబియాలో గాడిదలతో సంచార గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. వాహనాలు ప్రయాణించటానికి వీలులేని ప్రాంతాలకు ఇవి ఎంతో ఉపయోగంగా ఉన్నాయి. వీటిని ప్రారంభించిన స్కూలు టీచర్ లూయిస్ సోరియానో రోజుకు నాలుగు గంటలు ప్రయాణించి పుస్తకాలు అందచేయటం, పిల్లలకు పుస్తకాలను చదివి వినిపించటంతో పాటు వారి హోంవర్క్‌కు కూడా సహాయపడతారట. పెరూలో మోటార్ సైకిల్ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. ఇథియోపియాలో గాడిదలపై నడుపుతున్న గ్రంథాలయాలలో పుస్తకాలతో పాటు వీడియో ప్రదర్శనలు కూడా నిర్వహిస్తున్నారు.

ఇలా పిల్లల్లో, పెద్దల్లో పఠనాసక్తిని పెంచేందుకు ఎందరో ఎంతో కష్టపడుతున్నారు. మరి మనం అలాంటి దుస్థితిలో ఉన్నామా? తరగతి పుస్తకాలను అవసరంకొద్దీ చదివిస్తున్నాం గానీ, మనోవికాసం, చుట్టుపక్కల ఏం జరుగుతోందనే జ్ఞానం కలిగించే పుస్తకాలను మనం ఎందరం చదువుతున్నాం, పిల్లలను ఎంతమేరకు ప్రోత్సహిస్తున్నాం అని ప్రశ్నించుకోవాల్సిన అవసరం లేదా?

ప్రపంచం నిరంతరం మారుతూ ఉంటుంది. మనం ఎప్పుడో చదివిన పుస్తకాలు, సమస్యలే కాదు, కొత్త పుస్తకాలు కొత్త సమస్యలు ఎప్పటికప్పుడు మనకు ఎదురవుతూనే ఉంటాయి. వర్తమానంలో ఏం జరుగుతోందో తెలుసుకొనేందుకు మనకు మంచి నేస్తాలు మంచి పుస్తకాలే.

ఏం జరుగుతుంది?

మీరు ఒక లైబ్రేరియన్‌ను, ఒక లాయర్‌ను ఒక విషయం గురించి ప్రశ్నించారనుకోండి ఏం జరుగుతుందో చెప్పగలరా ?

అనేక మంది ఎన్నో సమాధానాలు చెప్పారు. ఒకరు చెప్పిన 'మనకు మనం కోరుకున్న ఎంతో సమాచారం దొరుకుతుంది, కానీ అదేమిటో మనకు అర్థం కాదు' అన్న సమాధానం ఉత్తమంగా ఎన్నికైందట.

అవునా?

న్యూజిలాండ్‌లోని ఒక గ్రంథాలయంలో 1945లో ఒక పుస్తకాన్ని మేరీ సుషేమ్స్ అనే ఒకావిడ కుటుంబ సభ్యులకు ఇచ్చారట. అరవై ఒక్క సంవత్సరాల తరువాత సుషేమ్స్ తన 85వ ఏట మా ఇంట్లో లైబ్రరీ పుస్తకం ఒకటుందని ఆ లైబ్రరీకి అందచేసిందట. అందుకుగాను మన కరెన్సీలో మూడు లక్షల రూపాయల ఫైన్ కూడా చెల్లించిందట.

అమెరికాలోని న్యూబెడ్ ఫోర్డ్ గ్రంథాలయంలో 99 సంవత్సరాల క్రితం తన తల్లి తీసుకున్న పుస్తకాన్ని ఆమె మరణించిన పది సంవత్సరాల తరువాత కుమారుడు ఆ లైబ్రరీకి తిరిగి అందచేశాడట.అయితే అలాంటి అరుదైన పుస్తకాన్ని తిరిగి ఇవ్వటమే మహద్భాగ్యంగా భావించిన అధికారులు మీరు జరిమానా చెల్లించనవసరం లేదంటూ దాన్ని ప్రత్యేక స్థలంలో ప్రదర్శనకు పెట్టారట. 1910లో రోజుకు ఒక పెన్నీ ఫైన్‌గా ఉండేదట. ఆలెక్కన దానికి 361.35 డాలర్లను జరిమానాగా చెల్లించాల్సి ఉంది.

-సత్య

క్రైమ్ కథ

హనీషా



"కొన్ని రోజులుగా నాతో ఫోన్‌లో మాట్లాడుతోంది. నీకు చెబితే నమ్మవు. నీకు దేవుడు, దయ్యాలు, ఆత్మల మీద నమ్మకం లేదు. కానీ ఈ రోజు నీకు చెప్పాలనిపించి చెప్పాను" చెప్పాడు లాయర్ శ్యామ్.

"వాట్! నీతో హనీషా మాట్లాడుతోందా? ఎప్పుడు?" ఒకింత ఆశ్చర్యం, మరోవైపు ఏహ్యం రాజేంద్ర ప్రశ్నలో కన్పించింది.

"నువ్వు నమ్మవని తెలిసి లోగడ చెప్పలేదు. ఆమె ఆత్మ మనమధ్య తిరుగుతోంది. నీ గురించి కోపంగా అడుగుతోంది. రెండు నెలల క్రితం నీవు హనీషాను చంపి రహస్యంగా కాటికాపరితో ఖననం చేయించావు. నిన్ను ఏక్షణమైనా చంపుతానని చెబుతోంది"

"ఏయ్ నీకేమైనా పిచ్చా? ఆత్మ మాట్లాడ్డమేంటి ఛ! ఏం మాట్లాడుతావు? నోర్మూసుకోవయ్యా పైగా లాయర్‌వి! ఇవేం నమ్మకాలు?"

"యస్ ఇలా అంటావనే నేను ఏమీ చెప్పకుండా దాచాను. ఇప్పుడు చెబుతాను విను. ఆత్మలు లేవని నీ కంటే ఒకడుగు ముందుండే వాడిని. రోజూ ఆత్మ నాతో మాట్లాడినట్టే ఇవాళ పోలీసులతో మాట్లాడి పాతిపెట్టిన ఆమె శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టమ్ చేయించి మనిద్దరి పనీ పడతానని చెప్పింది. నా గుండెలు రారెత్తిపోతున్నాయి"

రాజేంద్రకు ఒక్కసారి తాగినదంతా దిగిపోయినట్టయింది. "లాయరూ మనం చేసిన ఖూనీని ఎవరైనా చూసి ఇలా బ్లాక్‌మెయిల్ చేస్తున్నారా? ఈ ఆత్మలు మాట్లాడ్డం అనేది నమ్మను"

రాజేంద్ర ఉన్నపళంగా "నీవు నేను వల్లకాటికి వెళ్లి కాపరిని ఎంక్వయిరీ చేద్దాం. ఆ రోజు మనం ఖూనీ చేసి ఏ పోలీసోడూ మన ఛాయలకు రాకుండా చేసుకోగలిగాం. ఇప్పుడు ఇలా అయింది. నీవన్నట్టు ఎవరైనా బ్లాక్‌మెయిల్ చేస్తే డబ్బు డిమాండు ఉండేది కదా! మనల్ని చంపుతామనే చెబుతోంది ఆత్మ. పోనీ బ్లాక్‌మెయిల్ చేస్తున్నది మగాడు కాదు ఆడది. పక్కాగా హనీషా గొంతు విన్పిస్తోంది. తేడా ఏమీ లేదు"

ఇద్దరూ కలిసి బయల్దేరారు. వల్లకాటికి సమీపంలో రోడ్డు మీద కారు ఆపారు. కాపరి వారి దగ్గరికి రానే వచ్చాడు. రాజేంద్రను గుర్తుపట్టి "మీరు రాజేంద్ర కదూ!" అని చీకటిలో గుచ్చిగుచ్చి చూసి అడిగాడు.

"కారు ట్రబుల్ ఇచ్చింది. కాసేపు ఆపితే అదే స్టార్టవుతుంది" వందనోట్లు రెండు ఇచ్చాడు రాజేంద్ర.

"నీవు ఈ వల్లకాడులో ఉంటున్నావు. నిజంగా ఆత్మలు, దయ్యాలున్నాయా? నీవు చూశావా?"

కాపరి అదోలా చూసి "కాపరన్నాక ఎన్ని చీడలు పీడలున్నాయో అన్నీ నిత్యం తగుల్తుంటాయి. నాకు అలవాటైపోయింది"

ఆ మాటలకు లాయర్‌కు చెమటలు పోశాయి.

"ఆ రోజు నీకు ఒక ఆడశవం ఇచ్చి పాతేయమన్నాం. పాతేశావు కదా!" అని అడిగాడు.

"మీరు ఆ శవాన్ని ఇచ్చిన వెంటనే ఖననం చేశాను. అయినా ఇప్పుడు ఆ సంగతి ఎందుకు?" అన్నాడు కాపరి.

"ఆ శవం ఆత్మయి నన్ను ఫోన్‌లో వేధిస్తోంది. దాన్ని ఆత్మగా లేకుండా చేయలేమా?"

"భూతవైద్యుడుని పట్టుకుంటే దాన్ని సీసాలోకి దించేసి మట్టిలో కలిపేస్తాడు. నాకు రెండువేలు ఇవ్వండి. దాన్ని గురించి మరిచిపోండి" చెప్పి చేయి చాచాడు.

రాజేంద్రకు ఇంతవరకు ఎలాంటి నమ్మకాలూ లేకపోయినా రెండువేలిచ్చి అక్కణ్నించి లాయర్‌తో కలిసి వెళ్లిపోయాడు.

ఆ మరుసటి రోజునుంచి "ఫోనులో ఆత్మ మాటలు లేవు" అని లాయర్ రాజేంద్రకు చెప్పాడు.

ఒకరోజు ఇన్‌స్పెక్టర్ స్వరూప్ రాజేంద్రను కలుసుకుని హనీషా కోసం ప్రశ్నించాడు. ఆమె మీ దగ్గర పనిచేసింది. సడన్‌గా ఎవరో లవర్‌తో పారిపోయింది అని మీరంతా చెప్పారు. అప్పట్లో వెతికిపెట్టమని మాకు ఎలాంటి ఫిర్యాదూ అందలేదు. రాత్రి "నన్ను చంపేసి వల్లకాట్లో పాతారు. వచ్చి నా శవాన్ని పోస్టుమార్టమ్ చేయండి" అని ఫోన్‌లో హనీషా ఆత్మ కోరింది. నాకు నమ్మకం లేని ఆత్మగోడు పట్టించుకోనక్కర్లేదు. అయితే ఎక్కడ్నించో ఫోన్ చేస్తోంది. ఇలా ఎందుకు చేస్తోంది? రాజేంద్ర, ఒక లాయర్ కలిసి నన్ను చంపారు అని చెప్పింది"

రాజేంద్ర పెదాలు వణికాయి. అదోలా అయిపోయాడు.

"ఆమె నా దగ్గర పనిచేసింది. ఎవరినో లవ్ చేశానని చెప్పింది. అంతకు మించి నాకు తెలియదు"

"లాయర్‌ను ప్రశ్నించాను. నీవే కత్తితో పొడిస్తే చచ్చిపోయింది, వల్లకాట్లో కాపరితో పాతిపెట్టించావని అతడు చెప్పాడు. నీవు తెలియదంటున్నావు. విషయం దాచకుండా నిజం చెప్పు. లేకుంటే ఇంటరాగేషన్ వరకు పోవాలి" గద్దించాడు.

రాజేంద్ర కొంతసేపు కాదన్నా తర్వాత బ్లడీలాయర్ అంతా చెప్పాక తను దాచేదేముందనుకుని "హనీషా నా దగ్గర స్టెనోగా జాయినైంది. ఇద్దరం ప్రేమలో పడ్డాం. పెళ్లాడమంది. వీలు కాదన్నాను. నన్ను బ్లాక్‌మెయిల్ చేసింది. కత్తితో పొడిచాను. గుడ్లు తేలేసింది. నేను, లాయర్ కలిసి కాపరికి అప్పగించి పాతేయమన్నాం" చెప్పాడు.

"ఆమె చావలేదు. కాపరి సాయంతో ఆసుపత్రిలో కోలుకుంది. నీ మీద ఫిర్యాదు చేసింది. ఆమె ఆత్మలా లాయర్‌ను బెదిరించేది. మీరు చేసిన ఈ నేరం క్షమించరానిది" అని రాజేంద్రనూ వ్యాన్ ఎక్కించాడు ఇన్‌స్పెక్టర్ స్వరూప్.

రాజేంద్ర తల దించుకుని వ్యాన్‌లో కూర్చున్నాడు.

- యర్నాగుల సుధాకరరావు

ఎస్.సి. విద్యార్థుల సంక్షే

ప్రతిభ

ఉజ్జ్వల భవిత

మెరుగైన వసతులు, సౌకర్యాల కల్పనతో రాష్ట్రంలోని ఎస్.సి
ఆవాసాలుగా మారుతున్నాయి. ముఖ్యమంత్రి రోశయ్యగారి
వసతులు మెరుగుపరచడం, విద్యుత్, నీటి సరఫరా తదితర స
పరిష్కరించే దిశగా వార్డెన్లకు కొన్ని అధికారాలను ఇవ్వడం వ
విద్యార్థులకు అవసరమైన దుస్తులు, దుప్పట్లు, పాఠ్యపుస్తకా
కాకుండా కాస్మొటిక్ ఛార్జీల వంటివి కూడా ప్రభుత్వం అంద
రాజశేఖర రెడ్డి గారి కృషితో మెస్ ఛార్జీలు భారీగా పెరిగాయి.

హాస్టళ్ళలో వసతుల కల్పనకు ప్రభుత్వం తీసు

- అద్దె భవనాలలో ఉన్న 593 ఎస్.సి. హాస్టళ్ళ స్థానే
హాస్టల్ భవనాలు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా 467 అత్యాధునిక సమీకృ
హాస్టళ్ళ నిర్మాణం
- 2009-10 బడ్జెట్‌లో ఎస్.సి. హాస్టళ్ళకు రూ. 384.0
కోట్ల కేటాయింపు
- ప్రతి హాస్టల్ విద్యార్థికి ఏడాదికి 1 దుప్పటి, 1 జంప
నాలుగు జతల యూనిఫాం, దుస్తులు, పాఠ్యపుస్తక
నోట్ పుస్తకాల పంపిణీ
- 5వ తరగతి నుండి 7వ తరగతి వరకు ప్రతి విద్యా
నెలకు రూ.475/-ల మెస్ ఛార్జీలు
- 8వ తరగతి నుండి 10వ తరగతి వరకు ప్రతి విద్యా
నెలకు రూ.535/-ల మెస్ ఛార్జీలు

ఎస్.సి. విద్యార్థుల స

ానికి ప్రభుత్వ పథకాలు

ము ఆధారం
కు సోపానం



హాస్టళ్ళన్నీ విద్యార్థులకు ఉత్తమ ప్రత్యేక ఆదేశాలతో, హాస్టళ్ళలో సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే ంటి చర్యలకు కృషి జరుగుతోంది. లు, నోట్ పుస్తకాల పంపిణీయే చేస్తోంది. దివంగత ముఖ్యమంత్రి

కుంటున్న ప్రత్యేక చర్యలు

ఆధునిక

ఖానా,
లు,

కి

ర్థికి

- కళాశాల విద్యార్థుల కోసం కొత్తగా 400 హాస్టళ్ళ మంజూరు. ఇందులో విద్యార్థినులకు 200 హాస్టళ్ళు
- 2008-09 సంవత్సరంలో మెస్ ఛార్జీలు 40% పెంపు
- 2009-10లో రూ. 19.86 కోట్లతో ఎస్.సి. హాస్టళ్ళలో మెరుగైన సౌకర్యాల కల్పన
- 10వ తరగతిలో ప్రతిభ కనబరిచిన 6506 మంది ఎస్.సి. హాస్టల్ విద్యార్థులకు కార్పొరేట్ కాలేజీలలో విద్య
- హాస్టల్ విద్యార్థులకు రూ. 50,000/- వరకు ఆరోగ్యభీమా
- కాస్మొటిక్ ఛార్జీలను నెలకు బాలురకు రూ. 25 ల నుండి రూ. 50 లకు, బాలికలకు రూ. 40 ల నుండి రూ.75లకు పెంపు

మగ్ర వికాసమే ప్రభుత్వ ధ్యేయం

జారీ చేసినవారు: సమాచార, పౌర సంబంధాల శాఖ

విజ్ఞాన వీచిక

పుట్టకముందే నేర్చుకునే శిశువులు

గర్భాశయంలో ఉన్న శిశువుకి తన తల్లి కంఠమే అతి ముఖ్యమైంది. తల్లి ఎముకలు ముఖ్యంగా వెన్నెముక, తుంటి ఎముకల ద్వారా శబ్దం నేరుగా శిశువు లోపలి చెవి భాగాలకు చేరుతుంది. గర్భాశయాన్ని కాపాడే తుంటి ఎముకలు శబ్దాన్ని మరింత ఎక్కువ చేసి వినిపిస్తాయి. తల్లి మాట్లాడినప్పుడు ఆ శబ్దాన్ని శిశువు వినడమే కాకుండా ఆ శబ్దం తాలూకు ప్రకంపనలు కూడా అనుభవిస్తుంది. అంతే కాదు తల్లి శరీర శబ్దాలు, గుండె చప్పుడు, పేగులలో శబ్దాలు కూడా శిశువుకి బాగా అలవాటౌతాయి. తల్లి గుండె చప్పుడు రికార్డ్ చేసి చంటి పిల్లకు వినిపిస్తే వాళ్ళు ఏడుపు మానేస్తారని అధ్యయనాలు నిరూపించాయి. గర్భిణీ స్త్రీలు సంగీతం విన్నా, పాటలు పాడినా ఆ లక్షణాలన్నీ జన్మించిన తర్వాత శిశువుకు అబ్బే అవకాశం వుంది. అంటే శబ్దాలను, వాసనలను, రుచులను కేవలం గ్రహించడమే కాకుండా వాటిని గుర్తుపెట్టుకోగల శక్తికూడా గర్భస్థ శిశువుకి అలవాటౌతుందని తెలిసింది.

గర్భిణీ స్త్రీలు విన్న, చదివిన విషయాలను ఇంకా సంపూర్ణంగా రూపుదిద్దుకోని శిశువు పిండరూపంలోనే ఆకళింపు చేసుకోవడం, పుట్టిన తర్వాత కూడా ఆ విషయాలను గుర్తుంచుకోవడం వంటివి అభూత కల్పనల్లాగే అనిపించవచ్చు. కానీ సమకాలీన పరిశోధనలు అటువంటి పరిస్థితులు నిజంగా నిజమే అంటున్నాయి!

గత శతాబ్దపు డెబ్బయ్యవ దశకం వరకూ కూడా గర్భస్థ శిశువుకు అంధత్వం, బధిరత్వం రెండూ ఉంటాయనే అనుకునేవాళ్లు. ఇంకొంతమందైతే అటువంటి శిశువులకు నొప్పికూడా తెలిసే అవకాశాలు లేవనే భావించేవారు. ఇక శిశువులకు జ్ఞాపక అవగాహన వుంటుందన్న అలోచనకే ఆస్కారం లేదు!

అయితే క్రమంగా అభివృద్ధి చెందిన శాస్త్రీయ పరిజ్ఞానం మాత్రం సరికొత్త వివరాలను మన ముందుంచింది. అల్ట్రాసౌండ్ ఫొటోలు, కచ్చితమైన పరికరాలు గర్భస్థశిశువు హృదయ కదలికలు సైతం నిశితంగా గమనించగల స్థాయిలో వున్నాయి.

గర్భంలో వుండగానే శిశువుకు అనేక గ్రహణ శక్తులు అబ్బుతాయి. ముందుగా సమతుల్యత (బాలెన్స్), చలనం, ఆ తరువాత స్పర్శ, ఘ్రాణ, రుచి, శ్రవణ శక్తులూ, చివరిగా దృష్టి అభివృద్ధి చెందుతాయి. మూడవ ట్రైమెస్టర్ (ప్రసవానికి ముందు మూడు నెలలు) మధ్యలోనే ఈ ఇంద్రియ శక్తులన్నీ పనిచేయడం ప్రారంభిస్తాయి. సుమారు 27వ వారం నుండే ఫీటస్ (గర్భస్థ శిశువు) బయటి శబ్దాలకు ప్రతిస్పందన చూపుతుందని తెలిసింది. శబ్దాలను బట్టి హృదయ స్పందన వేగవంతమవ్వడం, శరీరం ముడుచుకోవడం, కళ్లు మూయడం వంటివి జరుగుతాయి. ఈ రకం స్పందనలు తొలుత 110 డెసిబెల్లు దాటిన శబ్దాలకే కలిగినా, క్రమేపీ తక్కువ స్థాయి శబ్దాలకు కూడా గ్రహించే శక్తి పెరుగుతుంది.

గర్భాశయంలో ఉన్న శిశువుకి తన తల్లి కంఠమే అతి ముఖ్యమైంది. తల్లి ఎముకలు ముఖ్యంగా వెన్నెముక, తుంటి ఎముకల ద్వారా శబ్దం నేరుగా శిశువు లోపలి చెవి భాగాలకు చేరుతుంది. గర్భాశయాన్ని కాపాడే తుంటి ఎముకలు శబ్దాన్ని మరింత ఎక్కువ చేసి వినిపిస్తాయి. తల్లి మాట్లాడినప్పుడు ఆ శబ్దాన్ని శిశువు వినడమే కాకుండా ఆ శబ్దం తాలూకు ప్రకంపనలు కూడా అనుభవిస్తుంది. అంతే కాదు తల్లి శరీర శబ్దాలు, గుండె చప్పుడు, పేగులలో శబ్దాలు కూడా శిశువుకి బాగా అలవాటౌతాయి. తల్లి గుండె చప్పుడు రికార్డ్ చేసి చంటి పిల్లకు వినిపిస్తే వాళ్లు ఏడుపు మానేస్తారని అధ్యయనాలు నిరూపించాయి. గర్భిణీ స్త్రీలు సంగీతం విన్నా, పాటలు పాడినా ఆ లక్షణాలన్నీ జన్మించిన తర్వాత శిశువుకు అబ్బే అవకాశం వుంది. అంటే శబ్దాలను, వాసనలను, రుచులను కేవలం గ్రహించడమే కాకుండా వాటిని గుర్తుపెట్టుకోగల శక్తికూడా గర్భస్థ శిశువుకి అలవాటౌతుందని తెలిసింది.

గర్భిణీ స్త్రీలు డైటింగ్ గానీ, ఉపవాసాలు గానీ ఎక్కువ చేస్తే ఆ ప్రభావం కూడా పుట్టబోయే శిశువుపై, పుట్టిన తర్వాత కూడా వుంటుంది. తక్కువ భోజనం చేసే తల్లి కారణంగా గర్భస్థ కూడా తక్కువ ఆహారంతోనే మనగల శక్తిని అభివృద్ధి చేసుకుంటుంది. అంటే తక్కువ ఆహారాన్నే మెరుగ్గా వినియోగించుకోగలదన్నమాట. తత్ఫలితంగా శిశువు కాలేయం ఎక్కువ మోతాదులో చక్కెర పదార్థాలు విడుదల చేస్తుంది. ఎక్కువ శక్తికోసం ఆదే సమయంలో పాంక్రియాస్ తక్కువ మోతాదులో ఇన్సులిన్‌ని విడుదల చేస్తుంది. ఈ తరహా ఫీటల్ ప్రోగ్రామింగ్' శిశుజననం తర్వాత కూడా కొనసాగుతుంది. పుట్టిన తర్వాత అధిక మోతాదులో ఆహారం లభిస్తే, పసిపిల్లల్లో అవాంఛనీయ ప్రభావాలు చోటు చేసుకుంటాయి. అప్పటివరకూ తక్కువ ఇన్సులిన్ వుండడం వల్ల ఆధిక ఆహారం స్థూలకాయానికీ, డయాబెటిస్‌కీ దారి తీస్తుంది.

మాతృభాష, అలవాట్లు, ఇష్టాలు, అనుభూతులు వంటివి గర్భంలో ఉన్నప్పుడే శిశువు నేర్చుకునే అవకాశం వుంది. అయితే అవి పదే పదే అనుభవంలోకి వస్తేనే పుట్టిన తర్వాత కూడా వాటి ప్రభావం కనిపిస్తుంది.

- డా॥ విజయ్



ఫలూదా చల్లచల్లగా

ఎండలు బాగా పెరిగిపోయాయి. కాలు బయట పెట్టాలంటే భయమేస్తోంది. అయినా తప్పదు. అందుకే ఈ వేడిని తట్టుకోవడానికి వీలైనన్ని మార్గాలను వెతుక్కుంటున్నారు. కొబ్బరి బోండాలు, కూల్‌డ్రింక్స్, పండ్ల రసాలు, ఐస్‌క్రీములు... వంటి వాటిని ఆశ్రయించి ఎండ తాపాన్ని తగ్గించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో ఫలూదా ఒకటి. దీని ప్రాముఖ్యత, దీన్ని ఎలా తయారు చేస్తారు, తయారుచేయడానికి ఏమేమీ కావాలి అనే విషయాలు తెలుసుకుందాం.

ఫలూదా అనే పేరు కొందరు ఇప్పటి వరకూ వినకపోయుండొచ్చు. కానీ ఇది దాదాపు 500 సంవత్సరాల నుండి మనల్ని సూర్యతాపం నుండి రక్షిస్తోంది. ఇది మన శరీరంలోని వేడిని తగ్గించి ఎంతో మేలు చేస్తుంది.

ఫలూదా అనేది సబ్జా గింజలు వేసి చేసే ప్రత్యేకమైన చల్లని పానీయం. ఎండల ప్రభావం కాస్త ఎక్కువైందంటే చాలు హైదరాబాద్ హోటళ్లలో ఫలూదా డ్రింకుల హంగామా మొదలవుతుంది. ఏప్రిల్, మే నెలల్లో ముంబయిలో ఎక్కడ చూసినా పొడవాటి గ్లాసుల్లో ఫలూదా తాగుతున్నవారు కనిపిస్తారు. అక్కడ వేసవి పార్టీల్లో వడ్డించే పదార్థాల్లో మొదటి స్థానం ఫలూదాదే.

చల్లచల్లని ఫలూదా మెల్లగా గొంతులో జారుతూ వుంటే సూపర్‌గుంటుంది. ఆ మజాయే వేరు. పాలు, ఐస్‌క్రీమ్ చల్లగా బావుంటాయి. అయితే ఫలూదాలో మధ్య మధ్యలో సబ్జా గింజలు, డ్రైఫ్రూట్స్ పంటికి తగులుతున్నప్పుడు ఉండే అదో రకమైన రుచి భలేగా ఉంటుంది. మార్చి 21న విషువత్తు సమయంలో జరుపుకునే ఉత్సవాల్లో ఈ పానీయం తప్పకుండా ఉంటుంది.

విభిన్న ఫ్లేవర్లలో...

కొందరు దీనిలో నూడుల్స్ కూడా వేసుకుంటారు. కుంకుమ పువ్వు, మామిడి చాకొలెట్, ఫిగ్ ఫ్లేవర్లలో కూడా ఇది లభ్యమవుతుంది. 'అందీరా' అనే ఫలూదాలో వివిధ రకాల రోజ్‌సిరప్‌లను కలుపుతారు.

ఎక్కడి నుంచి ఎలా వచ్చింది?

దీన్ని మొదట ఇరాన్‌లో పర్షియన్లు కనిపెట్టారు. ఇది మొఘలుల కాలంలో మనదేశానికి పరిచయమైంది. అయితే ఇది మనదేశానికి ఎలా వచ్చిందో చెప్పాలంటే మనమొక చిన్నసైజు కథను చెప్పుకోవాలి.

కుతుబ్‌షాహీ సమాధులను గమనిస్తే వాటి గుమ్మి మీద కొన్ని ఫలకాలు కనిపిస్తాయి. ఈ ఫలకాలను వినియోగించిన తీరు ఎంతగానో అబ్బురపరుస్తుంది. మనదేశానికి ఈ ఫలకాలెలా వచ్చాయో తెలిస్తే ఫలూదా విషయమూ అర్థమవుతుంది. కళలు, కళాత్మక నిర్మాణాలు, రుచికరమైన వంటలు తన రాజ్యంలో ఉండాలని కోరుకున్న కుతుబ్‌షాహీ నవాబులు ఎన్నో తమ రాజ్యానికి దిగుమతి చేసుకున్నారు. అలా ఎడారుల దాటి ఎన్నో రుచికరమైన వంటలు మన దేశంలోకి అడుగుపెట్టాయి. ఆ విధంగా ఎడారులు దాటి వచ్చిన రుచికరమైన వంటల్లో చల్లటి, తియ్యటి ఫలూదా కూడా ఒకటి. సూర్యుని వేడిమి నుండి ఉపశమనాన్ని పొందడానికి వారు ఎక్కువగా ఈ పానీయాన్ని సేవించేవారు. కుతుబ్‌షాహీల కాలంలో సైనిక పాటవానికి ఎంత ప్రాధాన్యత ఉండేదో దస్తర్‌ఖానాల(వంటశాల)కు అంతే ప్రాధాన్యత ఉండేది. వంటశాలల నుండి నిత్య ఘుమఘుమలు వస్తూనే ఉండేవి. సాయంత్రం వేళల్లో గిన్నెలకొద్దీ ఫలూదాను తయారు చేసేవారట. వేసవిలో ఈ ఫలూదా పానీయం లేకుండా దర్బారు సాగేది కాదట.

పర్షియన్లు దీన్ని ఫలూదా లేదా పలూదా అని అంటారు. వారు దీన్ని నిమ్మరసం, గంజి వేసి కూడా తయారు చేసుకుంటారు. ఇది వారి సాంప్రదాయ వంట. ఇది థాయ్ డ్రింక్ 'మంగ్లక్'ను పోలి ఉంటుంది.

★

ఒక గ్లాసు ఫలూదాకు ఏమేం కావాలి?

సబ్జా గింజలు - ఒక టేబుల్ స్పూను
రోజ్ సిరప్ - రెండు టేబుల్ స్పూన్లు
చల్లని పాలు - 3/4 కప్పు
వర్మిసెల్లి(ఫలూదా సేవ్) - 2 టేబుల్ స్పూన్లు
వెనిల్లా ఐస్‌క్రీమ్ - ఒక స్కూప్
డ్రైఫ్రూట్స్ - కొంచెం

ఎలా తయారు చేస్తారు?

ఫలూదాను తయారు చేయడం పెద్ద కష్టమేం కాదు. అలాగని రుచిలో ఏం తీసిపోదు. ముందుగా సబ్జా గింజలను నీటిలో ఒక రెండు గంటలపాటు నానబెట్టాలి. దీనివల్ల అవి బాగా ఉబ్బుతాయి. తర్వాత పాలు, వర్మిసెల్లి, రోజ్ సిరప్‌ను కలిపి బాగా చిలకాలి. నానిన సబ్జాగింజలను ఒక గ్లాసులో వేసుకోవాలి. వాటి మీద షేక్ చేసిన పాలు, రోజ్ సిరప్‌ను పోయాలి. దాంట్లో కొంచెం ఐస్‌క్రీమ్‌ను వేయాలి. అది పైన తేలుతుంది. దాని మీద డ్రైఫ్రూట్స్ వేసుకోవాలి. ఇప్పుడు ఈ ఫలూదా తాగుతుంటే చూడాలి. శరీరంలోని వేడిని పూర్తిగా తీసేసినట్టుగా, చల్లచల్లగా, హాయిగా ఉంటుంది.



ఎన్నో చోట్లు... అవే పాట్లు...

శ్రమే ప్రగతికి మూలం.. శ్రమజీవే జగతికి ఆధారం.. శ్రమ శక్తే జీవాధారం అని అందరూ కీర్తిస్తారు. మేడే రోజున పాలకులు చాలా హడావిడి చేస్తారు. అయితే శ్రమ జీవుల గురించి, నేటి వారి స్థితిగతుల గురించి నిజమైన అవగాహన ఎందరికుంది? య్థార్థ జీవిత యదార్థ దృశ్యం ఎంత వరకూ ఆవిష్కరించబడుతున్నది? కాలం మారిపోయిందనీ కంప్యూటర్ యుగంలో కష్టజీవుల కడగండ్ల గురించి చెప్పేవి వట్టి కబుర్లేనని తీసి పారేసే ప్రబుద్ధులు ఎందరు లేరు? సాంకేతిక మార్పుల ప్రచారం ఎంత జరిగినా సామాజిక చిత్రం మారడం లేదని, శ్రమ జీవన దృశ్యం వేదనా భరితమేనని ఇలాంటి వారికి నిజంగా తెలుసా? ఏ తరగతిలో వున్నా ఏ తరంలోనైనా శ్రమ ఫలితం సక్రమంగా అందేట్టు చేయడం అన్నిటికన్నా ముఖ్యం. కానీ మన మధ్యన మసలే ఉద్యోగ కార్మిక వర్గాలలో ఎందరికి ఆహార భద్రత, కనీస విశ్రాంతి, శాంతి దక్కుతున్నది? అధికారులు, అధినేతలు, ఖాకీల పెత్తనాలకు తోడు ప్రపంచీకరణ ప్రయివేటీకరణ విశృంఖలత్వానికి ఎందరి జీవితాలు అంధకారమవుతున్నాయో ఆలోచించారా! ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో వివిధ రంగాలలో శ్రమ జీవుల జీవితాలను దగ్గరగా పరిశీలించినపుడు గగుర్పాటు కలిగించే య్థార్థ భరిత గాథలు అనేకం వెలుగులోకి వచ్చాయి. ఆ విశేషాలు...

ఇల్లు గడవాలిగా...

అటు పొలం పనులు లేక, ఇటు పంటలు పండక ...చిన్న చిన్న రైతులు మొదలుకొని, వ్యవసాయ కార్మికుల వరకు కూలి పనికి పోక తప్పడంలేదు. వారికింత కూలి అంది, ఇంత బువ్వ తినేందుకు వుద్దేశంచిన రేగా నిర్వహణ సరిగా లేక కూలీలు పడుతున్న అవస్థలెన్నో.

అనంతపురం జిల్లా నల్లమాడ మండలం మీసామల్లి గ్రామానికి చెందిన ఖలిజాబీకి ఇద్దరు పిల్లలు, భర్త హైదరలి వికలాంగుడు. వీరి ముగ్గుర్నీ పోషించే బాధ్యత ఈమెదే. ఉపాధి పనికి పోయి వచ్చిన కూలితో ఇల్లు గడవాలి. పనికి పోయి నెలైంది. ఇప్పటి వరకు కూలీ డబ్బులు రాలేదు. కిరాణా అంగట్లో 1200 రూపాయలు అప్పుచేసి రోజువారి సరుకులు తీసుకుని కాలం వెళ్లబుచ్చుతున్నది. ఆ షాపతను (అంగడి) ఇంతకంటే మించి అప్పు ఇవ్వలేమని చెప్పడంతో గత్యంతరం లేక నాలుగు రోజుల నుండి రాగులు (తైదులు) ఇసురుకుని (పిండి పట్టించి) అంబలి కాచుకుంటున్నారు. "ఏం చెయ్యాలి సార్! నాలుగు దినాల నుండి రాగి గంజి తాగి (అంబలి) ఉంటున్నాం. పిల్లలు అంబలి తాగలేక ఏడుస్తున్నారు. నెలైంది ఉపాధి పని చేసి, ఇప్పటివరకు కూలి ఇవ్వలేదు. చివరకు స్టోర్‌కు (రేషన్‌షాపుకు) వచ్చిన బియ్యం కొనడానికి కూడా 40 రూపాయలు లేవు. ఎవరిని అడిగినా లేవంటున్నారు. ఉపాధి పని మా పేదోళ్లకు మంచిది. కానీ ఏం చేస్తాం. పని చేసినందుకు నెల రోజులైనా కూలి ఇవ్వరు. మేం పొద్దున పనికి పోతే రాత్రి కూలి వస్తే తప్ప మా కుటుంబం గడవదు. ఉపాధి పనిలో కూలి 2 వారాల లోపు ఎప్పుడూ రాలేదు. ఎండాకాలం. ఎక్కడా పనులు లేవు. వ్యవసాయం అసలే లేదు. ఉన్నది ఉపాధి పని ఒక్కటే. ఇదైనా సక్రమంగా ఇస్తారా అంటే 3 రోజులు పెడ్తారు. అయిపోయిందని చెప్తారు. పొద్దున 6 గంటలకు పోతే మధ్యాహ్నాం 1 గంటకు వస్తాం. ఎర్రటెండలో చేతులు బొబ్బలెక్కేలా పని చేసినా 60, 70 రూపాయలకు మించి కూలి రాలేదు. 100 రూపాయలు రావాలి కదా అంటే మీరు చేసినంతా ఇచ్చామని అధికారులు చెపుతున్నారు. పనిచేసే చోట నీడ కోసం టెంట్ వేస్తామని చెప్పారు. కానీ ఇప్పటి వరకూ టెంటే వేయలేదు. పనిచేసేటప్పుడు కూడా ఎండలో తినాల్సిందే. అంతే కాకుండా మగవాళ్లతో సమానంగా గడ్డపార పని చేయాలంటారు. లేకపోతే పనికి రావద్దంటారు. గడ్డపార తగిలి

కాలికి గాయమైంది. దీనికి మందులు లేవు. పని చేయడానికి ఇబ్బందిగా వుంది. గాయాలైతే చూపిస్తామని చెప్పారు. ఎవ్వరూ పట్టించుకునే వాళ్లే లేరు. ఇంటి దగ్గర వుందామంటే పూట గడవదు. ఎట్లో కాలం ఎల్లబుచ్చుతున్నాం. కాబట్టి గవర్నమెంటు పనికైనా రోజు కూలి 150 ఇస్తే పెరిగిన ధరలతో కొంతైనా బాగుంటుంది" అని వాపోయింది.

చేసిందంతా ఫైనాన్సుకే

సొంత వాహనం లేదు. బయటికెళ్లాల్సొచ్చింది. అటువంటప్పుడు వెంటనే గుర్తొచ్చేది ఆటో. ముఖ్యంగా అర్ధరాత్రి అపరాత్రి అని లేకుండా, రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్ అని లేకుండా ఎక్కడైనా ఎప్పుడైనా సిద్ధంగా వుండేది ఆటోలు. మన జీవితంలో ఇంత ప్రధాన పాత్ర పోషిస్తున్న ఆటో డ్రైవర్ల బతుకులు ఎలా వున్నాయ్?

"హైదరాబాద్ నగరంలో భార్యాపిల్లలతో బతకలేకపోతున్నాం. ఉదయం 6గంటలకు రోడ్డుపైకి వచ్చి రాత్రి 10గంటల దాక ఆటో తోలినా కూడా రూ.300 రావడం లేదు. వీటిలో ప్రతినెలా బండి ఫైనాన్సుకే రూ.5000పైగా కట్టాలి. పనిలేక ఒక్కనెల కట్టకపోయినా ఫైనాన్స్‌వాళ్లు బండి తీసుకెళ్తారు" అని నల్గొండ జిల్లాకు చెందిన ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఫైనాన్స్ వాళ్లు పట్టుకున్నందుకు రూ.300, గ్యారేజి కిరాయి రోజుకు రూ.15 చెల్లించాలి. ఇన్ని బాధలు పడుతూ ఆటో తోలినా పోలీసు వేధింపులు తప్పడం లేదని మీర్‌సర్దార్‌అలీ బాధపడుతున్నారు. చాదర్‌ఘాట్ నుంచి మహాత్మాగాంధీ బస్‌స్టాండ్ రూట్‌లో బండికి సంబంధించిన కాగితాలు అన్నీ ఉన్నా కూడా రూ.50-100 వరకూ పోలీసులు వసూలు చేస్తున్నారని, అటువైపు వెళ్లేందుకు ఎవరూ సాహసించడం లేదని అన్నారు. ఫైన్ తీసుకున్నా రసీదు కూడా ఇవ్వడం లేదని, ఒకవేళ రసీదు అడిగితే రూ.250 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో నగరంలో ఆటో నడిపించి కుటుంబాన్ని పోషించడం చాలా కష్టమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆటో తోలడం వల్ల వచ్చిందంతా బండి ఫైనాన్సు కట్టడానికి సరిపోవడం లేదని పాలమూర్ జిల్లాకు చెందిన ఆటోడ్రైవర్ జగన్ వాపోతున్నారు. "ఇరుకు ఇళ్లల్లో పిల్లలతో కాలం వెల్లదీస్తున్నాం. వీటికి రూ.2000వరకూ కిరాయి కడుతున్నాం, ఆలస్యమైతే ఇంటి యాజమానితో తిప్పలే. నా భార్య పాచిపని చేసినా కుటుంబానికి సరిపోవడం లేదు. మా బతుకులు ఎలాగో పాడయ్యాయి. కనీసం పిల్లలనైనా మంచిగా చదివిద్దామంటే స్కూలు ఫీజులు వేలల్లో ఉన్నాయి. సర్కార్ స్కూళ్లలో చదివిస్తున్నాం. ప్రభుత్వం బస్సుఛార్జీలు కనీసం ఆరు రూపాయలకు పెంచింది. ఆటోలకైతే ముగ్గురు ప్రయాణికులకు కలిపి రూ.12 (1.6కిమి) తీసుకోవాలని నిబంధన పెట్టింది. ముగ్గురు ప్రయాణికులతో పాటు పిల్లలు, సామాన్లను కూడా తీసుకెళ్తున్నాం. ఆటోలకు కూడా కనీసం రూ.15 పెంచితే గిట్టుబాటవుతుంది. ఉదయం ఆరుగంటల నుంచి రాత్రి 10గంటల వరకూ ఆటో నడిపించి, త్వరగా ఇంటికెళ్లే స్వేచ్ఛకూడా లేదు. ఇంటికెళ్లే సమయంలో ప్రయాణికులను తీసుకెళ్లేందుకు నిరాకరిస్తున్నట్లు పొరపాటున పోలీసులకు కనిపిస్తే అంతేసంగతులు. ఫైన్ చెల్లించాల్సిందే. ఎదురు చెబితే ఆటో సీజ్ చేస్తామని బెదిరింపులు. ఇక ప్రయివేటు ఫైనాన్సుల సంగతి చెప్పేదేముంది? వీరి బారి నుంచి ఆటో డ్రైవర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి. ఎందుకంటే ఫైనాన్సుల ద్వారా ఆటోలను కొనడం వల్ల క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లించాలి. పనిలేని సందర్భాల్లో (కర్ఫ్యూ, బంద్‌లు) చెల్లించడం కష్టమవుతుంది. పైగా వడ్డీపై వడ్డీలు వేస్తూ జలగల్లా పీల్చుకుతింటారు. బ్యాంకుల ద్వారా ఆటోలను ప్రభుత్వమే ఇప్పిస్తే, వడ్డీరేటు కూడా తక్కువగా ఉంటుంది. పైగా పనిలేని సందర్భాల్లో ఏదో ఒక నెల చెల్లించకున్నా కూడా చక్రవడ్డీ, బారువడ్డీ వుండదని చిన్న ఆశ. అంతే" అంటారు జగన్.

విలాసం కాదు విలాపం

ఐటీ ఉద్యోగం.....అదో విలాసవంతమైన జీవితం, అధిక వేతనంతో పాటు సమాజంలో ఉన్నతమైన హోదా కలిగిన వృత్తి. ఇంటి నుండి ఆఫీసుకు క్యాబ్‌లు, కదిలే అవసరమే లేకుండా దగ్గరకు వచ్చే సౌకర్యాలు, ఫోన్లలో గంటల తరబడి మీటింగులు, ల్యాప్‌ట్యాప్‌లో చాటింగ్‌లు, చల్లని జ్యూస్‌లు,

ఖైరతాబాద్ టూ ఉస్మానియా క్యాంపస్

గతంలో నాకు జీతం చాలా ఎక్కువగా ఇస్తుండటంతో ఖైరతాబాద్‌లో ఐదు వేల రూపాయల అద్దె ఇంట్లో ఉన్నాను. ఆర్థికమాంద్యం వల్ల ఐటీకి ఉన్న క్రేజ్ ఒక్కసారిగా పడిపోవటంతో జీతంలో భారీ కోత విధించారు. దీంతో ఖైరతాబాద్‌లో అద్దె భరించలేని నేను ఉస్మానియా క్యాంపస్‌లో బోర్డర్స్‌గా ఉన్న కొందరు మిత్రుల వద్ద తలదాచుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత తక్కువ అద్దెతో వడ్డెరబస్తీలో రూమ్‌ను అద్దెకు తీసుకున్నాను. గతంలో నన్ను ఆఫీసుకు తీసుకెళ్లడానికి ప్రత్యేకంగా క్యాబ్‌ను పంపించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. కంపెనీ ఆర్థికభారాన్ని తగ్గించుకునేందుకు ఉద్యోగులందరికీ ఒకే బస్సు కేటాయించింది. పరిస్థితులు తలకిందులవటంతో యుఎస్ వెళ్లాలన్న నా నిర్ణయాన్ని మార్చుకోవాల్సి వచ్చింది.

ఓ.రాజు,
(ఫ్రాంక్లిన్ టెంపుల్‌టెన్ ఇన్వెస్ట్‌మెంట్స్ కంపెనీ ఉద్యోగి)







వారాంతంలో షాపింగులు, పబ్‌లు, డిస్కో టెక్కుల్లో డ్యాన్సులు. ఐటీ ఉద్యోగుల జీవితం గురించి ఏ చిన్న పిల్లవాణ్ని అడిగినా చెప్పే విషయాలివి. ఆర్థికమాంద్యం దెబ్బకు ఈ పరిస్థితి నేడు తలకిందులయ్యింది. ఉద్యోగ భద్రత కరువైంది.

అధిక వేతనం తీసుకుంటున్న ఐటీ ఉద్యోగులు అనేక కష్టనష్టాలను కూడా ఎదుర్కొంటున్నారన్నది కాదనలేని వాస్తవం. ఏ రంగంలోనైనా సాధారణంగా 8 గంటల డ్యూటీ ఉంటుంది. కానీ ఐటీ ఉద్యోగులు మాత్రం 9 గంటలపాటు పనిచేయాల్సి ఉంటుంది. అన్ని కంపెనీల లావాదేవీలు ప్రపంచవ్యాప్తంగా ఉండటంతో విదేశీ కంపెనీలతో కలిసి పనిచేసేందుకు వీలుగా ప్రతి రోజూ 9 గంటలపాటు పనిచేయాలనే నిబంధన విధించారు. ముఖ్యంగా పనివేళలు నిర్దిష్టంగా లేకపోవటం వీరి పాలిట శాపంగా మారింది. ఇతర అన్ని రకాల ఉద్యోగాల్లో 99 శాతం వరకు ఎల్లప్పుడూ ఒకే రకమైన పనిగంటలు ఉంటాయి. కానీ ఐటీ కంపెనీల్లో కొన్ని రోజులు పగలు డ్యూటీలు చేస్తే, మరికొన్ని రోజులు రాత్రి డ్యూటీలు చేయాలి. సాధారణంగా రెండుమూడు నెలలకు ఒకసారి ఈ డ్యూటీలను మారుస్తుంటారు. డ్యూటీ వేళల్లో మార్పులు వచ్చినప్పుడు దాంతోపాటే ఆహారవేళల్లో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. పగటిపూట డ్యూటీ ఉన్నప్పుడు పొద్దున్నే లేచి స్నానపానాదులు ముగించుకుని అల్పాహారం తీసుకుని ఆఫీసుకు వెళ్తారు. ఆ తర్వాత మధ్యాహ్నం భోజనం ఆఫీసులోనే ముగించి రాత్రిపూట ఇంటికి చేరుకుంటారు. అప్పుడు చాలినంత నిద్రకూడా ఉంటుంది. దీనికి పూర్తి భిన్నంగా రాత్రిపూట డ్యూటీ ఉంటుంది. రాత్రి డ్యూటీ చేయాల్సి వచ్చినప్పుడు ఐటీ ఉద్యోగులు పగటిపూట మొత్తం నిద్రపోతుంటారు. ఆహారపు అలవాట్లు కూడా మారతాయి. దీని వల్ల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటోందని మాదాపూర్‌లోని ఓ ఐటీ కంపెనీలో పనిచేస్తున్న శ్యామ్‌సుందర్ చెప్పారు. రాత్రి డ్యూటీల వల్ల శరీరం బలహీనంగా తయారవుతుందని, ఆహారపు అలవాట్లల్లో మార్పు వల్ల గ్యాస్ట్రబుల్, అల్సర్‌లాంటి జబ్బులు వస్తున్నాయని అతను తెలిపారు. గతేడాది వరకు హైదరాబాద్ జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ పరిసర ప్రాంతాల్లో అద్దెకు ఇళ్లు దొరకాలంటే గగనకుసుమంగా మారేది. అద్దెలు కూడా భారీ స్థాయిలో (కనీసం 5 వేలు) ఉండేవి. ఆర్థికమాంద్యం వల్ల ఐటీ బూమ్ పడిపోయింది. ఉద్యోగుల జీతాల్లో పెద్ద ఎత్తున కోతలు పెడుతున్నారు. గతంలో 40 నుండి 50 వేలుగా ఉన్న జీతాలను ఇప్పుడు అకస్మాత్తుగా 25 నుండి 30 వేలకు తగ్గించారు. దీంతో ఐటీ ఉద్యోగులు కూడా తమ ఖర్చులను భారీ స్థాయిలో తగ్గించుకుంటున్నారు. వారాంతంలో సినిమాలు, షికార్లు, షాపింగులు గతంలో ఉన్నంతగా లేవు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ప్రాంతాల్లో అద్దెలను భరించలేని ఐటీ ఉద్యోగులు అక్కడి రూముల్ని ఖాళీ చేసి మెహిదీపట్నం, సికింద్రాబాద్, ఆర్టీసి క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాలకు వెళ్లిపోతున్నారు. ఫలితంగా జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ ఏరియాల్లో గతంలో ఎన్నడూ లేనంతగా టూలెట్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.

మిగిలేదేమీ లేదు

స్కూల్లో డ్రాపవుట్స్ తగ్గించడానికి, పేద పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించడానికి కేంద్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ఏర్పాటు చేసింది. వేలాదిమంది ఈ పథకం కింద పని చేస్తున్నారు. అలాంటి వర్కర్లలో సబిత ఒకరు. విశాఖ జిల్లాలో పనిచేసే ఆమె కష్టనష్టాలేంటో చూద్దాం.

పేద పిల్లలకు ఇంత వండిపెడుతున్నారన్న తృప్తి తప్ప ఇంకేం లేదు. పేరుకు వర్కర్లేగానీ వారికే సౌకర్యాలూ లేవు. ఆఖరుకు వంట చేయడానికి నీడ కూడా లేదు. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ వండుతుంటుంది. వంట పాత్రలు కూడా వుండవు. ఆమే ఏర్పాటు చేసుకోవాలి. మూడు నాలుగు కిలోమీటర్ల దూరం నుంచి నీళ్లు తెచ్చుకోవాలి. ఇదివరలో పావలా అయినా మిగిలేది. ఇప్పుడది కూడా మిగలట్లేదు. మొదట్లో ఆ పూటకు అన్నమైనా దొరికేది. ఇప్పుడదీ లేదు. మొదట ఒక్కో పిల్లవాడికి 120 గ్రాముల బియ్యం ఇచ్చేవారు. ఇప్పుడు 100 గ్రాములే ఇస్తున్నారు. దాంతో పిల్లలకు కడుపు నిండా భోజనం కూడా వుండట్లా. చూసేవారికి ఈమేదో తగ్గిస్తోందనిపిస్తుంది. ప్రభుత్వంవారిచ్చే 50 కేజీల బస్తాలో 47 కేజీల బియ్యం వుంటాయి. ఆ నష్టం కూడా ఈమే భరించాలి. ఆఖరుకు గోనె సంచీ కూడా తీసుకోడానికి లేదు. డీలర్‌కే ఇవ్వాలి. నూక తియ్యకూడదు. అన్నం ముద్దవకూడదు. కందిపప్పు రేటు పెరిగింది. పెరిగిన రేటు గవర్నమెంటు ఇవ్వట్లేదు. ఏ నెలకానెల అప్పుల్జేసి వండిపెడుతోంది. ఆరు నెలల బిల్లులివ్వాల్సుంటే 2 నెలల బిల్లులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఓ పక్క పెరిగిన ధరలు, మరో పక్క రాని బిల్లులు, మరోవైపు షావుకారు తిట్లు. అప్పులు తీర్చడానికి ఇంట్లో వున్న వస్తువులు తాకట్టు పెట్టి ఆ నెలకు నడిపిస్తుంటుంది. అదీ కుదరకపోతే మైక్రో ఫైనాన్స్ సంస్థలను ఆశ్రయిస్తుంటుంది. అక్కడ తీసుకున్న అప్పులు తీర్చడానికి పడే తిప్పలు ఎన్నో. దీనివల్ల ఒక్కోసారి ఇంట్లో తగాదాలు కూడా

అవుతుంటాయి. ఏ పార్టీ కుర్చీలో వుంటే ఆ పార్టీ మనుషులకు పని ఇప్పించుకుంటారు. ఇంత కష్టపడి పని చేస్తున్నా పైసా మిగలడంలేదు. కనీసం టైముకి బిల్లులైనా ఇమ్మని అడిగితే ఇవ్వరు. పైగా "మిగలనప్పుడు పనిచేసేది ఎందుకంట. వదిలేయండి. స్వచ్ఛంద సంస్థలకు ఇచ్చేస్తాం" అని బెదిరిస్తారు. ఈ కష్టాలన్నీ కడుపులో కుక్కుకుని పొయ్యిమీదకు అన్నం కుండ ఎక్కిస్తుంటారు.

ఇది ఒక్క సబిత కష్టం కాదు. దాదాపు మధ్యాహ్న భోజన పథకం కార్మికులందరివి. ఏదో మొదట్లో వీళ్లక్కూడా వెయ్యి రూపాయల జీతాలిస్తారని చెప్పారని ఈ కష్టాలన్నీ పడి ఈదుస్తున్నారు. ఆ జీతాలిచ్చేదెన్నడో, వీళ్ల పుచ్చుకునేదెన్నడో...

దినదిన గండం...

నెత్తురునే చెమటగా మార్చి ప్రపంచానికి నల్లబంగారాన్ని అందించేవారే సింగరేణి కార్మికులు... ఉదయం 5 గంటలకు లేచి సైకిలెక్కి 10 కిలోమీటర్ల దూరం వెళ్లి పనిచేయాల్సి ఉంటుంది. ఉదయం 7 నుండి 7.45 మధ్యలో మస్టర్ వేయించుకొని గనిలోకి వెళ్లే సూర్యులు వారు. రక్షణకోసం తలపై టోపీ, కన్నుపొడుచుకున్నా కానరాని చీకటిని చీల్చేందుకు తలపై లైటు, నడుముకు బ్యాటరీ కట్టుకొని, కాళ్ళకు బూట్లు వేసుకొని గనిలోనికి వెళ్లి పనిచేస్తారు. బొగ్గుగని ఉపరితలంలో ఉన్న ప్రశాంతమైన గాలి, వాతావరణం బొగ్గుగనిలోపల ఎక్కడా కనిపించదు. ఐనా సంస్థ కోసం, దేశభవిష్యత్తుకోసం కష్టపడతారు ఈ కష్టజీవులు. గనిలోపలికి వెళ్లేందుకు షాఫ్టు గనిలో ఐతే కేజ్ (లిఫ్ట్) ద్వారా 2 కిలోమీటర్లు, అక్కడినుండి మ్యాన్‌రైడింగ్ ద్వారా 1 కిలోమీటరు దూరం వెళ్లి సర్దార్లు, ఓర్‌మెన్లు సూచించిన పనిప్రదేశానికి ఒక కిలోమీటరు వరకు నడిచి వెళ్లాల్సి ఉంటుంది. పనిస్థలం సుమారు 5 కిలోమీటర్ల దాకా ఉంటుంది. తట్ట, చెమ్మాస్ పట్టి పని ప్రారంభిస్తారు. గుళాయిలో ఇద్దరు కార్మికులను పనిప్రదేశంలో పనికి నిర్దేశించగా ఒకరు చెమ్మాస్‌తో బొగ్గును తట్టలోనింపి, మరో కార్మికుడి తలపైకెత్తాలి. పై రూఫ్ తగలకుండా నెత్తిపై 50 కేజీల బొగ్గు తట్టను ఎత్తుకొని ఆ కార్మికుడు దానిని మోసుకుంటూ సుమారు 100మీటర్ల దూరంలోగల టబ్బుల్లో పోయాల్సి ఉంటుంది. కొన్ని గనుల్లో రూఫ్ (పైకప్పు) కిందికి ఉండడంతో కార్మికుడు నడుంపై తట్ట మోస్తూ అతికష్టంమీద పనిచేయాల్సి ఉంటుంది. ఇలా కార్మికుడు రోజుకు 4 టబ్బులు నింపుతాడు. చెమ్మాస్ కొట్టే కార్మికునికి 2 టబ్బులు, మోసే కార్మికునికి 2 టబ్బులుగా సంస్థ లెక్కిస్తుంది. ఇది కార్మికుని ఒక్కరోజు పనిలో భాగం. ఇలా రకరకాల విభాగాల్లో వారివారి వృత్తులను కార్మికులు నిర్వహిస్తూంటారు. గనిలోపల దిగి మళ్లీ ఇంటికి చేరేవరకు రక్షణ సక్రమంగా పాటిస్తే ఎలాంటి ప్రమాదమూ లేకుండా బయటపడతారు. ప్యానల్‌లో రూఫ్ సైడ్‌వాల్స్ సక్రమంగా ఉంటే ఎలాంటి ప్రమాదమూ ఉండదు. బొగ్గు చెటాయి అయి బొగ్గ పడవచ్చు, సైడ్‌వాల్స్ బంపింగ్ కావచ్చు, రూఫ్ కూలవచ్చు, ఇలాంటి భయంకరమైన ప్రమాదాలతో వీరి జీవితం దినదిన గండంగా సాగుతోంది. కార్మికులకు పనిప్రదేశాల్లో గాలి, నీరు, వెలుతురు సక్రమంగా లేకున్నా టోపికి ఉన్న లైట్‌తో పనిస్థలంలో పనిచేయాల్సి ఉంటుంది. కొన్ని సందర్భాల్లో గర్మి (వేడి) ఎక్కువగా ఉన్నప్రదేశాల్లో పనిచేయడం వల్ల కార్మికుడు అస్వస్థతకు గురయ్యే అవకాశం ఉంది. 19శాతం గాలి ఉండాలి. అంతకంటే తక్కువ 17.5 శాతం ఉంటే అది ప్రమాదానికి దారితీస్తుంది. దీనికోసం గని ఉపరితలం నుండి ఎయిర్‌షాఫ్టు ద్వారా గాలిని గనిలోనికి పంపిస్తారు.

నలభయ్యేళ్ల రమణయ్య సింగరేణిలో సుమారు 25 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. మొదట్లో హెల్పర్‌గా అండర్‌గ్రౌండ్ మైన్స్‌లో పనిచేసి, అనంతరం ప్రమోషన్‌పై మేస్త్రీగా పనిచేస్తున్నాడు. కార్మికులకు పనిభారం ఎక్కువగా ఉండడంతో అనేక వ్యసనాలకు బానిసలవుతున్నారు. గనిలో పనిచేసే కొందరు కార్మికులు పనివత్తిడి వల్ల కలిగే శారీరకశ్రమను మరచిపోయేందుకు మద్యం సేవిస్తున్నామని రమణయ్య అన్నారు. గనుల్లో యాంత్రీకరణ పెరగడంతో కార్మికుల సంఖ్య తగ్గిపోతోందని, తమ పిల్లలకు ఇదే సంస్థలో ఉద్యోగాలు లభిస్తాయనే నమ్మకం లేదని అంటున్నారు. అందుకే ఎంత ఖర్చయినా నాణ్యమైన విద్య కోసం కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల్లో తమ పిల్లలను చదివించుకుంటున్నామని ఆయన అన్నారు.

వీళ్లు బాగున్నారట...

పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలకు, గర్భిణీలకు, బాలింతలకు అనుబంధ పోషకాహారాన్ని అందిస్తూ ఆరోగ్య అవగాహనను కల్పించడంలో ఐసిడిఎస్ పాత్ర ముఖ్యమైనది. దీన్ని గుర్తించిన సుప్రీంకోర్టు ప్రతి నివాస ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. మరి అంతటి ప్రాధాన్యత కలిగిన ఓ అంగన్‌వాడీ వర్కర్ జీవితమెలాగుందో చూద్దాం.

కౌసల్య మహబూబ్‌నగర్ ఎల్లూర్ గ్రామ వాసి. దళిత కుటుంబానికి చెందిన ఈమె అంగన్‌వాడీ వర్కర్. వేతనం నెలకు 1431 రూపాయలు. భర్త నిరుద్యోగి. చదువుకున్నవాడు కావడం వల్ల అటవీ భూమి, ఇతరత్రా సర్వే అధికారులకు సహాయపడుతుంటాడు. నెలకు 600 రూపాయల ఆదాయం వస్తుంది. మొత్తం కుటుంబ సభ్యులు నలుగురు. ఇతర ఆస్తిపాస్తులు లేవు. మట్టి ఇల్లు ఉంది. అది ఓ వైపు కూలిపడడానికి సిద్ధంగా ఉంది. ఇద్దరి ఆదాయం 2030 రూపాయలు. అయితే మొత్తం కుటుంబ సభ్యులకు నెలకు 2345 రూపాయలు ఖర్చు అవుతున్నది. చాలా బొటాబొటీగా కుటుంబం నడుపుతున్నారు. భర్త ఉబ్బసం వ్యాధితో బాధపడుతున్నాడు. ఈమెకు గొంతుకు థైరాయిడ్ ఉందని డాక్టర్లు చెప్పారు. భర్త వైద్యానికి వారానికి 270 రూపాయలు అంటే నెలకు 1100 రూపాయలు మందులకు ఖర్చు అవుతుంది. అంటే ఇద్దరి ఆదాయంలో 55 శాతం వైద్యానికి ఖర్చు పెడుతున్నారు. ఇద్దరు పిల్లలు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. పుస్తకాలు, బట్టలు, మధ్యాహ్న భోజనం వల్ల కొంత ఖర్చు తగ్గింది. వంట సరకులకు నెలకు 765 రూపాయలు అంటే 37శాతం తిండికి ఖర్చు పెడుతున్నది. కుటుంబంలో ఒక్కొక్కరికి తీసుకుంటే సగటున 190 రూపాయలు మాత్రమే నెల రోజుల తిండికి ఖర్చు అవుతుంది. పౌష్టికాహారలోపం తీవ్రంగా ఉంది. ఫలితంగా ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి. ఏ పండుగ వచ్చినా పరమాన్నమే వారి పిండి వంటని, అతి తక్కువ ఖర్చుతో ఆ స్వీటు చేసుకోవచ్చని చెప్పారు. పండుగలు, బంధువులు, బట్టలకు ఖర్చు సంవత్సరానికి 4000 రూపాయలు అంటే నెలకు 350 రూపాయలు కడుతున్నారు. కొన్ని సార్లు బట్టలు, ఇతర ఖర్చులకు హైదరాబాద్‌లో ఉన్న తమ్ముళ్లు సహాయం చేస్తుంటారు. తెల్లరేషన్ కార్డు వల్ల సబ్సిడీపై వచ్చే బియ్యం, సరకులు కొంత ఉపశమనంగా వున్నాయిని చెప్పారు. కానీ ధరల పెరుగుదల వల్ల ఖర్చులో పెద్దమార్పు లేదన్నారు. వాస్తవం ఇలా వుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాము, వారి జీవన ప్రమాణాలు పెరిగాయని కాకిలెక్కలు చెబుతోంది. నమ్మొచ్చా!

వీరందరి పనుల గురించి వారు ఎదుర్కొనే ఇబ్బందుల గురించి చదువుతుంటే ... మనకు తెలీని కష్టనష్టాలు చాలానే వున్నాయనిపిస్తుంది. ఇవన్నీ ఊరకే పోవు. పోరాడితే తప్ప. కాబట్టి మేడే పాలకుల ప్రచారార్భాటానికే కాదు... శ్రామికుల పోరాట దీక్షకు సంకేతం కావాలని పరిస్థితులు తెలియచెప్తున్నాయి.

(**వి. వెంకటేశ్వర్లు**, ఎఐఎడబ్ల్యుయు రాష్ట్రకార్యదర్శి, **బి.ప్రభావతి**, మధ్యాహ్న భోజన వర్కర్ల సంఘం గౌరవాధ్యక్షురాలు, విశాఖ. **డి.వెంకటేశ్వరరావు**, కొత్తగూడెం. **బి.వి.యన్.పద్మరాజు**, **దుర్గం శ్రీనివాస్**, బ్యూరో)

★



బూర శిల్పాలు

హాయ్ పిల్లలూ! బెలూన్లతో వింతవింత మొక్కలు, జంతువుల ఆకారాలను తయారుచేయొచ్చు తెల్సా? అవును ఒక అంకుల్ బూరలతో వివిధ రకాల సముద్రజీవులను చేశారు. ఇంకా గ్రహాంతరవాసులను కూడా తయారుచేశారు. ఆయన పేరు జాసన్ హాకెన్ వర్త్. ఆయన న్యూయార్కు దేశస్థుడు. ముందుగానే బూరల్లోకి గాలిని నింపి ఆ తరువాత కావలసిన ఆకారంలోకి మలుస్తారు. వీటిలో కొన్ని 12 మీటర్ల పొడవున్నాయట. ఆయన ఈ వింతవింత శిల్పాలు రూపొందించడానికి మొక్కలు, జంతువులు స్ఫూర్తినిచ్చాయట. ఆ వింత ఆకారాలకు బీచ్‌లు, అడవులు బ్యాక్‌గ్రౌండుగా పెట్టి ఫొటోషాపులో మరింత అద్భుతంగా చూపిస్తారు హాకెన్. ఇంటర్నేషనల్ ఫెస్టివల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ ఐడియాస్ సందర్భంగా 2006లో హాకెన్ సృష్టించిన అద్భుతాలను ప్రదర్శించారు.

వేలి ముద్రలు - వేల బొమ్మలు

హాయ్...చిన్నారులూ... పరీక్షలు అయిపోయాయా! ఇక నుంచి వేసవి సెలవులు అయ్యేదాకా వారానికో పుస్తకాన్ని పరిచయం చేద్దామనుకుంటున్నాం. ఎంచక్కా ఇది చదివి మీకు నచ్చితే ... అమ్మావాళ్లనడిగి కొనిపించుకోవచ్చు. లేకపోతే మీకు దగ్గర్లోని లైబ్రరీలో వుందేమో అడిగి తీసుకొని చదువుకోవచ్చు. ఇంతకీ ఈవారం మీ ముందుకొచ్చిన పుస్తకం ఏంటనుకుంటున్నారు! 'వేలి ముద్రలు - వేల బొమ్మలు'. తమాషా ఏంటంటే... ఇందులో అన్నీ బొమ్మలే వుంటాయి. అన్నీ వేలిముద్రలతో చేసిన బొమ్మలే. తమాషాగా వుందికదూ. కొంచెం బుర్ర ఉపయోగిస్తే బొటనవేలితో ఎన్ని బొమ్మలు చేయొచ్చో చూపించాడు అరవింద్ గుప్తా అంకుల్. ఇందులో మీకు పిల్లి, సాలీడు, ఏనుగు, గుర్రం, కోడిపిల్ల, జింక, కుందేలు, కోతి, కప్ప, గొంగళిపురుగు, యాపిల్ ...ఒకటేంటి... బోలెడన్ని వున్నాయి. అన్నట్లు ఈ వేలిముద్రల బొమ్మలు ఎలా చేయాలనేది పుస్తకం వెనక పేజీలో ఇచ్చారు. ఇప్పుడు మీకొక అనుమానం వచ్చి వుంటుంది. అసలు ఇలా బొమ్మల పుస్తకాన్ని ఎందుకు తయారుచేశారు అని. గ్రామీణ బాలబాలికల్లో పుస్తకాల పట్ల ఆసక్తిని, పుస్తకాలు చదవటాన్ని ప్రోత్సహించడానికి భారత జన విజ్ఞాన సమితి ఇలాంటి అనేక పుస్తకాలను ప్రచురించింది. వాటిలో ఒకటి మీ ముందున్న వేలి ముద్రలు పుస్తకం. మీకు వీలైతే తీసుకొని అందులో వున్న బొమ్మలన్నీ వేసెయ్యండే. వచ్చేవారం మరో పుస్తకంతో మీ ముందుంటాం. అందాకా బైబై.

వేలి ముద్రలు-వేల బొమ్మలు - అరవింద గుప్తా, ధర: 5/-, పేజీలు: 22

కాపీలు దొరుకుచోటు: హెచ్.బి.టి, హైదరాబాద్.

- చూటీ

తెలుగులో ఏమంటాం?

ఈ మధ్య ఎక్కువమంది చిన్నారులు ఇంగ్లీషు మీడియంలో చదువుకుంటున్నారుకదా. అందుకే మీకో పరీక్ష పెడదామనుకుంటున్నాం. అదేంటంటే... మేం ఇంగ్లీషులో ఓ పదం చెప్తాం. దానికి తెలుగు అర్ధమేంటో మీరు చెప్పాలి. రెడీనా! ఇంతకీ ఆ పదం ఏంటంటే.... రిఫ్రిజిరేటర్ (refrigerator). అసలే వేసవి కాలం కదా. ఎండల్లో మన పనంతా దీనితోనేకదా. మరి చక చకా చెప్పేయండీ!



అవసరం

పేషెంట్: డాక్టర్! నా చెవిలో నాలుగు అర్ధరూపాయి బిళ్లలు ఇరుక్కుపోయాయి. వాటిని తియ్యగలరా? అన్నట్లు ఇది జరిగి నెల రోజులవుతుంది.

డాక్టర్: నెల రోజులైందా! మరి ఇన్ని రోజులు ఎందుకు ఆగావు?

పేషెంట్: వాటితో నాకిప్పటి వరకూ అవసరం రాలేదు.

వీరివీరి గుమ్మడి పండు వీరిపేరేమి?

నేస్తాలూ... ఇదిగో ఇక్కడో పిడుగు వున్నాడు. చూశారా! ఇంతకీ తనెవరో తెల్సిందా? తెల్సుకునే పనిలోనే వున్నారా? ఇలా అయితే ఎలా చెప్పండి. ఇలా చూడగానే అలా చెప్పేట్టుండాలి మా చిన్నారులు. సరే! ఇప్పటికేదో ఓకే చేస్తున్నాం. ఈసారి మాత్రం వెంటనే చెప్పేయాలి. పుస్తకం తిప్పి చూడండి. ఎవరో తెలిసిపోతుంది.

జవాబు: మైకేల్ జాక్సన్

కథ కావాలా!

చిత్రకారుని తెలివి

అనగనగా ఒక సుల్తాన్. ఆయన మహా నిరంకుశుడు. ఆయనకు ఒక కన్ను గుడ్డిది. ఒకసారి ఆయన తన చిత్రాన్ని గీయమని ముగ్గురు చిత్రకారులను పిలిపించాడు.

"మీరు గీసే చిత్రం నాకు సంతృప్తికరంగా లేకుంటే మిమ్మల్ని కఠినంగా శిక్షిస్తా. బాగుంటే మాత్రం అంతులేని ధనకనక వస్తు వాహనాలు బహూకరిస్తా. ఇక మొదలెట్టండి" అని ఆజ్ఞాపించాడు.

మొదటి చిత్రకారుడు సుల్తాన్ ఎలా వున్నాడో అచ్చం అలాగే గుడ్డికన్నుతో సహా చాలా సహజంగా చిత్రించాడు. అయితే ప్రభువైన తనపట్ల అతడేమాత్రం గౌరవం చూపించలేదని సుల్తాన్ అతని శిరచ్ఛేదం గావించాడు.

రెండవ చిత్రకారుడు సుల్తాన్ గారి రెండు కళ్లు బాగున్నట్లు చిత్రించాడు. తనను పొగడటానికి తద్వారా ఏదో ప్రయోజనం పొందటానికి ప్రయత్నించాడని సుల్తాన్ అతనికి వంద కొరడా దెబ్బల శిక్ష విధించాడు.

మూడవ చిత్రకారుడు సుల్తాన్ ముఖం ఒకవైపే కలిపించేలా, మంచి కన్ను వున్న వైపు చిత్రించాడు. అంటే గుడ్డికన్ను పటంలో మనకు కనిపించకుండా రెండవ వైపు వుంటుందన్నమాట.

అది చూసి సుల్తాన్ సంతోషించి, తాను అన్న మాట ప్రకారం అతనికి అనేక బహుమతులిచ్చి సత్కరించాడు.

-మేకల మదన్‌మోహన్‌రావు

పక్షిగూడు

హాయ్ నేస్తాలూ! పక్షిగూళ్లను, అందులోని పక్షి పిల్లలను చూస్తుంటే భలే ముచ్చటేస్తుంది కదూ! వాటిని తెచ్చేసుకుని మన ఇంట్లో పెట్టుకోవాలనిపిస్తుంది. కానీ తెచ్చుకోలేం కదా అని బాధపడుతున్నారా? మనమే ఒక పక్షిగూడును, పక్షిపిల్లలనూ తయారుచేసుకుంటే సరిపోతుంది. అదెలా అనుకుంటున్నారా? ఇదిగో ఇలా...

కావలసిన వస్తువులు

చిన్న బూర, నసిం రంగు ఊలు, పింగ్‌పాంగ్ బాల్స్, గంజి, న్యూస్ పేపరు, గమ్, కత్తెర, గిన్నె, బొమ్మ కళ్లు, నారింజ రంగు గట్టి అట్ట (తెల్లటి మందపాటి పేపరు మీద నారింజ రంగు పెన్సిల్‌తో నింపినా పర్వాలేదు).

తయారు చేసే పద్ధతి

ముందుగా బూర తీసుకోండి. నాలుగు అంగుళాల పొడవున ఉబ్బేవరకు దానిలోకి గాలి ఊదండి. తర్వాత దాన్ని ఒక దారంతో కట్టి ఒక కొయ్యకు వేలాడదీయండి. ఇప్పుడు నసిం రంగు ఊలును నాలుగు అంగుళాల పొడవు ముక్కలుగా కత్తిరించుకోవాలి. ఇహ ఒక చిన్న గిన్నెలో గంజి తీసుకోండి. దానిలో ఊలు ముక్కలను వేయండి. వాటికి బాగా గంజి పట్టిన తరువాత వేలాడదీసిన బూరకు గజిబిజిగా అంటించండి. అలా బూర కనపడకుండా వాటిని అంటించాలి. తరువాత దాన్ని ఒక రోజంతా ఎండనివ్వాలి. ఎండిన తరువాత బూరలోని గాలిని తీసేసి సగానికి కత్తిరించాలి. అవి చూడ్డానికి పక్షిగూళ్లలా కనిపిస్తాయి. తరువాత మూడు పింగ్ పాంగ్ బాల్స్ తీసుకోండి. వాటికి బొమ్మకళ్లను అంటించండి. ఇప్పుడు నారింజ రంగు గట్టి అట్టతో ఆరు బుల్లిబుల్లి త్రిభుజాలను కత్తిరించుకోవాలి. పక్షిపిల్లలు ముక్కు తెరుచుకుని ఉన్నట్టుగా వాటిని పింగ్‌పాంగ్ బాల్స్‌కు అంటించాలి. ఇప్పుడు వాటిని మనం అంతకుముందు తయారుచేసుకున్న పక్షిగూడులో పెట్టుకోవాలి. అప్పుడు ఎంచక్కా మనకు కావలసినంతసేపు వాటిని చూస్తూ ఆనందించొచ్చు. అలాగే మీ ఇంటికి వచ్చిన వారినీ ఆశ్చర్యపరచొచ్చు.

చేసేద్దాం



కథ

చివరి కోరిక

- వై. కుసుమకుమారి

రచయిత రాము సమాజాన్ని ఔపాసన పట్టేశాడు. కథ రాశాడంటే ఆద్యంతం చదివింపచేస్తుంది. సమాజంలో జరిగే చెడును వేలెత్తి చూపుతుంది. మన కళ్లముందు జరుగుతుంది ఇదే అని, రచయిత గొప్పగా రాశాడని చదివే రీడర్ కథనాన్ని రిపీట్ చేస్తాడు. అదే రాము కథల్లో గొప్పతనం. అలా అని నిత్యం అన్ని పత్రికల్లోనూ విపరీతంగా రాసేసిన కథకుడు అంతకంటే కాడు. ఏ ఆరు మాసాలకో ఒక కథ రాస్తాడు. దాన్ని అచ్చువేయంది ఆ పత్రిక నిద్రపోదు. అది రాములో రచయిత కథ.

రాము వయస్సు 75 ఏళ్లు. భార్య, ఇద్దరు పిల్లలు ఏవో రోగాలు, రొష్టులతో చనిపోయి చాలాకాలమైంది. తానే వండుకుని తింటూ చిన్న అద్దెఇంట్లో 30 ఏళ్లుగా ఒంటరి జీవితాన్ని అను భవించాడు. తనకంటూ ఎవరూ లేరు. కడుపు నింపుకోవడానికి ఎదుగూ బొదుగులేని పాన్‌షాపు నడుపుతూ కాలాక్షేపం చేస్తుండేవాడు. రాము కథలకుగానూ పలుపత్రికల కథలపోటీల్లో బహుమతులు వచ్చేవి. అలా అతడు రాష్ట్రమంతా ఫేమస్ అయ్యాడు. ఏవేవో సామాజిక సంస్థలు అప్పుడప్పుడు చేసే సన్మానాలకు రాము అయిష్టంగానే వెళ్లేవాడు. అంతా ఆయన కథలను పదేపదే పొగుడుతుంటే ఆనందించేవాడు. ఇది రాము నేపథ్యం.

రాముకు ఏకైక బాల్యమిత్రుడు నందనరావు కోట్లకు పడగలెత్తాడు. ఎప్పుడు సిటీలోకి వచ్చినా రామును కలుసుకోనిదే తిరిగిపోడు. ఒకప్పుడు నందనరావు కుటుంబ ఆర్థికస్థితి అంతంతమాత్రంగా ఉన్న సమయంలో రాము ఇంట్లో ముప్పూటలూ తిని బడికి వెళ్లేవాడు. వాటిని ఎప్పటికప్పుడు నందనరావే గుర్తుచేస్తుంటాడు. రాము తల్లి దయామయి. ఆకలి అంటే అన్నం పెట్టాలి అనే ఆలోచనాపరురాలు. ఆ బుద్ధులే రాముకు అబ్బాయి. ఎందరికో అనేకరకాలుగా సాయపడేవాడు. నందనరావు రాంగ్‌రూట్‌లో పలు వ్యాపారాలు చేసి కోట్లకు పడగలెత్తాడు. ఇద్దరి మిత్రుల మధ్య తేడా ఇదే. నందనరావు ఎలాగోలా డబ్బును గడించాలని నమ్మేవాడు.

నందనరావు కారు రాము పాన్‌షాప్ ముందాగింది. పాన్‌షాప్ మూతబడి ఉంది. అక్కడ వాకబు చేస్తే వారం రోజులుగా తీయడం లేదని అక్కడివారు చెప్పారు. కారు వెనక్కితిప్పి రాము ఇంటికి పోనిచ్చాడు.

రాముకు ఏమయ్యింది? ఆరోగ్యంపట్ల శ్రద్ధ చాలా తక్కువ. మంచం పట్టిపోయాడా? అని ఆలోచిస్తూ సాగాడు. కారు ఆపాడు. పాత పెంకుటిల్లు తలుపులు తెరుచుకునే ఉన్నాయి.

నందనరావు గాబరాగా లోపలికి వెళ్లాడు. సంచి డాక్టర్ ఒకరు రాము నాడి చూస్తున్నాడు.

"ఏయ్ ఏమయ్యిందయ్యా!" ఆత్రంగా అడిగాడు.

"సార్, వారం రోజులుగా జ్వరం తగ్గట్లేదు. మరో ఇంజెక్షన్ ఇస్తాను" అని సిరంజి లోడ్ చేస్తుండగా అడ్డంపడి "నువ్వు తగ్గవయ్యా ఇది ఇక్కడ తగ్గదు. ముందు రామును నా కారు బాక్‌సీటులో పడుకో బెట్టు. పెద్ద ఆసుపత్రికి తీసుపోదాం" అని వంద రూపాయల నోటు అందించాడు నందనరావు.

రాము కళ్లు తెరవలేకపోతున్నాడు. నందనరావును చూసి కళ్లు మూసుకున్నాడు. కారు బ్యాక్‌సీటులో పడుకోబెట్టాడు సంచిడాక్టర్. కారు పెద్ద కార్పొరేట్ ఆసుపత్రి పోర్టికోలో ఆగింది. వెంటనే స్ట్రెచ్చర్ మీద సిబ్బంది లోపలకు తీసుకుపోయారు. నందనరావు ఆసుపత్రి రిసెప్షన్‌లో విషయం చెప్పాడు. చకచకా డాక్టర్లు వచ్చి వాలారు. పలు టెస్టులు జరిపారు. రెండు గంటల్లో మొత్తం రిజల్టు వచ్చాయి.

"నందనరావ్‌జీ! మీ పేషెంటుకు క్యాన్సర్ స్టేజి దాటింది. జ్వరం వచ్చి తగ్గట్లేదు. రెండురోజుల్లో జ్వరం తగ్గిపోతుంది. ఇక క్యాన్సర్ ట్రీట్‌మెంటుకు 5లక్షలు ఖర్చు అవుతుంది. అదీ ఇక్కడ కాదు. ముంబాయ్ పంపాలి. మా నుంచి వెడితే ఐదు లక్షలతో సరి"

"వ్వాట్? వాడికి రావాల్సిన జబ్బు కాదే. సరే నేను ఆ డబ్బు ఎరేంజ్ చేస్తాను. ముందు ఇక్కడ ట్రీట్‌మెంటు స్టార్టు చేయండి. ముందు జ్వరం తగ్గిపోవాలి. ఆ తరువాత ఆపరేషన్ ఏర్పాట్లు చేయిద్దాం"

రెండురోజుల్లో రాము బెడ్‌మీద కూర్చుని బ్రెడ్ తింటుండగా నందనరావు వచ్చాడు.

"ఏరా రామూ! నేను రాకుంటే ఏమయ్యేవాడివి. నాకు ఫోన్ కొట్టాల్సింది. ఎంత ప్రమాదం తప్పిపోయింది. ఆ సంచిడాక్టర్ నిన్ను చంపేసేవాడే" అని నవ్వుతూ ఎదురుగా కూర్చున్నాడు.

"వాడినేమీ అనకురా! వాడే నాకు ఇన్నాళ్లూ ఇంతూపిరి పోశాడు. ఈసారి నా విషయంలో వాడి వైద్యం పని చేయలేదు. మంచానికి అంటుకుపోయాను. పిలవకుండా వచ్చావు. నన్ను కూర్చోబెట్టావు"

డాక్టర్ వచ్చి "రామూ మీకు జ్వరం తగ్గిపోయింది. ఇక మీరు రెస్టు తీసుకుని ముంబాయ్ పోవడానికి సిద్ధంగా ఉండండి" చెప్పి మరోసారి నాడి చూసి వెళ్లిపోయాడు.

ముంబాయ్ అనేమాటకు రాము మౌనం వహించాడు.

"రేయ్ రామూ! ముంబాయ్ వెడితే అక్కడ నీకు తోడుగా మా నుంచి ఒకడిని పంపుతాను. నిన్ను కంటికిరెప్పలా కాపాడుకుని ఆపరేషన్ సక్సెస్ చేసుకుని తీసుకువస్తాడు" అని భుజం తట్టాడు.

మౌనంగా ఆలోచనలో పడ్డాడు రాము.

"ఆపరేషన్ అంటే భయంగా ఉందా?"

"నీ స్నేహాన్ని తలచుకుంటే సిగ్గేస్తోంది. మరోవిధంగా భయపడుతున్నాను" నందనరావు నవ్వేశాడు. "నీకు ఎప్పుడు ఏది చేస్తానన్నా వద్దనేసే వాడివి.

ఆ పాన్‌షాపు వద్దురా నా దగ్గరకు వచ్చేయ్. నాకున్న వ్యాపారాల్లో ఏదో ఒకటి చూసుకోమని ఎన్నోసార్లు చెప్పాను. విన్నావు కావు. నీ కథల్లోలా నీవు సామాజికవాదివేరా!"

ఆ మరుసటి రోజు హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యాడు.

ఇంటికి ఆటోలో వచ్చేశాడు రాము.

తన నులకమంచం మీద కూర్చున్నాడు. తనకు తెలిసినవారు కొద్దిమంది ఎలా ఉంది? ఇప్పుడు తేలిగ్గా ఉందా? అంటూ పరామర్శలు చేశారు. వారికి ఓపిగ్గా బదులిచ్చాడు.

నందనరావు తెచ్చి ఇచ్చిన పండ్లు, రొట్టెలు సంచిలోంచి తీసి తనకెదురుగా పెట్టుకున్నాడు. పోస్టులో వచ్చిన రెండు కవర్లు తలుపు పక్కన పడుంటే లేని ఓపిక తెచ్చుకుని తీసుకుని వాటిని తెరిచాడు. రెండూ పత్రికల నుంచి వచ్చినవే.

ఒక కవర్‌లో కథకు రెమ్యునరేషన్ పంపుతూ ఒక చెక్ ఉంది. ఆ చెక్‌ను చూసి శూన్యంలోకి చూశాడు. తన కథలకు 15రూపాయల నుంచి నేటికి 750 రూపాయలకు పెరిగాడు. అన్నీ కలిపి వందకుపైగా అచ్చయ్యాయి. ఏ ఒక్కటీ సినిమాగా రాలేదు. వస్తే ఎంతోకొంత పెద్ద మొత్తం ముట్టేది. తను సొంతింటికి యజమాని అయ్యేవాడినని ఆలోచించాడు.

రెండో కవర్‌లో దీపావళి స్పెషల్‌సంచికకు ఒక కథ పంపండని పెద్ద పత్రికవాళ్లు రాశారు. దాన్ని చదివాక ఒకింతగర్వంగా ఒకటికి పదిసార్లు చదువుకున్నాడు. మూడురోజుల్లో కథ రాయాలి. లేకుంటే మరి కథ రాసేపని ఉండదు. ముంబాయ్ వెళ్లడానికి మూడు రోజులుంది. అక్కడ ఆపరేషన్‌తో చావో బతుకో తేలనుంది.

రాము పరిపరివిధాలుగా ఆలోచించి మెల్లగా లేచి ఉన్నవాటిలో మంచి బట్టలు వేసుకుని నందనరావు ఇంటికి బయల్దేరాడు.

నందనరావు భార్యాపిల్లలు చూసి లోపలకు తీసుకుని వెళ్లారు. ఆప్యాయంగా పలకరించారు. గ్లూకోజ్ వాటర్ ఇచ్చారు. అప్పుడే వచ్చిన నందనరావు రాము పక్కనే కూర్చున్నాడు. "ఏమిత్రా నువ్వే వచ్చావు రెస్టు తీసుకోలేకపోయావా? ఇక్కడ ఉండిపోరాదు. అదిగో గెస్టుహౌస్‌లో ఏసి ఉంది. చల్లగా ఉంటుంది. నిద్రపట్టేస్తుంది. నీవు ఆ పాతింటికే పోతానంటావు. నిన్ను అడగడం శుద్ధ దండుగ"

"నీతో పనిపడి వచ్చాను"

"ఏమిటది?"

"నా ఆపరేషన్‌తో గ్యారెంటీగా నేను బతుకుతానో లేదో తెలియదు. గాలిలో దీపం లాంటిది నా రోగం"

"అలా పేషెంటు డీలాపడితే ఎలా?"

"అంతఖర్చు పెట్టడం..."

"నాకు ఆ ఐదులక్షలు చిన్న మొత్తమే. నా ఆస్తులు అమ్మేసి నీకు పెట్టడం లేదు. నా ఫ్రెండువి. అనారోగ్యాన్ని తరిమేద్దామని వెచ్చిస్తున్నా. ఇప్పుడే ఆసుపత్రిలో చెల్లించాలి. వారు పని ప్రారంభిస్తారు. ముంబాయ్ వెళ్లగానే నేరుగా చికిత్స ఆరంభమవుతుంది"

"ఆ విషయమే నీతో మాట్లాడాలి"

నందనరావు దంపతులు అయోమయంగా చూశారు.

"నా ఆపరేషన్‌కు ఖర్చు చేస్తానన్న ఐదులక్షలు నా చేతికివ్వు"

"ఎందుకు? నేను చెల్లిస్తాను. నీవెందుకు ఆసుపత్రికి వెళ్లడం"

"ఆ డబ్బు నాకవసరం ఉంది. ఆపరేషన్ బల్ల ఎక్కాలని లేదు"

"రేయ్ రాము ఎన్నిసార్లో అడిగాను, డబ్బు అవసరం అయితే అడుగురా అని. ఎప్పుడూ పైసా పుచ్చుకున్నావు కాదు. ఇప్పుడు ఏకంగా ఐదులక్షలు అడుగుతున్నావు. ఎందుకు? ఏమి చేస్తావురా?"

"నా ఖర్చులు నీకు చెప్పాల్సినవి కావు. నీవన్నావే ఎన్నడూ అడగలేదని ఇప్పుడు అడుగుతున్నాను. నా రోగం కోసం నా ఫ్రెండుగా ఖర్చు చేస్తున్న డబ్బునే అడుగుతున్నాను"

నందనరావు దంపతులు ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. రామును చాలా దగ్గరనుంచి చూసిన దంపతులు వారే. ఏనాడూ ఈ అవసరం ఉంది. నాకు ఇంత కావాలి అని రాము అడగలేదు. అందుకే ఆ దంపతులు ఎప్పటికప్పుడు దుస్తులు, వస్తువులు ఇచ్చేవారు. తమతోపాటు తీర్థయాత్రలకు తీసుకుపోయేవారు. అతడిలో మంచి స్నేహితుడున్నాడు. ఈర్ష్య ద్వేషాలు లేనివాడు.

నందనరావు వెంటనే ఐదులక్షలు చిన్న బ్యాగ్‌లో వేసి తెచ్చి ఇచ్చాడు. "మళ్లీ కలుస్తాను" అని చెప్పి రాము అక్కణ్నించి వెళ్లిపోయాడు.

ఆ దంపతులు మరింతగా అవాక్కయ్యారు.

◆◆◆

నాలుగు రోజుల తర్వాత నందనరావు ఇంటిముందు ఆటో దిగాడు రాము. చురుగ్గానే ఉన్నాడు.

నందనరావు ఆశ్చర్యంగా చూశాడు. "రేయ్ ఆపరేషన్ ఏమి చేశావురా! వద్దనేసుకున్నావా?" అని అడిగాడు.

"శుభమా అని వస్తే ఆపరేషన్ గురించి ఎందుకు మాట్లాడుతావు. రేపు మీ దంపతులు మీ పిల్లలిద్దరూ, అల్లుడు, కోడలు, మనవలు ఎవరూ మిస్ కాకుండా మధ్యాహ్నం నా ఇంటికి విందుకు రావాలి. రేపు నా పెళ్లి రోజు. పాతింట్లోలేను. కొత్త ఇంటికి మారాను. చిరునామా ఇదే" చెప్పి వెనుదిరిగాడు రాము.

నందనరావు రాముని వరండాలో ఆపి "రేయ్ ఏమి చేస్తున్నావు. దాచకుండా చెప్పురా, నీ ఇంట్లో విందుకు నన్ను అన్ని ఏర్పాట్లూ చేయమంటావా? నీవెలా చేస్తావు?"

"నువ్వు లొట్టలు వేసుకుని తినేవిందురా అది. నువ్వు రా!" చెప్పి ఆటో ఎక్కేశాడు.

మరుసటిరోజు రెండుకార్లలో నందనరావు కుటుంబం రాము కొత్తింటి ముందు దిగింది. కొత్త ఇల్లు చూశాక రాము దీన్ని కొనలేదని అనుకున్నాడు నందనరావు. రాము వారిని సాదరంగా లోపలికి ఆహ్వానించి విందు ఇచ్చాడు.

నందనరావు ఎలాంటి ప్రశ్నల జోలికీ పోకుండా పెట్టింది తిన్నాడు. వడ్డించేవారు హోటల్‌నుంచి వచ్చిన అమ్మాయిలే. ఒక గదిలో అన్నీ కొత్త వస్తువులు కన్పించాయి. "రేయ్ నందన్! ఇవి నేనెంతో ముచ్చటపడి కొనుక్కున్న వస్తువులు. ఆ బీరువా, ఆ టీపాయ్, కుర్చీలు, ఫోమ్‌బెడ్. ఇక నీకు, నీ కుటుంబ సభ్యులకు నేను ఇచ్చే తొలిసారి దుస్తులు" అని కొత్తబట్టలు అందరికీ అందించాడు. నందనరావు భార్యతో "అమ్మా! నందన్ నీవు రాకముందు సామాన్యుడు. నీ రాకతో వాడు కోట్లకు పడగలెత్తాడు. నీవు ఉపయోగించని వస్తువులు లేవు. కట్టని చీరలు లేవు. కానీ, ఈ దీనుడు తొలిసారిగా మీకు ఇస్తున్న ఆభరణాలు స్వీకరించండమ్మా" అని నెక్లెస్ అందించాడు. అలాగే మరి కొన్ని ఆభరణాలు ఆమె కూతురుకు, కోడలుకు అందించాడు.

నందనరావు దంపతులు చేష్టలుడిగి చూశారు. ఎలాంటి ప్రశ్నలూ వేయలేదు. రాముయే చెప్పాడు.

"అమ్మా ఇలా ఇంటికి పిలిచి మీ దంపతులకు విందు ఇవ్వాలని నేను, నా భార్య ఎన్నోసార్లు అనుకునేవాళ్లం. కానీ, విందు ఇచ్చేందుకు నా ఇంట్లో డైనింగ్ టేబిల్ లేదు. చేతినిండా డబ్బు లేదు. అన్నీ కుదిరితే మీరు విదేశాలలో ఉండేవారు. ఆ తరువాత నా భార్య చనిపోయింది. నా కోరిక తీరకుండా నాలో నిక్షిప్తమైపోయింది. ఇప్పుడు కొత్తగా ప్రాణం హరించే రోగం నాలో ప్రవేశించింది. దాన్ని నందనరావు తరిమేద్దామని నాకు ఆపరేషన్ చేయించాలని సిద్ధపడ్డాడు. దాని ఖర్చు ఐదులక్షలు. ఆ డబ్బుతో నేను మరికొన్నాళ్లు బతకగలను కానీ, నాలో సమాధి అయిన విందు కోరిక తీరదు. ఆ ఐదులక్షలతో నా రోగాన్ని నాలో పెట్టుకుని నా కోరికను తరిమేద్దామని ఈ నిర్ణయానికి వచ్చాను" చెప్పి సంతృప్తిగా నవ్వాడు. నందనరావు దంపతులు నిశ్చేష్టులయ్యారు. మిగిలిన కుటుంబసభ్యులు ఆశ్చర్యపోయారు.

"ఓరేరా! నీకు ఆపరేషన్ చేయిస్తానురా"

"నందన్! నాకీ ఆనందం చాలురా. మరి బతకాలని లేదు. చిరకాల వాంఛను తీర్చుకున్నాను. ఇంతకంటే సంతృప్తి నాకు లభించదు"

ఆ మరుసటిరోజు రాము నేలతల్లిని విడిచి తిరిగిరాని లోకాలకు తరలిపోయాడు. ★

చూద్దామా

పారిస్ అనగానే అందరికీ గుర్తుకు వచ్చేది ఈఫిల్ టవర్. ప్రపంచ పర్యాటకులను ఎంతగానో ఆకర్షించే ప్రదేశాల్లో ఇది ఒకటి. ఇది ఫ్రాన్సు రాజధాని పారిస్‌లోని ఒక ఇనుప కట్టడం. యూరప్ దేశాలన్నిటిలో దీన్ని మించిన కట్టడం మరోటి లేదంటే ఆశ్చర్యపోనవసరం లేదు. లండన్‌లోని వెస్ట్‌మినిస్టర్ బ్యాంక్ ఎత్తు 183 మీటర్లు. అలాగే పారిస్‌లోని మౌంట్ వర్నాన్ టవర్ 210 మీటర్ల ఎత్తుంటుంది. వీటితో పోలిస్తే ఈఫిల్ టవరే ఎత్తైనది. అది 300 మీటర్ల ఎత్తులో ఎంతో ఉన్నతంగా కనిపిస్తుంది. అంతేకాదు! చరిత్రకు మూగసాక్షిగా కూడా వుంది. అలాంటి ఎన్నో విశేషాల సమాహారం మీకోసం...

ఈఫిల్ టవర్ చరిత్రకు మూగసాక్షి

19వ శతాబ్దంలో ప్రదర్శనలు జోరుగా జరిగేవి. 1851లో బ్రిటన్ గ్రేట్ ఎగ్జిబిషన్ నిర్వహించింది. లండన్ హైడ్ పార్క్‌లో నిర్మించిన క్రిస్టల్ ప్యాలెస్‌ను సందర్శించేందుకు అరవైలక్షల మంది ఆ ఎగ్జిబిషన్‌కు వచ్చారని అప్పటి అంచనా. 1873లో వియన్నాలో ఆస్ట్రో హంగేరియన్ ప్రదర్శన జరిగితే దానికి 70 లక్షల మంది హాజరయ్యారు. 1876లో జరిగిన అమెరికన్ ఫిలడల్ఫియా ఎగ్జిబిషన్‌కు కోటి మంది తరలి వెళ్లారు. 1878లో జరిగిన పారిస్ ఎగ్జిబిషన్‌కు కోటి అరవై లక్షల మంది హాజరయ్యారు. వీటన్నిటి దారీ ఒక ఎత్తు. పారిస్‌లో 1889లో జరిగిన ప్రదర్శన మరో ఎత్తు. 1889 నాటికి ఫ్రాన్స్ విప్లవానికి వందేళ్లు నిండుతాయి కాబట్టి ఆ ప్రదర్శన వీటన్నిటినీ మించి ఉండాలనే ఉద్దేశ్యంతో ఒక నిర్మాణాన్ని చేపట్టాలని అనుకున్నారు. అనుకున్నట్టుగానే 1889 నాటికి నిర్మాణం పూర్తయింది. ఆ నిర్మాణమే ఈఫిల్ టవర్.

నిర్మాణ చరిత్ర

1832లోనే 1000 అడుగుల ఎత్తులో ఒక గోపురాన్ని నిర్మించాలనే యోచనను చేశారు కోర్నిష్ ఇంజనీర్ రిచర్డ్ ట్రెవిథిక్. అయితే ఈ ఆలోచనను కార్యరూపం చేయాలని కొందరు ప్రకటించినా అమెరికా స్వాతంత్ర్య వార్షికోత్సవాలు అటువంటి ప్రయత్నాలేమీ చేయలేదు. దీంతో 1889లో జరగనున్న ప్రదర్శన సమయానికి దాన్ని నిర్మించాలని ఆ ప్రదర్శన నిర్వాహకులు భావించారు. అయితే వెయ్యి అడుగులను మెట్రిక్ కొలమానంలోకి మార్చి 304.8 మీటర్లకు బదులు 300 మీటర్ల ఎత్తు వరకే నిర్మిద్దామని అనుకున్నారు. దీని కోసం ఎందరెందరి నమూనాలనో పరిశీలించారు. చివరకు ఈఫిల్ గుస్తావ్‌కు ఈ నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. తర్వాత ఈ టవర్‌ను దేనితో నిర్మిస్తే బాగుంటుందనే చర్చ తలెత్తింది. రాతితో అయితే అంత బరువుకు కుంగిపోతుందనుకున్నారు. ఉక్కుతో అయితే మరీ తేలికవుతుందని భావించారు. చర్చ ఇలా సాగుతున్న సమయంలో ఈఫిల్ సహాయకులుగా ఉన్న ఇంజనీర్లు మారిస్ కోష్లిన్, ఎమిలీ సాగ్వేర్‌లు ఇనుముతో ఈఫిల్ నిర్మించడం మేలని చెప్పడంతో దాన్ని అంగీకరించారు.

'ఈఫిల్' ఇంజనీర్

ఈఫిల్‌కు ఇనుముతో నిర్మాణాలు చేసిన అనుభవం ఎంతో ఉంది. ఆయన 1832లో జన్మించారు. ఈయన మొదట్లో రైల్వే ఇంజనీర్‌గా పనిచేశాడు. తర్వాత ఇంజనీర్‌గా ప్రయివేటు ప్రాక్టీస్ పెట్టుకున్నాడు. 1867లో పారిస్‌లో జరిగిన ఎగ్జిబిషన్‌లో మెషినరీహాల్‌కు పైకప్పును ఆయనే ఇనుముతో రూపొందించారు. పోర్చుగల్‌లోని డౌరో నదిమీద కాస్ట్ ఐరన్ బ్రిడ్జి నిర్మాణాన్ని 1877లో ఆయనే నిర్మించారు. నైస్‌లో 110 టన్నుల బరువుండే డోమ్‌ను ఆయనే నిర్మించారు. దాన్ని వేధశాలకు తలమానికం చేశారు. అది అంత బరువున్నా సరే ఒక్కచేత్తో తిప్పగలిగే విధంగా ఒక రింగ్ మీద ఏర్పాటు చేయడం ఆయన ప్రతిభకు అద్దం పడుతుంది. 'స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ'కి కాస్ట్ ఐరన్‌తో ప్రాథమిక రూపకల్పన చేసింది కూడా ఈయనే. ఇన్ని అనుభవాలతో ఆయన ఈఫిల్ టవర్ నిర్మాణాన్ని ప్రారంభించాడు. ఆయనతో పాటూ 50 మంది ఇంజనీర్లు 18 నెలలపాటు అహోరాత్రులూ శ్రమించి 5,300 డ్రాయింగులతో ప్రతి భాగానికీ రూపకల్పన చేశారు. ఇది గొప్ప, అపురూపమైన నిర్మాణం కావడతంతో దీని నిర్మాణానికి కావలసినవన్నీ ప్రత్యేకంగా వారే రూపొందించుకోవలసి వచ్చింది.

ఇంత ఎత్తుండే ఈ నిర్మాణానికి ఉధృతంగా వీచే గాలుల వల్ల ప్రమాదం వాటిల్లే అవకాశముందని ఆయన ముందే గమనించారు. అందుకే గంటకు 250 కిలోమీటర్ల వేగంతో సైతం గాలులు వీచినా 10 సెంటీమీటర్లకు మించి ఊగకుండా ఉండేట్లు దాని నమూనాను రూపొందించారు. ఇన్ని ఏర్పాట్లు చేసుకునేసరికి నిర్మాణానికి కేవలం రెండు సంవత్సరాల వ్యవధి మాత్రమే మిగిలింది. దీంతో నిర్మాణ వేగం పెంచేందుకు కొత్త పద్ధతులను చేపట్టారు. మామూలుగా పెద్ద పెద్ద నిర్మాణాలు చేసేప్పుడు వాటికి కావలసిన భాగాలను నిర్మాణ స్థలంలోనే తయారుచేస్తారు. అందుకు తగిన విధంగా రంధ్రాలు చేసి వాటిని జతచేస్తే సరిపోతుంది.

అప్పట్లోనే 65లక్షల ఫ్రాంకులు!

ఈ టవర్ నిర్మాణానికి ఆ రోజుల్లోనే 65లక్షల



ఫ్రాంకులు అవసరమవుతాయని వారి అంచనా. అయితే అందులో 15 లక్షల ఫ్రాంకులు, దాని నిర్మాణానికి కావలసిన భూమిని ప్రభుత్వం ఇస్తానని అంగీకరించింది. ఇంకా 50 లక్షల ఫ్రాంకులు ఈఫిల్ సమకూర్చుకోవలసి వచ్చింది. అయితే నిర్మాణం పూర్తయిన తరువాత 20 సంవత్సరాల వరకు దాని సందర్శకుల నుంచి వసూలు చేసిన మొత్తాన్నీ తీసుకునే అధికారం ఈఫిల్‌కు ఇచ్చింది ప్రభుత్వం.

ఎన్నో అడ్డంకులు...

దీని నిర్మాణాన్ని ఈఫిల్ 1887 జనవరిలో ప్రారంభించారు. ఇంత భారీ నిర్మాణం తలపెట్టినందుకు అలెగ్జాండర్ థ్యూమస్, గైడీపాసా వంటి మేధావులతోపాటు మరెందరో దీని పట్ల నిరసన వ్యక్తంచేశారు. అగ్రరాజ్యమైన అమెరికానే దీని నిర్మాణ ఆలోచనను మానేస్తే ఫ్రాన్స్ ఎందుకు దీన్ని చేపట్టినట్లు అని అన్నారు. అంతేకాదు టవర్ నిర్మాణం చేస్తున్న స్థలం చుట్టుపక్కల నివాసులు సైతం దాని వల్ల ఎటువంటి ప్రమాదమైనా వాటిల్లితే అందుకు ఈఫిల్ బాధ్యత వహించాలని కోర్టుకు వెళ్లారు. దానికి కూడా ఆయన ఒప్పుకోవడంతో దాని నిర్మాణ కార్యక్రమం ముందుకు సాగింది.

చివరకు 1887 జూన్ 30వ తేదీనాటికి దీని నిర్మాణం కార్యరూపం దాల్చింది. డిసెంబర్ నాటికి దీని మొదటి అంతస్తు వరకు నిర్మాణం పూర్తయింది. తర్వాత దాని ప్లాట్‌ఫారం నిర్మాణం పూర్తయింది. మొదటి అంతస్తును మోస్తున్న పద్ధతిలో ఉన్న ఆర్చెస్ నిర్మాణం మరో రెండునెలల్లో పూర్తయింది. అవి బరువును మోస్తున్న తీరులో ఉన్నా నిజానికి వాటికి ఇంజనీరింగ్ పరంగా ఏ ప్రాముఖ్యతా లేదు. మొదటి అంతస్తు పూర్తి కాగానే అక్కడే ఈఫిల్ ఒక క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు. దీనివల్ల కార్మికులు టీ, టిఫిన్ల కోసం పైకి కిందకు వెళ్లడం వల్ల అలిసిపోతారనే ఉద్దేశ్యంతో ఆయన ఈ ఏర్పాటు చేశారు. 1888 ఆగస్టు 14 నాటికి టవర్ రెండో దశకు చేరింది. అప్పటికి టవర్ ఎత్తు 100 మీటర్లు. సెప్టెంబరులో కార్మికుల సమ్మె జరగడంతో కొంత పని దెబ్బ తిన్నది. అప్పట్లో కార్మికులకు గంటకు 75 సెంటైమ్స్ ఇచ్చేవారు. రోజులు గడిచేకొద్దీ తమకు పనిభారం పెరిగి తక్కువ జీతం వస్తుందని భావించి గంటకు మరో 20 సెంటైమ్‌లు పెంచాలని వారు సమ్మె చేశారు. అయితే 8 రోజుల తర్వాత ఓ 5 సెంటైమ్‌లు పెంచేలా ఒప్పందం కుదిరింది. అయినా కొందరు ఊరుకోలేదు. కానీ సరైన మద్దతు దొరక్కపోవడంతో సమ్మె విఫలమైంది.

రెండో అంతస్తు పూర్తయ్యాక నాలుగు క్రేన్‌లు ఉపయోగించడం కష్టమైంది. దాంతో రెండు క్రేన్‌లతోనే పని చేయాల్సి వచ్చింది. అందువల్ల పని వేగం తగ్గింది. 1888 నవంబర్ 30 నాటికి దాని ఎత్తు 186 అడుగులకు చేరింది. చివరకు 1889 మే నాటికి దీని ఎత్తు 302 మీటర్లకు చేరింది. ఉష్ణోగ్రత మరీ ఎక్కువగా ఉన్న రోజుల్లో దీని ఎత్తు 18 సెంటీమీటర్లు పెరుగుతుంది. ఇంత భారీ నిర్మాణ సమయంలో కేవలం ఒక్కరే దుర్మరణం పాలవడం విశేషం.

అయితే టవర్ పైకి ఎక్కడానికి హైడ్రాలిక్ లిఫ్ట్‌ల ఏర్పాటు పెద్ద సమస్యగా మారింది. అమెరికాకు చెందిన 'ఓటిక్' సంస్థ లిఫ్టులు పెట్టాలని అనుకున్నా ఫ్రాన్సు టెక్నాలజీతో చేసిన లిఫ్టులే మంచివని అందరూ అన్నారు. దాంతో మొదటి అంతస్తు వరకు ఈ లిఫ్టులు పెట్టినా అక్కడి నుంచి పైవరకు ఓటిక్ సంస్థ లిఫ్టులే పెట్టారు.

20వేల గ్యాస్ లైట్లతో...

ఈఫిల్ టవర్ ప్రారంభోత్సవానికి నాటి గొప్పవారెందరో వచ్చారు. ఈజిప్ట్ ఖదీవ్ కుమారుడైన అక్బర్, సియామ్ రాజు, సెర్బియా యువరాణి అలెగ్జాండ్రియా, పెర్షియాషా, లండన్ మేయర్ వంటి వారంతా వచ్చి, ఈఫిల్ టవర్‌ను చూసి ఆశ్చర్యపోయారు. రాత్రిపూట 20 వేల గ్యాస్‌లైట్లను అమర్చి టవర్‌ను ప్రకాశవంతంగా అలంకరించారు. మొదటి అంతస్తులో రెండు బార్‌లను, ఒక రెస్టారెంటును ఏర్పాటు చేశారు. మొత్తమ్మీద ఇది ప్రత్యేకాకర్షణగా తయారైంది. దీంతో టవర్‌ను నిర్మించిన ఐదున్నర నెలల్లోనే 19 లక్షల మంది దీన్ని సందర్శించారు. మొదటి అంతస్తు వరకు ఎక్కితే రెండు ఫ్రాంకులు, పైవరకూ ఎక్కితే నాలుగు ఫ్రాంకులు చెల్లించేవిధంగా నియమం పెట్టారు. 1889 చివరి నాటికి రుసుం వల్లే పూర్తి నిర్మాణంలో దాదాపు 75 శాతం వ్యయం వసూలు అయింది. ఒక దైవ కార్యంగా చేపట్టిన ఈఫిల్ టవర్ నిర్మాణాన్ని ఈఫిల్ 'గాడ్స్ ఇంజనీర్'గా పూర్తి చేశారని థామస్ అల్వా ఎడిసన్ ఆయనను ప్రశంసించారు. ఇంత పెద్ద టవర్‌ను కేవలం సందర్శన కోసమే ఉపయోగించడం అర్థం లేని పని అని భావించి దాని పైన ఒక వేధశాలను ఏర్పాటు చేశారు. టవర్ పైనుంచి ఎవరైనా 80 కిలోమీటర్ల వరకు మామూలు కంటితో చూడొచ్చు. టెలిస్కోపునుపయోగిస్తే మరికొంత దూరం వరకు చూసే వీలు కలుగుతుంది. అయితే టవర్ శిఖరం నుంచి ఎంత దూరం వరకు చూడగలరనే విషయం మొదటి ప్రపంచయుద్ధం వరకూ కచ్చితంగా తెలియలేదు. 1905లో టవర్‌మీద రేడియో ఏరియల్‌ను పెట్టారు. దీనివల్ల 1907లో కాసాబ్యాకాక్ అవతల ఉన్న ఫ్రెంచి సాహసవంతుడు క్లైబర్‌కు రేడియో సందేశాలను పంపే వీలు కలిగింది. 1913లో ఈఫిల్‌టవర్‌పై ఈఫిల్‌కు ఇచ్చిన రాయితీ పూర్తవడంతో దాన్ని కూలగొట్టాలని కొందరు అన్నా అదృష్టవశాత్తూ మొదటి ప్రపంచయుద్ధం రావడంతో ఆ ఆలోచన మూలనపడింది.

ప్రయోగాలకు వేదికగా...

భూమికి చాలా ఎత్తులో ఉన్న కారణంగా అనేక భౌతిక శాస్త్ర ప్రయోగాలకు ఈ టవర్ వేదికగా నిలిచింది. అంత ఎత్తున్న టవర్ పైనుంచి ఏ వస్తువును కిందకు పడేసినా అది కేవలం ఐదే సెకన్లలో భూమిని తాకుతుంది. గాలి ప్రభావం కింద పడేసే వస్తువు ఉపరితలవర్గానికి సరైన నిష్పత్తిలోనే ఉంటుందని ఈ ప్రయోగాల వల్ల తేలింది. ఈ ప్రయోగాల స్ఫూర్తితో ఈఫిల్ 1906లో టవర్ కిందభాగంలో 'విండ్ టన్నెల్'ను ఏర్పాటు చేశారు. ఈ టవర్ వల్ల దేశ రక్షణ, ఖగోళశాస్త్రం, వాతావరణ శాస్త్రం, ఏరోడైనమిక్స్ వంటి రంగాల్లో అనేక ప్రయోజనాలుంటాయని ఈఫిల్ భావించారు. ఈ టవర్ పైనుంచి 1923లో రేడియో, 1935లో టెలివిజన్ ప్రసారాలు ఆరంభమయ్యాయి. 1956లో మరో టెలివిజన్ మాస్ట్ ఏర్పరచడంతో టవర్ ఎత్తు మరో 20 మీటర్లు పెరిగింది.

1911 డిసెంబరులో ట్రికెల్ట్ అనే ఒక టైలరు తను రెక్కల సహాయంతో ఎగురుతానని చెప్పి ఈ టవర్ పైనుంచి కిందకు దూకే ప్రయత్నం చేశాడు. ఇక అక్కడ ఆత్మహత్యలు లెక్కకుమించి జరిగాయి. 1987లో కనీసం 360 ఆత్మహత్యలు జరిగాయని అంచనా. దీన్ని నిర్మించిన ఈఫిల్ 1923 డిసెంబర్ 27న తన 91వ సంవత్సరంలో మరణించారు. ఆయన లేకపోయినా పారిస్‌కు తలమానికంగానున్న ఈఫిల్ టవర్ నేటికీ ఈఫిల్‌ను తారాపథంలో ఉంచింది.



'మంచి ముత్యం' ఒక 'ఆణిముత్యం'

మంచిముత్యం, రచన : జాన్ ఎర్నెస్ట్ స్టెయిన్ బెక్
అనువాదం : డా॥ దేవరాజుమహారాజు
పేజీలు : 88, వెల : 60/-,
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్,ప్రజాశక్తి బుక్‌హౌస్,
నవోదయ బుక్‌హౌస్, సహచర బుక్‌మార్ట్.



దేవరాజు మహారాజుగారి అనువాదాల్లోంచి జాలువారిన 'మంచి ముత్యం' ఒక 'ఆణిముత్యం'. ఆయన చేసిన అనువాదం ఆద్యంతం పాఠకులను ఆకట్టుకుంటుంది. నవల మూల రచయిత ఈయనేనా అన్నట్టుంది. ఎక్కడా ఎటువంటి తొట్రుపాటూ లేదు. లేశమంతైనా అతిశయోక్తి లేదు. మొదట్లో రచయిత గురించి చెపుతూ దేవరాజుగారు చెప్పుకున్నట్లు తన స్వీయరచనలా అనువాదం చేశారు. వారి జీవనశైలిని, వారు ఎదుర్కొంటున్న వివక్షను కళ్లకు కట్టింది. పేద, ధనికవర్గాల అంతరాలను తెలియజెప్పింది. రచయిత సృష్టించిన వర్ణనలను యథాతథంగా మనముందుంచేలా అనువాదకులు చేసిన కృషి అభినందనీయం. ఆయా ప్రదేశాల్లో మనమూ అక్కడే ఉన్నట్లు అనుభూతి పొందుతాం. అంతబాగా ఉంది రచన. ఆ వాతావరణాన్ని, వారి హావభావాల్ని, బాధల్ని కళ్లకు కట్టినట్లు చూపించారు. వారి కష్టాల్లో.. సంతోషంలో.. పాడుకొనే సంగీతం వారి సాంప్రదాయాన్ని తెలియజెప్పినట్లైంది. సంగీతంలో వారు తమ భావాలను వ్యక్తీకరించుకోవడం బాగుంది.

ఇక కథలోకి వెళితే...కీనో, జు ఆనా దంపతులు. వారికి కియోటిటో అనే ముద్దులొలికే చిన్నారి కొడుకు. పేదరికం ప్రేమానురాగాలకు ఏమాత్రం అడ్డుకాదన్నంత విశ్వాసం వారిది. కీనో చాలా మొరటువాడు. జు ఆనా చాలా తెలివైనది. కియొటిటోకు తేలుకుట్టడంతో కథ మొదలవుతుంది. తేలుకుట్టినప్పుడు పిల్లవాడిని రక్షించుకోవాలనే ఆ మాతృమూర్తి తాపత్రయం మనకి కన్నీరు తెప్పిస్తుంది. ఆ సందర్భంగా పిల్లవాడికి వైద్యం చేయించాలని మొట్టమొదటిసారి అడుగు ముందుకేసిన జు ఆనా వెనకే నడుస్తుంది గూడెమంతా. ఈ క్రమంలో తరతరాల వారి దారిద్ర్యం, ధనవంతులకూ వారికీ మధ్య ఉన్న అంతరం ఒక్కసారి ఆ చరిత్రను మన కళ్ల ముందుంచినట్లైంది. ధనవంతుడైన వైద్యుని పొగరబోతుతనం, డబ్బు ఆశ.. పేదవాడైనా ఉద్రేకంగా, కసిగా ఉన్న కీనోల వర్ణన వారి స్వతఃసిద్ధతను చెప్పకనే చెప్పినట్లైంది. డబ్బులేదన్న వైద్యుని హేళన కీనోలో కసిని మరింత పెంచుతుంది. వెనుదిరిగినా చెట్ల ఆకుల పసరుతో బిడ్డను రక్షించేందుకు తల్లిపడే ఆతృత జు ఆనాలో రచయిత మనకు చూపించారు. ఎంతో కసితో కీనో సముద్రంలో వేటాడతాడు. కీనోకు అతి విలువైన 'మంచి ముత్యం' దొరుకుతుంది. ఇక అక్కడ నుంచి అసలు కథ మొదలవుతుంది. అతని వద్ద ముత్యాన్ని చేజిక్కించుకోవాలని ధనవంతులు, దళారులు ఎంతగా ఆరాటపడతారో... ఎన్ని కుట్రలు పన్నుతారో.. అన్నది నేడు మనమూ ఎదుర్కొంటున్న దోపిడీ సమాజాన్ని గుర్తుచేసినట్లైంది. అంతేకాకుండా 'మానవసారంతో కలిసి ఏర్పడిన 'ఉత్సుకత' అనే నల్లటి మడ్డి, పట్టణమంతా వ్యాపించి గడ్డకట్టింది..' 'నలుపును, చెడును అనంతాల వరకు కలియబెట్టినట్లుంది' పట్టణపు విషగ్రంథుల్లో విషం తయారవుతూ ఉంది...' అన్న వాక్యాలు దోపిడీ పట్ల రచయిత కచ్చితమైన మనోభావాల్ని తెలుపుతోంది. ఆ ముత్యాన్ని చేతబట్టి కీనో తన కష్టాలన్నీ ఎలా గట్టెక్కి తన బిడ్డ బాగా చదువుకున్నట్లు, తామెంతో ధనవంతులమైనట్లు కలలు కంటాడు. సమాజంలోని దోపిడీ మృగాలు చివరకు అతని కుటుంబాన్ని వేటాడటంతో జు ఆనా ఆ ముత్యం వద్దు, మనకు నష్టమని బ్రతిమాలుతుంది, ఎదురుతిరుగుతుంది. అయినా పట్టుదలతో కీనో దాడిని ఎదుర్కోవడానికే సిద్ధపడతాడు. జు ఆనా అతని వెన్నంటి ఉంటుంది. చివరకు వారి కలలు కల్లలైనట్లు ముగించడం గుండెను పిండేసినట్లైంది. నేటి దోపిడీ సమాజంలో వాస్తవం కఠినంగానే ఉంటుంది మరి. కీనో, జు ఆనా ఆ ముత్యాన్ని సముద్రంలోకే విసిరేసి యథా ప్రకారం తమ జీవితాన్ని కొనసాగించడంతో కథ ముగుస్తుంది. వారి జీవితాల్లో ముత్యం 'మంచి' చేయకపోయినా..పేదలు ఎలా దోపిడీకి గురవుతున్నారో మన కళ్ల ముందుంచిందీ 'మంచి ముత్యం'. దోపిడీపై పేదవాని తిరుగుబాటును అర్థం చేసుకోవాలనేవారు 'మంచిముత్యం' చదవాల్సిందే.. ఇలాంటివి వెలుగులోకి తెచ్చిన రచయిత, అనువాదకులు ధన్యులు. అనువాదకులు దీన్ని అనువదించి 15 ఏళ్లపాటు అలాగే ఉండిపోయిందని పేర్కొన్నారు. నిజంగా సముద్రంలోని 'మంచి ముత్యం'లా ఇప్పటికైనా వెలికితీసి, వెలుగు చూపిన దేవరాజుగారు మనకో 'ఆణి ముత్యం' అందించినట్లే.

- శాంతిశ్రీ

కొత్త పుస్తకాలు

విశాల 'ధృక్పథాలు'ండాలి

దృక్పథాలు, రచన : డా॥ ఎస్వీ సత్యనారాయణ
పేజీలు : 186, వెల : 80/-,
ప్రతులకు : ఎస్.ఆర్.టి - 23 - ఆజమాబాద్.
రాంనగర్ వద్ద, హైదరాబాద్-500020.
మరియు విశాలాంధ్ర, ప్రజాశక్తి, నవోదయ
బుక్‌హౌస్‌లలో.

ఆధునిక తెలుగు కవిత్వం ఎప్పటికప్పుడు వినూత్న కవితాధోరణులలో (కవిత్వం) బహుముఖాలుగా విస్తరిస్తోంది. సాహితీ సాహిత్యాన్ని సుసంపన్నం చేస్తూనే సామాజిక - రాజకీయ - సాంఘీక - సమకాలీన - సమస్యల్ని, శ్రామిక వర్గ చైతన్యాన్ని కలిగిస్తోంది. అటువంటి తరుణంలో అరసం(అభ్యుదయ రచయితల సంఘం) హైదరాబాద్ కమిటి తరపున డా॥ ఎస్వీ సత్యనారాయణ "ధృక్పథాలు" పేరుతో ఈ గ్రంథాన్ని విడుదల చేశారు.

ఆధునిక కవిత్వం ఆవిర్భావ వికాసాలు, భావకవిత్వం, అభ్యుదయ కవిత్వం, ఆధునిక కవిత్వం, దిగంబర కవిత్వం, విప్లవ కవిత్వం, వర్తమాన కవిత్వం, దళిత కవిత్వం, ఆధునిక కవిత్వం, దళిత వాదం, స్త్రీ వాద కవిత్వం, వర్తమాన కవిత్వం - స్త్రీవాద ధృకృథం, సమకాలీన కవిత్వం, వస్తు వైవిధ్యం అనే విభిన్న అంశాలతో ఈ గ్రంథం పాఠకులకు, కవులకు కాబోయే రచయితలకు చక్కటి కరదీపిక లాంటిదే... ప్రయత్నం ప్రశంసనీయమే..

వాస్తవికత, తాత్వికత, సౌందర్యాత్మకతల మేలు కలయిక ఆధునిక కవిత్వం. కేవలం వాస్తవిక సంఘటనల సమాహారం కవిత్వం కాజాలదు. దానికి సౌందర్యాత్మకత తోడు కావాలి. కేవలం సౌందర్యాత్మకతతోనే కవిత్వం భాసించలేదు. దానికి తాత్వికత అంతర్వాహిని కావాలి. కవిత్వం ఎలా ఉన్నదో వివరించేది "రూపం". కవిత్వం ఏమంటున్నదో విడమర్చి చెప్పేది "వస్తువు" అనే డా॥ ఎస్వీ అనేక కవితా ఉద్యమ నేపథ్యాలతో పాటు అనేక మంది కవులు, కవయిత్రుల పలు కవితలు... వివిధ సందర్భాల గురించి చక్కగా రాశారు.

అయితే ఈ గ్రంథంలో పద్యకవుల ప్రస్తావన లేకపోవడం, మినీకవిత గురించి ప్రముఖంగా రాకపోవడం, సాహితీ రంగంలో విస్తృతంగా కృషి చేస్తున్న 'ప్రస్థానం'ను మాట మాత్రంగానైనా పేర్కొనకపోవడం బాధాకరం.

- కె.వి.ఎన్.ఎల్. ప్రసన్నకుమారి



మాస్టర్ చిత్రాలు

గుల్బర్గా ఫైన్ ఆర్ట్స్ కళాశాల, హైదరాబాదు వెంకటేశ్వర ఫైన్ ఆర్ట్స్ కళాశాలలకు చెందిన అధ్యాపక బృందం తీర్చిదిద్దిన నలభైకి పైగా చిత్రకళాఖండాలను హైదరాబాదు, ఐకాన్ ఆర్ట్ గ్యాలరీలో 'మాస్టర్స్ స్ట్రోక్' శీర్షికతో ఈ నెల 20 నుండి ప్రదర్శన కుంచారు. నిజంగానే అవి మాస్టర్ చిత్రాలు. ప్రతి చిత్రంలోను అనుభవంతో సమకూరిన పరిణతి ప్రతిఫలిస్తున్నది. విభిన్న ఇతివృత్తాలకు, రకరకాల మీడియాలకు చెందిన ఈ చిత్రాల ప్రదర్శన ఓ రకమైన సమగ్రత సంతరించుకున్నది. పూర్తి ఆకృతి చిత్రాల మొదలు, పాక్షిక ఆకృతి, పాక్షిక నైరూప్య, పూర్తి నైరూప్య చిత్రాలు, ల్యాండ్ స్కేప్‌లతో సహా ఇక్కడ కొలువు తీరాయి. అంతేకాదు సునామీ వైపరీత్యాన్ని ప్రతిబింబిస్తూ పరమశివ రూపొందించిన కోలేజ్, గౌతమి ఆనందని కేన్వాస్‌పై అక్రిలిక్ వర్ణాలతో రూపొందించిన టెలిఫోన్ లాంటి చిత్రాలు విభిన్నంగా కనిపిస్తూ ప్రేక్షకులను అలరిస్తున్నాయి. జితేందర్ ఫోటోరియాలిజం చిత్రాలు కూడ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి. మొత్తంగా ఈ ప్రదర్శన ఓ సంపూర్ణమైన చిత్రాలను దర్శించిన అనుభూతిని ప్రేక్షకులకు కలిగిస్తుంది. ఈ నెల 30 వరకు ఇది కొనసాగుతుంది.

- విజయరావు

అనగనగా ఒక గ్రామం. అక్కడ నలుగురు దొంగలు వుండేవారు. వారు మంచి మాటకారులు. జనాలకు కల్లబొల్లి కబుర్లు చెప్పి వారి దగ్గరున్న డబ్బు వస్తువులు దండుకునేవారు. వారి మూలంగా గ్రామంలో ప్రతి ఒక్కరూ విచారంగా వుండేవారు. చాలా మంది వారికి గుణపాఠం చెప్పాలనుకుంటారు. కానీ ఒక్కరు కూడా ఆ పనిలో విజయం సాధించలేకపోతారు. దాంతో దొంగలు వారిని మోసగిస్తూనే వుంటారు.

అదే గ్రామంలో ఒక రైతు కూడా వుండేవాడు. వీరికి మంచి గుణపాఠం చెప్పాలని అనుకుంటాడు. ఆ దెబ్బతో వారికి మరెవరినీ మోసం చేయాలన్న ఆలోచన కూడా రాకూడదు అనుకుంటాడు రైతు.

ఓసారి ఒక మహిళ బొమ్మ తయారుచేస్తాడు. దానికి చక్కటి చీర చుట్టి మొహాన ముసుగు వేస్తాడు. నకిలీ నగలు తొడుగుతాడు. ఆ బొమ్మను తీసుకెళ్లి రోడ్డుపక్కన చెట్టుకింద కూర్చోబెడతాడు. దొంగలు ప్రతి రోజూ ఆ మార్గం నుంచే వెళు తుంటారు. అందుకే ఆ చెట్టును ఎంచుకుంటాడు రైతు. ఈ ఏర్పాటంతా చేశాక రైతు ఓ చెట్టు వెనక నక్కి ఏం జరుగుతుందో గమనిస్తుంటాడు.

సాయంత్రం అయ్యాక, దొంగలు ఆ దారిన వస్తారు. ఓ మహిళ ఒంటి నిండా నగలు పెట్టుకుని ఆ చెట్టుకింద కూర్చుని వుండడం గమనిస్తారు. వారు కుతూహలంగా ఆమె దగ్గరకు వెళ్తారు. వారు తాకగానే ఆ మహిళ కింద పడిపోతుంది. ఆ వెంటనే రైతు తను దాక్కున్న చోటినుంచి బయటికి వచ్చి

"సాయం చేయండి... సాయం చేయండి... ఈ నలుగురు దొంగలూ నా భార్యను చంపేశారు. నేను చూసేసరికి వారు ఆమె నగలు దొంగతనం చేయాలని చూస్తున్నారు. అదంతా నేను చూశానని ... ఆమెను చంపేశారు" అనరుస్తాడు.

రైతు అంతటితో ఆగలా! దొంగల్లో ఒకడిని పట్టుకుని "నిన్ను పోలీసులకు పట్టిస్తాను. మీరు నా భార్యను చంపేశారు. మిమ్మల్ని ఉరి తీసేవరకు నేను ఊరుకోను" అంటాడు.

రైతుకు జరిగిన సంగతి చెప్దామని వారు ఎంతగా

రైతు - నలుగురు దొంగలు

అనుసృజన - చూటీ



ప్రయత్నించినా వినకపోగా పెద్దగా కేకలు వేస్తాడు.

రైతు నోటెంట 'ఉరి' అన్న మాట రావడంతో దొంగలు బాగా భయపడిపోతారు. పదే పదే జరిగిన సంగతి వివరంగా చెప్పాలని ప్రయత్నిస్తారు.

"మీరు హంతకులు. మిమ్మల్ని సహించేది లేదు" అంటాడు రైతు.

దాంతో చేసేది లేక నలుగురు దొంగలూ అతని కాళ్లదగ్గర కూర్చుని చేతులు జోడించి క్షమించమని కోరతారు. అయినా రైతు ఏమాత్రం వినడు. దాంతో ఒక ప్రతిపాదన పెడతారు. తమ చెల్లెల్ని రైతుకిచ్చి పెళ్లి చేస్తామంటారు. పైగా రెండింతల బంగారం, డబ్బు ఇస్తామంటారు. చనిపోయిన భార్య దహనసంస్కారాలకు కావాల్సిన డబ్బు కూడా అందిస్తామంటారు. రైతు అంగీకరిస్తాడు. దొంగలకు నిజం తెలియకూడదని ఆ వెంటనే మహిళ బొమ్మను హడావిడిగా దహనం చేస్తాడు.

ఉదయాన్నే దొంగల ఇంటికెళ్లి, వారి చెల్లెల్ని పెళ్లాడతాడు. వారిచ్చిన బోలెడన్ని నగలు, డబ్బుతో ఇంటికి తిరిగొస్తాడు.

♦♦♦

కొద్ది రోజుల తర్వాత భార్యతో రైతు "ఎప్పుడైనా మీ అన్నలు వస్తే నేను పనిచేసుకుంటున్న పొలం దగ్గరకు పంపించు" అని చెప్తాడు. పైగా వారికోసం హల్వా, పూరీ, స్వీట్లు, సమోసాలు...చేయమని చెప్తాడు. రైతు దగ్గర రెండు కుందేలు పిల్లలున్నాయి. వాటిలో ఒకటి ఎప్పడూ పొలంలో రైతు దగ్గర వుంటుంది. రెండోది ఎప్పడూ ఇంట్లో భార్య దగ్గర వుంటుంది.

ఓరోజు తమ చిన్నారి చెల్లెలు ఎలా వుందో చూడాలనుకుంటారు దొంగలు. ఓ ఉదయం పూట రైతు ఇంటికి వస్తారు. తన భర్త పొలంలో వున్నాడని అక్కడికి వెళ్లి కలవమని చెప్తుంది చెల్లెలు. దాంతో నలుగురు దొంగలు పొలం వెళతారు. అక్కడ పని చేసుకుంటున్న రైతును చూసి చాలా సంతోషిస్తారు. రైతు కూడా వారిని సంతోషంగా ఆహ్వానిస్తాడు. వారు చూస్తుండగానే కుందేలును పట్టుకొని

"ప్రియమైన కుందేలూ! నువ్వు తిన్నగా మన ఇంటికెళ్లు. తన అన్నల కోసం హల్వా, పూరీ, పాయసం, సమోసాలు చేయమని నా భార్యకు చెప్పు" అంటూ వదిలేస్తాడు. కుందేలు చెంగు చెంగున వెళ్లిపోతుంది.

సాయంత్రం నలుగురు దొంగలు, రైతు కలిసి ఇంటికి వెళ్లేసరికి ...రైతు చెప్పినవన్నీ వండి సిద్ధంగా పెడుతుంది చెల్లెలు. పైగా కుందేలు బుద్ధిగా ఆమె పక్కనే కూర్చుని వుంటుంది. అందుకు వారెంతో సంతోషపడిపోతారు. ఆ కుందేలును తమ వెంట తీసుకెళ్లాలని అనుకుంటారు. కుందేలును తమకు ఇమ్మని రైతును బతిమాలతారు. మొదట ఇష్టపడకపోయినా చివరికి అంగీకరిస్తాడు. ఇంక అది తమ వెంటే వుంటుందని, తాము ఎక్కడికెళితే అక్కడికి వస్తుందని, తాము చెప్పిన విషయాన్ని చెప్పమన్నవారికి తెలియచేస్తుంటుందని ఆశపడతారు. అంతేకాని రైతు తమను మళ్లీ మోసగించాడని ఊహించలేకపోతారు.

ఓసారి నలుగురు దొంగలు ఓ చోటికి వెళ్లాల్సి వస్తుంది. మార్గమధ్యలో తమ ఇంటికి వస్తున్న బంధువులు కన్పిస్తారు. వారికోసం మంచి భోజనం తయారుచేయమన్న సమాచారాన్ని భార్యలకు కుందేలు ద్వారా పంపాలనుకుంటారు.

(ఇంకావుంది)